అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 02-11-2023 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 302
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

చిన్నారుల శ్మశాన వాటిక

- గాజాలో ప్రతిరోజూ సగటున 400 మంది మృతి:: యూనిసెఫ్



జెనీవా : చిన్నారులు, మహిళలు లక్ష్యంగా ఇజ్రాయిల్ జరుపుతున్న అమానవీయ దాడులపై ఐరాస చిన్నారుల విభాగం (యూనిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. అక్టోబర్ 7 యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 3,500 మందికి పైగా చిన్నారులు మరణించినట్లు తెలిపింది. గాజా చిన్నారుల 'శ్మశాన వాటిక'గా మారిందని ...6లో

బీజేపీకే అత్యధిక విరాళాలు


- ఎలక్టోరల్‌బాండ్ల రూపంలో రూ.5,272 కోట్లు (57%)
- కాంగ్రెస్‌కు కేవలం 10 శాతం : ఏడీఆర్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
అత్యధిక ఎలక్టోరల్ బాండ్లు బీజేపీకే వచ్చాయని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) స్పష్టం చేసింది. ఏడీఆర్ డేటా ప్రకారం, ఎలక్టోరల్ బాండ్ల ...6లో

ఎన్నికల బాండ్లతో రహస్య వ్యాపారాలు!

- సంపన్నుల ప్రయోజనాలకు వినియోగం : సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : అధికారంలో వున్నవారితో రహస్యంగా వ్యాపారం చేసేందుకు సంపన్నులు ఎలక్టోరల్ బాండ్లను ఉపయోగించుకునే అవకాశం వుందని సుప్రీంకోర్టు ...9లో

తీస్తా సెతల్వాద్‌ను అరెస్టు చేయొద్దు

- చార్జిషీట్ దాఖలు చేయనందున సుప్రీంకోర్టు నిర్ణయం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
నిధుల దుర్వినియోగం కేసుకు సంబంధించి కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు అరెస్టు నుండి రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు బుధవారం ...9లో

గ్యాస్ బాదుడు

- తాజాగా రూ. 101.50 పెంపు..రెండు నెలల్లో రెండోసారి...
- రూ.2000కు చేరువలో వాణిజ్య సిలిండర్ ధర



వివరాలు 9లో..

మళ్లీ నిఘా!



ఎన్నికల వేళ మోడీ ప్రభుత్వంపై స్పైవేర్ ఆరోపణలు

- కప్పదాటు వివరణ ఇచ్చిన యాపిల్
- అనుకూల మీడియా సాయంతో కేంద్రం నష్టనివారణ చర్యలు

రాజకీయ ప్రత్యర్థులపై స్పైవేర్ ఆయుధాన్ని ప్రయోగించడం వారి గోప్యత హక్కుకు భంగం కలిగించడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. ఎన్నికల ప్రక్రియను పక్కదారి పట్టించడమే . అంతేకాక అధికార పార్టీ ప్రయోజనాల కోసం స్పైవేర్ కొనుగోలుకు ప్రభుత్వ ధనాన్ని వెచ్చించడం అవినీతి నిరోధక చట్టం, ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం నేరం. మరి నేడు దేశంలో జరుగుతున్నదేమిటీ..? అమెరికాలో అయితే ఇలాంటి నిఘా ఆరోపణలపై అప్పటి దేశాధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. మరి మన దేశంలో అలాంటివి కనీసం ఊహించగలమా..?

న్యూఢిల్లీ : 'మీ ఫోన్లను ప్రభుత్వ ప్రేరేపిత హ్యాకర్లు' హ్యాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఐ ఫోన్ల తయారీ సంస్థ యాపిల్ నుండి తమకు అలర్ట్ నోటిఫికేషన్ వచ్చిందని పలువురు ప్రతిపక్ష నేతలు చేసిన ప్రకటనలు దేశంలో రాజకీయ అలజడి సృష్టించాయి. కానీ ఏ ప్రభుత్వం లేదా ఏ సంస్థ హ్యాకింగ్‌కు ప్రయత్నిస్తోందో యాపిల్ చెప్పడం లేదు. అయితే అది నకిలీ అలర్ట్ అయి ఉండవచ్చునని, హ్యాకింగ్ ప్రయత్నం జరగలేదని యాపిల్ చెబుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. గతంలో కూడా ఇజ్రాయిల్‌కు చెందిన స్పైవేర్ పెగాసస్ ద్వారా ప్రతిపక్ష నేతలను, పలువురు సీనియర్ పాత్రికేయులను లక్ష్యంగా చేసుకొన్న విషయం తెలిసిందే. ఇపుడు కూడా బాధితులకు యాపిల్ సంస్థ నుంచి అలర్ట్‌లు వచ్చాయి. అంటే ప్రత్యర్థులపై, విమర్శకులపై మరోసారి పెగాసస్‌ను ప్రయోగిస్తున్నారా? లేకుంటే ప్రెడేటర్ వంటి ఇతర స్పైవేర్‌ను వాడుతున్నారా?

స్పైవేర్ అనేది ప్రపంచంలో పెద్ద వ్యాపారం. పలు దేశాల్లో పాలక పార్టీలు దానిని ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్నాయి. పాలకులు తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని ఆయుధంగా ఉపయోగించుకుంటూ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన స్పైవేర్ ఉత్పత్తిదారు ఎన్ఎస్ఓకు



చట్టాల ఉల్లంఘనే: నిపుణులు

క్లయింట్లుగా ఉన్న అనేక దేశాల ప్రభుత్వాలు దాని సాయంతో వేలాది మందిని లక్ష్యంగా ఎంచుకున్న విషయం తెలిసిందే. పెగాసస్ బాధితుల జాబితాలో మన దేశానికి చెందిన 140 మంది ప్రముఖులు ఉండడం గమనార్హం.

యాపిల్ గుర్తించింది కానీ...

ఇక తాజా పరిణామానికి సంబంధించి పలువురు ప్రతిపక్ష నేతలు మోడీ ప్రభుత్వంపై అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో యాపిల్ స్పందించింది. 'ప్రభుత్వ ప్రేరేపిత హ్యాకర్' హ్యాకింగ్‌కు పాల్పడ్డారని చెప్పలేమని ఆ సంస్థ వివరణ ఇచ్చింది. 2021 నుండి యాపిల్ సంస్థ ప్రపంచంలోని 150 దేశాలకు చెందిన పలువురు వ్యక్తులకు అలర్ట్ నోటిఫికేషన్లు పంపింది. అంటే దీనర్థం ఏమిటి? వివిధ ...9లో

నాలిక కరుచుకొని...

హ్యాకింగ్ ఆరోపణలు వెల్లువెత్తగానే మోడీ ప్రభుత్వం నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. ఈ అలర్ట్‌లు పొరబాటున పంపి ఉండవచ్చునంటూ అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేయించింది. పలు టీవీ ఛానల్స్ యాంకర్లు 'యాపిల్‌లోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ' అంటూ వార్తా ప్రసారాలు చేశారు. ఈ ఉదంతంపై యాపిల్ ఓ ప్రకటన చేస్తుందంటూ లీకులు ఇచ్చారు. ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలగని విధంగా వార్తలు అందించాలంటూ సీనియర్ మంత్రి ఒకరు సలహా ఇచ్చారని ఓ పాత్రికేయుడు 'ఆఫ్ ది రికార్డ్'గా చెప్పారు. అసలు మోడీ ప్రభుత్వమే యాపిల్ సంస్థతో వివరణ ఇప్పించిందని సీనియర్ పాత్రికేయులు వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారాన్ని కేంద్రం తేలిగ్గా తీసుకుంది. హ్యాకింగ్ ఆరోపణల్లో వాస్తవం, నిర్దిష్టతలు లేవని తేల్చేసింది. ఒక విషయం మాత్రం సుస్పష్టం. తాను చెప్పిన దాని కంటే వ్యవహారం చాలానే ఉందని యాపిల్‌కు తెలుసు. అయితే మరింత సమాచారం అందించేందుకు ముందుకు రావడం లేదు. బహుశా ఎలాంటి ప్రకటనలు చేయవద్దని యాపిల్‌ను మోడీ ప్రభుత్వం కట్టడి చేసి ఉండవచ్చు.



ఎన్నికల్లో పోటీపై నేడు తుది నిర్ణయం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై గురువారం నిర్ణయాన్ని ప్రకటిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కాంగ్రెస్‌తో సర్దుబాటు ఉంటుందా? లేదా? అన్నది గురువారం నాటికి స్పష్టత వస్తుందన్నారు. సీపీఐ, సీపీఐ(ఎం) ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించి తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో నిర్వహించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పరిశీలకులుగా హాజరయ్యారు.

అనంతరం మీడియాతో తమ్మినేని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన ఎత్తుగడలు, కాంగ్రెస్‌తో ఇప్పటి వరకు జరిగిన చర్చలపై రాష్ట్ర కమిటీలో చర్చించామన్నారు. మిర్యాలగూడ, వైరా స్థానాలను ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తు చేశారు. వైరా ఇవ్వబోమంటూ ఇప్పుడు అంటున్నదని చెప్పారు. గతంలో భద్రాచలం, పాలేరు వీలు కాదంటే వదులుకున్నామని అన్నారు. ఇస్తామన్న వైరా కూడా ఇవ్వబోమంటున్నారని వివరించారు. ఇంతకంటే తాము తగ్గే అవకాశం లేదన్నారు. ఆ రెండు సీట్లు ఇవ్వకుంటే విడిగా పోటీ చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామని మూడురోజుల కింద ప్రకటించానని చెప్పారు. అందుకనుగుణంగా నియోజకవర్గాల వారీగా చర్చించామని అన్నారు. 'పోటీకి సంబంధించి తుది నిర్ణయం తీసుకోవద్దు. సోనియాగాంధీ అనారోగ్యం వల్ల మంగళవారం కాంగ్రెస్ సమావేశం జరగలేదు. బుధవారం సాయంత్రం లేదా గురువారం ఉదయంకల్లా సమాచారం ఇస్తాం. పాజిటివ్‌గానే నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తాం. మీ నిర్ణయాలు ఇప్పుడే తీసుకోవద్దు'అని కాంగ్రెస్ నేతలు తమకు ఫోన్ చేశారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాన్ని బుధవారం నిర్వహించారని గుర్తు చేశారు.

అయితే రెండు రోజులు ఆగాలనీ, ఇద్దరం కలిసే నిర్ణయం తీసుకుందామని వారు కోరారని వివరించారు. ఈ విషయాలపై రాష్ట్రకమిటీలో చర్చించామన్నారు. సీపీఐతో గురువారం ఉదయం చర్చిస్తామని చెప్పారు. ఈలోపు కాంగ్రెస్ నిర్ణయం తెలుస్తుందని అన్నారు. మిర్యాలగూడ, వైరా సీట్లు కాంగ్రెస్ ఇవ్వకుంటే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏది ఏమైనా మధ్యాహ్నం మూడు గంటలకు మీడియా సమావేశాన్ని నిర్వహించి పోటీ చేసే నియోజకవర్గాలు, అభ్యర్థుల పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.

అనుకున్నంతా అయింది.. పరువంతా పోయింది

- ఎంపీపై దాడికేసులో తుస్సుమన్న సర్కారు యత్నం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తిదాడి వ్యవహారాన్ని వాడుకుని రాజకీయంగా ప్రయోజనం పొందాలనుకున్న బీఆర్ఎస్ పెద్దల ప్రయత్నం ఫలించలేదు. పోలీసుల ప్రాథమిక విచారణ సందర్భంగా ఎంపీపై దాడిచేసిన వ్యక్తి కేవలం సంచలనం సృష్టించడానికే ఈ చర్యకు పాల్పడ్డట్టు సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత మీడియాకు చెప్పడంతో అసలు సంగతి బయటకొచ్చింది. వాస్తవానికి ఎంపీపై దాడిని ఎవరూ సమర్థించాల్సిన అవసరం లేదు. ఖండించాల్సిందే. నేరం ...9లో

సంచలనంకోసమే దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థిపై దాడి



- సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత

వివరాలు 7లో

మోడీ దేశాన్ని ఏం చేస్తాడో..!

అన్నీ ప్రయివేటీకరిస్తున్నడు..



- మోటార్లకు మీటర్లు పెట్టాలని చెబుతుండు..
- రాహుల్‌కు ఎద్దు, ఎవుసం తెల్వదు..
- ఖమ్మం ప్రజలు ఏపీ, తెలంగాణ రోడ్లు చూడాలే..
- డబుల్ రోడ్డు వస్తే తెలంగాణ.. సింగిల్ రోడ్ వస్తే ఏపీ..
- మనం వెలుగుతున్నాం.. వారు ఉన్నచోటే ఉన్నారు : బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/సత్తుపల్లి/ఇల్లందు
"నరేంద్రమోడీ ఈ దేశాన్ని ఏమి చేస్తాడో..! ఎల్ఐసీని అమ్ముతున్నాడు.. విమానాశ్రయాలు, ఓడరేవులు.. ఇలా అన్నీ ప్రయివేటీకరణ చేస్తున్నాడు.. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టమంటున్నాడు" అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. మోటార్లు పెట్టేందుకు తాము వ్యతిరేకమని చెప్పామని తెలిపారు. ఉత్తర భారతదేశంలో దళితులపై దాడులు జరగని రోజే లేదన్నారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో దళితులు అణచివేతకు గురయ్యారని, వారిని సాటి మనుషులుగా గుర్తించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. 'దళిత చైతన్య జ్యోతి' కార్యక్రమం ద్వారా దళితబంధుకు రూపం ఇచ్చామని, ఇదేదో ఎన్నికల కోసం రూపొందించిన పథకం కాదన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సత్తుపల్లి, ఇల్లెందు నియోజకవర్గాల్లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ...9లో

ఎన్నికల తాయిలాలు అభ్యర్థుల ఖాతాల్లో కలపండి

- మద్యం కట్టడికి ఆధునికంగా ఆలోచించండి
- పోస్టల్ బ్యాలెట్లు ముందే అందచేయండి: రాష్ట్ర ఎన్నికల అధికారులకు సీఈసీ కేంద్ర బృందం ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనిఖీల్లో పట్టుబడిన ఎన్నికల తాయిలాలు, బహుమతుల ధరను లెక్కగట్టి, నామినేషన్ల ఖరారు తర్వాత ఆయా అభ్యర్థుల ఎన్నికల వ్యయంలో ఆ మొత్తాన్ని కలిపేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రత్యేక బృందం రాష్ట్ర అధికారులను ఆదేశించింది. అదే సమయంలో ఎన్నికలకు, రాజకీయాలకు సంబంధం లేని సామాన్యుల నగదు పట్టుబడితే, సాక్ష్యాధారాలు పరిశీలించి, వాటిని తిరిగి ఇచ్చేసే విషయంలో పారదర్శకంగా ఉండాలని చెప్పింది. ఈనెల 3వ తేదీన ఎన్నికల ...6లో

వారు విచ్ఛిన్నకారులు

మేం ప్రజలకు ప్రేమను పంచుతాం...

- బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎంఐఎంకు ఏటీఎంలు
- ఆ మూడు పార్టీలు ఒకటే
- ధరణితో లక్షల మంది రైతులకు నష్టం
- కాళేశ్వరం ప్రాజెక్టులో సీఎం అవినీతికి పాల్పడ్డారు
- మోడీ ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు..
- కారుకు పంచరయింది...: కల్వకుర్తి, షాద్‌నగర్ సభల్లో రాహుల్ గాంధీ




నవతెలంగాణ- మహబూబ్‌నగర్‌ప్రాంతీయ ప్రతినిధి/కల్వకుర్తి/ షాద్‌నగర్
కులమతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీ బీజేపీ అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బీజేపీ భారతీయులను విచ్ఛిన్నం చేసేలా కుట్రలు చేస్తుంటే, తమ పార్టీ దేశాన్ని ఏకం చేస్తూ ప్రజలకు ప్రేమను పంచుతున్నదని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీకి బీజేపీ, ఎంఐఎం పార్టీలు బీ టీమ్‌గా పనిచేస్తున్నాయని, ఎన్నికల అనంతరం వారందరూ ఒకటవుతారని అన్నారు. దీనికి నిదర్శనం ...6లో

నిన్న లక్ష్మీ.. నేడు సరస్వతి..

బ్యారేజీలకు లీకేజీలు..

- వరుస ఘటనలతో అయోమయం..
- బయటపడుతున్న కాళేశ్వరం లోపాలు



నవతెలంగాణ-భూపాలపల్లి/మహదేవపూర్
కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతా లోపాలు ఒక్కొక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. అన్నారం సరస్వతీ బ్యారేజీలో నీరు ఉబికి వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, బ్యారేజీ గోడలు బీటలు పట్టిన ఘటన మరువక ముందే మరో ఘటన చోటుచేసుకోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. అన్నారం సరస్వతీ బ్యారేజీలోని 28నుంచి 40 పిల్లర్ల మధ్య బుంగ పడినట్టు తెలిసింది. వరద నీరు విడుదలయ్యే ప్రదేశంలో 2 గేట్ల నుంచి నీరు ఉబికి వస్తున్నట్టు గమనించిన ఇంజినీరింగ్ అధికారులు.. వెంటనే అప్రమత్తమై ఇసుక సంచులు వేసి ఊటను ఆపే ప్రయత్నం చేశారు. ఒకవేళ ఇసుక నీటితోపాటు పైకి వస్తే ప్రమాదమేనని అధికారులు భావిస్తున్నారు. కాగా 10.87 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ బ్యారేజీని నిర్మించగా.. ప్రస్తుతం 5.71 టీఎంసీల నీరు ఉంది. ఒక గేటు ఎత్తి 2,357 క్యూసెక్కుల నీటిని దిగువకు ...9లో

గజ్వేల్ బరిలో ఈటల డౌటే?

ట్విస్టులు..జంపింగ్‌లతో అధిష్టానం బేజారు



- పార్టీ డీలాపడ్డదని బీజేపీ శ్రేణుల ఆగ్రహం
- పాత, కొత్త నేతలకు టార్గెట్‌గా మారిన రాజేందర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
గజ్వేల్ బరి నుంచి ఈటల తప్పుకున్నారా? హుజూరాబాద్ నియోజకవర్గం నుంచే పోటీలో ఉంటానని జాతీయ నాయకత్వానికి తేల్చిచెప్పారా? తనను నమ్మి వచ్చినవాళ్లకు కూడా టికెట్లు ఇప్పించుకోలేకపోతున్నాననే కోపంతో రగిలిపోతున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ చదరంగంలో హాట్‌టాపిక్‌గా మారాయి. ఢిల్లీ, తెలంగాణ కేంద్రాలుగా జరుగుతున్న పరిణామాలను చూస్తే ఇవి నిజమేననిపిస్తున్నాయి. ఆయన పార్టీ మారే అవకాశముందనే చర్చా నడుస్తున్నది. బీజేపీ తెలంగాణ శాఖలో జరుగుతున్న ఊహించని ట్విస్టులు..జంపింగ్‌లు... తదితర పరిణామాలతో జాతీయ నాయకత్వం సైతం బిత్తరపోతున్న పరిస్థితి నెలకొంది. ఈటల రాజేందర్ చేరిక తర్వాతనే పార్టీ డీలాపడ్డదని ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న హార్డ్‌కోర్ కార్యకర్తలు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ...6లో

భ్రమలు తొలిగినయ్.. రేకులు రాలుతున్నాయ్

- కాంగ్రెస్‌లోకి వివేక్ ఘర్‌వాపసీ
- బీజేపీకి ఏనుగు రాకేశ్‌రెడ్డి రాజీనామా
- విజయశాంతి, బాబూమోహన్, కొండా చూపు హస్తం వైపే!
- బీఆర్ఎస్ ఆపరేషన్ ఆకర్ష్
- తీవ్ర నైరాశ్యంలో కమలం పార్టీ



వివరాలు 6లో

ఒక్క నెలలో 1100 కోట్ల యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ చెల్లింపులు రికార్డ్ స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు 1,141 కోట్లకు చేరాయి. 1000 కోట్ల మార్క్‌ను నమోదు చేయడం చేయడం ఇది మూడో సారి. గడిచిన నెలలో లావాదేవీల విలువ రూ.17.16 లక్షల కోట్లుగా నమోదయ్యిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. ఇంతక్రితం సెప్టెంబరులో 1,056 కోట్లు, ఆగస్టులో 1,024 కోట్లు, జులైలో 996 కోట్ల చొప్పున యూపీఐ లావాదేవీలు చోటు చేసుకున్నాయి.

రూ.1.72 లక్షల కోట్ల జీఎస్‌టీ వసూళ్లు



న్యూఢిల్లీ : ప్రజలు, కంపెనీల నుంచి కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో పన్ను వసూళ్లను రాబడుతోంది. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో వస్తు సేవల పన్నులు (జీఎస్‌టి) రికార్డ్ స్థాయిలో రూ.1.72 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. దీంతో జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత రెండో సారి అత్యధిక వసూళ్లు చోటు చేసుకున్నట్లయ్యింది. ఇంతక్రితం 2023 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.1.87 లక్షల కోట్ల రాబడి చోటు చేసుకుంది. గతేడాది అక్టోబర్‌లోని రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే క్రితం నెల వసూళ్లలో 13 శాతం వృద్ధి చోటు చేసుకుంది. సిజీఎస్‌టి రూపంలో 30,062 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ కింద రూ.38,171 కోట్లు, ఐజీఎస్‌టీ కింద రూ.91,315 కోట్లు, సెస్ రూపేనా రూ.12,456 కోట్లు చొప్పున పన్నులు వసూళ్లయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గడిచిన నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 11 శాతం వృద్ధితో 8,127 కోట్ల జీఎస్‌టి వసూళ్లయ్యింది. తెలంగాణలో 19 శాతం పెరిగి రూ.11,377 కోట్లుగా నమోదయ్యాయి.

1.62 కోట్ల మందిలో నైపుణ్యాలు పెరగాలి

- సర్వీస్ నౌ అధ్యయనం

న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఏఐ) దూసుకొస్తున్న నేపథ్యంలో దేశంలో 1.62 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగుల్లో అదనపు నైపుణ్యాల పెంపు అవసరమని సర్వీస్ నౌ ఓ అధ్యయనంలో వెల్లడించింది. టెక్ కంపెనీ సర్వీస్‌నౌ, పియర్సన్ సంయుక్తంగా ఈ అధ్యయనం చేపట్టాయి. ఇందులో మెషీన్ లెర్నింగ్‌ని ఉపయోగించి, సాంకేతికత ప్రతి ఉద్యోగాన్ని రూపొందించే పనులను ఎలా మారుస్తుందో అంచనా వేసినట్లు పేర్కొంది. ఎఐ మరో 47 లక్షల కొత్త టెక్ ఉద్యోగాలను సృష్టించనుందని పేర్కొంది. వచ్చే ఐదేళ్లలో తెలంగాణలో 1,73,300 సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగాలు ఆటోమేషన్ ద్వారా అప్‌గ్రేడ్ చెందనున్నాయని అంచనా వేసింది.

సిగ్నిపై బి2సి ఫిలిప్స్ వెబ్‌సైట్ ఏర్పాటు


న్యూఢిల్లీ : దిగ్గజ లైటింగ్ కంపెనీ సిగ్నిపై కొత్తగా తమ ఫిలిప్స్ డైరెక్ట్ టు కన్స్యూమర్ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది, ఇది వినియోగదారుల లైటింగ్‌ను విప్లవాత్మకంగా మారుస్తుందని ఆ సంస్థ పేర్కొంది. నూతన ఇన్.షాప్.లైటింగ్.ఫిలిప్స్.కమ్ వేదికలో వివిధ విభాగాలలో 1000 కంటే ఎక్కువ వినియోగదారుల ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

మాన్యావర్ బ్రాండ్ అంబాసీడర్‌గా రామ్ చరణ్



న్యూఢిల్లీ : ప్రముఖ ప్రీమియం వస్త్ర ఉత్పత్తుల బ్రాండ్ మాన్యావర్ తన నూతన బ్రాండ్ అంబాసీడర్‌గా నటుడు రామ్ చరణ్‌ను నియమించుకుంది. ఇది పెళ్లిళ్లు, పండుగల సీజన్‌లో తమ ఉత్పత్తులను మరింత మందికి చేరవేసేందుకు దోహదం చేయనుందని ఆ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

హైదరాబాద్‌లో లాయిడ్స్ బ్యాంకింగ్ సెంటర్ ఏర్పాటు



హైదరాబాద్ : నగరానికి మరో ప్రతిష్టాత్మక సంస్థ వచ్చింది. బ్రిటన్‌లోని అతిపెద్ద ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్రూప్‌లలో ఒకటైన లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ నాలెడ్జ్ సిటీలో తమ లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ (ఎల్‌టిసి) కార్యకలాపాలను ప్రారంభించినట్లు బుధవారం వెల్లడించింది. తమ సంస్థ అంతటా ఎఐ, క్లౌడ్, బ్లాక్ చైన్ కార్యకలాపాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంది. కార్యాలయంలో ఉన్న ఫస్ట్ టీంలు యుకెలోని గ్రూప్ వినియోగదారులకు మద్దతు ఇవ్వడానికి డేటా, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్‌ను ఉపయోగించడంపై దష్టి పెడతాయని పేర్కొంది. ఇందుకోసం ఫుల్ స్టాక్, జావా బ్యాక్ ఎండ్, రియాక్ట్, క్లౌడ్ ఇంజినీర్స్, క్వాలిటీ ఇంజినీర్స్ వంటి స్పెషలిస్ట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. "లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించడం మా మొత్తం పరివర్తన ప్రయాణంలో ఒక కీలక ఘట్టం. యుకెలోని టెక్ టాలెంట్లో మా పెరుగుదలను పెంచుతుంది." లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాన్ వాన్ కెమెనాడ్ పేర్కొన్నారు.

ఎనిమిది నెలల కనిష్టానికి తయారీ

- ఎస్‌అండ్‌పీ గ్లోబల్ పీఎంఐ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో తయారీ రంగం ఎనిమిది కనిష్టానికి పడిపోయింది. గడిచిన నెలలో మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) 55.5కు తగ్గిందని ఎస్‌అండ్‌పి గ్లోబల్ తెలిపింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 57.5గా నమోదయ్యింది. ఈ సూచీ 50పైనా ఉంటే వృద్ధిగా.. దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. ద్రవ్యోల్బణం కొంత తగ్గినప్పటికీ దీర్ఘకాల దృష్టితో విశ్లేషిస్తే.. గరిష్టంగానే ఉందని ఎస్‌అండ్‌పి పేర్కొంది. ఇది అమ్మకాల అవకాశాలను దెబ్బతీస్తుందని హెచ్చరించింది. ఈ ఏడాది మార్చి తర్వాత ఇంత తక్కువ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి అని ఎస్‌అండ్‌పి పేర్కొంది. వినియోగదారుల వస్తువుల అమ్మకాల్లో మందగమనం ఉందని తెలిపింది. ఏప్రిల్ నుండి ఉద్యోగాల కల్పన రేటు స్వల్పంగా నెమ్మదించిందని విశ్లేషించింది.

జెట్ ఎయిర్‌వేస్ రూ.538 కోట్ల ఆస్తులు జప్తు

- మనీలాండరింగ్ కేసులో ఈడీ నిర్ణయం
- ఐదుగురిపై చార్జ్‌షీట్

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన రూ.538 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. జెట్ ఎయిర్‌వేస్ సంస్థ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్, ఆయన భార్య, కుమారుడికి చెందిన లండన్, దుబాయ్ సహా భారత్‌లో వివిధ ప్రదేశాల్లో ఉన్న 17 వాణిజ్య ఫ్లాట్‌లు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఇడి వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక సంక్షోభంతో 2019లో మూత పడిన జెట్ ఎయిర్‌వేస్.. కెనరా బ్యాంకులో రూ.538 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సెప్టెంబర్ ప్రారంభంలో నరేష్ గోయల్‌ను ఇడి అరెస్టు చేసింది.

మేం అడిగిన సీట్లు ఇస్తారన్న నమ్మకముంది

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తాము అడిగిన సీట్లు ఇస్తారన్న నమ్మకముందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. పొత్తులపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో నిర్వహించారు. అనంతరం మీడియాతో రాజా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమన్నారు. ఇండియా కూటమిలో తమ పాత్ర కీలకంగా ఉంటుందని చెప్పారు. బీజేపీని ఓడించేందుకు కలిసొచ్చే వారితో పొత్తులు పెట్టుకుంటామని స్పష్టం చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ మాట్లాడుతూ కొత్తగూడెం, బెల్లంపల్లి సీట్లు కోరామన్నారు. కొత్తగూడెం, చెన్నూరు ఇస్తామన్నారని గుర్తు చేశారు. సీపీఐ(ఎం) సీట్లపై చర్చ జరుగుతున్నదని వివరించారు. ఇండియా కూటమి బలపడడం వల్ల బీజేపీని నిలువరించొచ్చని చెప్పారు. కాంగ్రెస్‌లో వివేక్ చేరడం మంచి పరిణామమని అన్నారు. చెన్నూరులో సీపీఐ గెలుపునకు ఆయన కృషి చేయాలనీ, పార్లమెంటు ఎన్నికల్లో వివేక్ విజయం కోసం పనిచేస్తామని చెప్పారు. అనుమానాలు, ఊహాగానాలతో పొత్తును చెడగొట్టుకోలేమన్నారు. చంద్రబాబు అరెస్టు కక్షపూరితమైందనీ, న్యాయం బతికే ఉందనడానికి బెయిల్ నిదర్శనమని అన్నారు. జైల్లో ఉండాల్సిన వాళ్లు బయట ఉన్నారనీ, బయట ఉండాల్సిన వాళ్లు లోపల ఉన్నారని చెప్పారు. ఉల్లి కృత్రిమ కొరత సృష్టిస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పొత్తు అంశం చర్చల దశలో ఉందన్నారు. కాంగ్రెస్ తుది జాబితా ప్రకటించే వరకు వేచిచూస్తామని చెప్పారు. ఆ తర్వాత తమ నిర్ణయం తీసుకుంటామని అన్నారు. గురువారం ముఖ్యనేతల సమావేశం ఉంటుందన్నారు. కాంగ్రెస్‌తో అవగాహనలో భాగంగా తమకు రెండు సీట్లు ఇస్తామందనీ, మాట నిలబెట్టుకుంటుందని అనుకుంటున్నామని అన్నారు.

కోర్టులు మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది : కపిల్ సిబల్

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) తీవ్ర దుర్వినియోగంపై కోర్టులు మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ ఎంపీ కపిల్ సిబల్ అన్నారు. ఈ నెల 2న విచారణకు హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే.

సీనియర్ జర్నలిస్ట్ వై నాగేశ్వరరావుకు ఓయూ డాక్టరేట్ పట్టా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీనియర్ జర్నలిస్ట్ వై.నాగేశ్వరరావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఓయూ తెలుగు శాఖ నుంచి ఆచార్య డి.చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో "ఆధునిక తెలుగు సాహిత్యం-లౌకికవాదం" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను ఆయనకు డాక్టరేట్‌ను అందించారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్, అమెరికాలోని అడోబ్ సంస్థ చైర్మన్ అండ్ సీఈవో డాక్టర్ శంతన్ నారాయన్‌లు ఆయనకు పట్టాను అందజేశారు. హైదరాబాద్ కేంద్రంగా గత 34 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న వై. నాగేశ్వరరావు ప్రస్తుతం వార్త దినపత్రిక బ్యూరో చీఫ్‌గా పని చేస్తున్నారు. జర్నలిజం రంగంలో సేవలందిస్తున్నందుకుగాను 2018 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి "విశిష్ట సేవా పురస్కారాన్ని" (బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు) వై. నాగేశ్వరరావు అందుకున్నారు. రంగారెడ్డి జిల్లా కోహెడ గ్రామానికి చెందిన ఏనుగుల అండాలు నరసింహుల దంపతులకు 1964 సంవత్సరంలో ఆయన జన్మించారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా డాక్టర్ వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని లౌకికవాద కోణంలో ఎంతో ఆసక్తితో పరిశోధించి తన సిద్ధాంత గ్రంథాన్ని పూర్తి చేశానని తెలిపారు. తన సిద్ధాంత గ్రంథంలో పొందుపరిచిన సాహిత్య విశ్లేషణ ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యం ప్రజలను చైతన్యవంతం చేసిందని పేర్కొన్నారు. కుల, మత భేదాలు లేకుండా కలిసికట్టుగా జీవించే సమాజాన్ని ఆధునిక తెలుగు సాహిత్యం కోరుకుందన్నారు. దేశ సమైక్యతను కాపాడుకునేందుకు లౌకిక వాదంతో కూడిన మరిన్ని రచనలు రావాల్సిన అవసరం ఉందని ఆయన ఆకాంక్షించారు.

నేడు రాహుల్‌గాంధీ మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన

- మూడు గంటలు మాత్రమే అనుమతి

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్


ఇటీవల కుంగుబాటుకు గురైన మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీని పరిశీలించేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం వెళ్లనున్నారు. ఈమేరకు బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్‌మిశ్రా రాహుల్‌గాంధీ అక్కడికి వెళ్లేందుకు అనుమతిచ్చారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల మధ్యలోనే బ్యారేజీని పరిశీలించేందుకు రాహుల్‌కు అనుమతి ఇచ్చారు. ఉదయం ఆయన హెలికాప్టర్‌లో లక్ష్మిబ్యారేజీ సమీపంలోని అంబటిపల్లి గ్రామంలో ల్యాండ్ కానున్నారు. ఇదిలా ఉండగా మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించేందుకు రాహుల్ గాంధీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ టీపీసీసీ నేత శశిభూషణ్ కాచే ఎన్నికల అధికారికి బుధవారం వినతిపత్రం సమర్పించారు.

రూ.427 కోట్లకు చేరిన ఎన్నికల స్వాధీనాలు

- విస్తృతమైన తనిఖీలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న తనిఖీల్లో పట్టుబడిన స్వాధీనాల మొత్తం విలువ రూ.427 కోట్లకు పైగా ఉన్నదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం తెలిపింది. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అక్టోబర్ 9 నుంచి నవంబర్ 1వ తేదీ ఉదయం 9 గంటల వరకు నగదు, మద్యం, మత్తు పదార్థాలు, బంగారం, వెండి, ఆభరణాలు, ఇతర ఉచితాల మొత్తం విలువ దీనిలో కలిసి ఉందని వివరించారు.



ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్ష ఫీజు మాఫీ

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్ష ఫీజు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇక్కడ కోటి మందికిపైగా యువత నిరుద్యోగులుగా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ప్రదీప్ జైన్ ఆదిత్య మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్రంలో కోటి మందికిపైగా నిరుద్యోగులుండగా వీరిలో 40 లక్షల మంది ప్రభుత్వం వద్ద నమోదై ఉన్నారన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం ఉద్యోగాల కోసం పరీక్ష ఫీజుగా ఈ యువత నుంచి రూ.100 కోట్లకు పైగా వసూలు చేసిందని తెలిపారు. 'ఇది గత 10 ఏండ్లలో పేద అభ్యర్థులకు అనేక సమస్యలను సృష్టించింది. గత 18 ఏండ్లలో 17,298 మంది నిరుద్యోగ యువత బలవన్మరణాలకు పాల్పడ్డారంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు' అని అన్నారు.



యువకుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే యువతకు పరీక్ష ఫీజులు మాఫీ చేస్తామని, కేంద్ర మాజీ మంత్రి ప్రదీప్ జైన్ ఆదిత్య అక్టోబర్ 31న ఈ హామీ ఇచ్చారు. ఇదొక్కటే కాదు, ఫలితాలను నిలిపివేసిన పరీక్షలపై దర్యాప్తు చేయడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్‌లైన్ పరీక్షలకు బదులుగా ఆఫ్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తుందని ఆయన అన్నారు

రాష్ట్రంలో నవంబర్ 17న పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈసారి పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ, ఈ ప్రభుత్వం కేవలం 15 నెలలు మాత్రమే ఉంటుంది. జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడంతో కమల్‌నాథ్ ప్రభుత్వం పడిపోయింది. ఆ తర్వాత శివరాజ్ సింగ్ నేతత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.


ఉద్యోగ నియామకాల్లో మోసాలు, ఫలితాల ప్రకటనలో జాప్యం, పేపర్ లీకేజీల వల్ల యువత చాలా నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరగడానికి ఇదే ప్రధాన కారణం. వ్యాపం, పట్వారీ రిక్రూట్‌మెంట్ స్కామ్‌ల వంటి అనేక కుంభకోణాలు రాష్ట్రంలో జరిగాయి. ఇది యువత నైతికతపై ప్రత్యక్ష ప్రభావం చూపిందన్నారు.

బీజేపీకి ఆ రెండే తెలుసు...

" మతతత్వం, మత మార్పిడి" పేరిట రాజకీయం : ఛత్తీస్‌గఢ్ సీఎం



రాయ్‌పూర్ : బీజేపీకి మతతత్వం , మత మార్పిడి అనే రెండు అంశాలే ఉన్నాయి. రెండు వర్గాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చేయటం బీజేపీకి అలవాటుగా మారిందని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ అన్నారు. కాషాయ నేతలు ఏ పనీ చేయరు, ప్రజలతో పోరాడి ఓట్లు సేకరించరు. వారి మనసులో ద్వేషం, హింస ఉన్నాయి" అని బస్తర్‌లో జరిగిన సభలో సీఎం బఘేల్ అన్నారు. రాష్ట్ర మాజీ సీఎం రమణ్‌సింగ్‌పై విరుచుకుపడుతూ, "రమణ్‌సింగ్ హయాంలో బస్తర్‌లోని ఈ పచ్చని నేల ఎర్రగా మారింది...అన్న వ్యాఖ్యలపై సీఎం కౌంటర్ ఎటాక్ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7, 17 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఐదు రాష్ట్రాలలో ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న జరుగుతుంది.ఎన్నికల తేదీల ప్రకటనతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. అంతకు ముందు 2018 అసెంబ్లీ ఎన్నికలలో, 15 సీట్లు కైవసం చేసుకున్న అప్పటి అధికార బీజేపీకి వ్యతిరేకంగా 90 సీట్లలో 68 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ భారీ విజయాన్ని సాధించింది.



స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లయినా...

ఆ ఊరిలో అంధకారమే...

రాయ్‌పూర్ : ఇంటర్నెట్ యుగంలో, విద్యుత్ లేని జీవితాన్ని ఏ వ్యక్తి ఊహించలేడు, కానీ ఛత్తీస్‌గఢ్‌లోని ఒక గ్రామం ఉంది, ఇక్కడ ప్రజలు ఇప్పటికీ చీకటిలో జీవించాల్సి వస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా-దంతెవాడ సరిహద్దులో ఉన్న ఈ గ్రామానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్యుత్ లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు కావొస్తున్నా ఇక్కడి గ్రామస్తులకు కరెంటు వంటి కనీస సౌకర్యాలు లేవు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వినేవారు లేరు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ గ్రామానికి కరెంటు వస్తుందని గ్రామస్తులు భావిస్తున్నారు.

ఈ ఊరి పేరు రేటెంపర్ర... ఈ ఊరి ప్రజలు కరెంటు చూడలేదు. ఈ గ్రామంలో 90 కుటుంబాలకు ఒక చేతి పంపు మాత్రమే ఉంది. గజేంద్ర పాడామి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరాలలో తాను ఎప్పుడూ విద్యుత్తును చూడలేదని అన్నారు. పాడామి మాట్లాడుతూ.. స్థానిక అధికారులకు పలుమార్లు లేఖలు అందించినా ఫలితం లేకుండా పోయిందని, ఇంతకుముందు ఈ గ్రామానికి మావోయిస్టులు వచ్చేవారని, అయితే ఇప్పుడు భద్రతా శిబిరం ప్రారంభించిన తర్వాత వారు రావడం మానేశారు. బహుశా ఇప్పుడు ప్రభుత్వం మా మాట వింటుందని అన్నారు.

రెటెంపరను సందర్శించిన రోజు కూడా, పాడామి, తోటి గ్రామస్తులు సీపీఐ (మావోయిస్ట్) సభ్యుని







ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేసిన గ్రామస్థుడి కోసం అభ్యర్థించడానికి జిల్లా కేంద్రానికి వెళ్లారు. ఇటీవలి వరకు సీపీఐ (మావోయిస్ట్) సభ్యులు ఆహారం, నివాసం కోసం ఈ ప్రాంతానికి వచ్చేవారని ఇక్కడి గ్రామస్థులు అంగీకరిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాన్ని పట్టించుకోకపోవడానికి ఇదే కారణం కావచ్చు.

ఒక కుళాయితో గ్రామం మొత్తం

గ్రామంలో ఒకే ఒక చేతి పంపు ఉన్నది. స్థానిక ప్రజలకు ఇదే నీటి ఆధారమని పాడిమి అన్నారు. "చేతి పంపు ప్రతిరోజు 4-5 బకెట్ల నీటిని ఇస్తుంది . అది ఎండిపోతుంది. మేము ఎక్కువగా స్నానానికి, బట్టలు ఉతకడానికి స్ప్రింగ్ (వర్షం లేదా నది నీరు) మీద ఆధారపడతాము" అని అతను చెప్పాడు.

మొబైల్ బ్యాటరీ నుంచి చార్జ్

జోగా మాధవి ఒక గది ఉన్న ఇల్లు మధ్యాహ్నం కూడా చీకటిగా ఉంటుంది. ఒక మూలలో ఒక చిన్న ఇన్వర్టర్ బ్యాటరీ ఉంది, ఇది అతని పొరుగున ఉన్న యువకులకు లైఫ్ లైన్. ఈ బ్యాటరీని వినియోగించి మొబైల్ చార్జింగ్ పెట్టుకుంటాం.. వర్షాకాలంలో అది పనిచేయక చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి మొబైల్ చార్జింగ్ పెట్టుకుంటామని చెప్పారు.చాలా మంది పిల్లలు ఆశ్రమ (ప్రభుత్వం ఏర్పాటు చేసిన డే బోర్డింగ్) పాఠశాలలకు వెళతారని స్థానిక నివాసి మార్వి లక్మా చెప్పారు. "ఇప్పుడు మా ఊరిలో తగరపు పైకప్పు ఉన్న పాఠశాల ఉంది, కాబట్టి ఉపాధ్యాయులు వచ్చినప్పుడల్లా చిన్న పిల్లలు అక్కడికి వెళతారు. కానీ వారు పగటిపూట మాత్రమే చదువుకోవచ్చు," అని అతను చెప్పాడు. ఇప్పటికీ కరెంటు లేని సుక్మాలోని 142 గ్రామాలలో రెటెంపరా ఒకటి. ఈ ప్రాంతాల్లో నక్సలైట్ల ఉనికి పూర్తిగా అభివృద్ధి చెందకుండా వారిని దూరం చేసింది. కానీ ఇప్పుడు ఇతర గ్రామాల నుంచి సొంతూటికి చేరుకోవడంతో ఓట్లు కోరడానికి వచ్చినప్పుడు విద్యుత్ తమ ప్రధాన డిమాండ్ అని నాయకులకు చెప్పడానికి నివాసితులు సన్నద్ధమవుతున్నారు.

20 ఏండ్ల తర్వాత ఏడు గ్రామాలకు విద్యుత్తు

రెటెంపారా కరెంట్ కోసం ఇంకా వేచి ఉంది. అయితే సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుండేడ్ అక్టోబర్ 17న వెలిగిపోయింది. 20 ఏండ్ల తర్వాత తొలిసారిగా ఈ గ్రామానికి కరెంటు వచ్చింది. డిసెంబరు 2022లో ఈ సుక్మా గ్రామంలో భద్రతా శిబిరం ఏర్పాటు చేయబడింది. ఈ మారుమూల ప్రాంతంలో విద్యుదీకరణ, రహదారి నిర్మాణం , మొబైల్ టవర్ ఇన్‌స్టాలేషన్‌కు మార్గం సుగమం చేసింది. సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ మాట్లాడుతూ.. గ్రామస్తులు సంబరాలు చేసుకుంటున్నారని.. టీవీ, మొబైల్ ద్వారా గ్రామ పెద్దలు ఎన్నడూ చూడని కొత్త ప్రపంచాన్ని తమ పిల్లలు చూడాలని ఆకాంక్షించారు.దబ్బకొండ, పిడ్మెల్, ఏకలగూడ, దుర్మంగు, తుంబంగు, సింగన్‌పాడ్ , డోక్‌పాడ్‌లోని ఏడు గ్రామాలకు ఎన్నికల ముందు సంప్రదాయక విద్యుత్తు ద్వారా విద్యుద్దీకరణ జరిగింది. 342 కుటుంబాలు లబ్ది పొందాయని, మిగిలిన వారికి కూడా త్వరలో విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ 4వ జాబితాలో 32 మంది కొత్త ముఖాలు

టోంక్ జిల్లాలో సచిన్ పైలట్ నామినేషన్

జైపూర్: రాజస్థాన్‌లోని టోంక్ అసెంబ్లీ స్థానం నుంచి సచిన్ పైలట్ నామినేషన్ దాఖలు చేసిన కొన్ని గంటల తర్వాత, రాజస్థాన్ ఎన్నికల కోసం కాంగ్రెస్ 56 మంది అభ్యర్థులతో నాల్గవ జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో కొత్తగా 32 మంది అభ్యర్థులు ఉండటం గమనార్హం.

ఇద్దరు మద్దతిస్తున్న స్వతంత్రులు కాక 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ అభ్యర్థిత్వాన్ని పొందారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఈ జాబితాలో తన మద్దతుదారులకు టిక్కెట్లు పొందడంలో విజయం సాధించారు, అయినప్పటికీ పైలట్ విధేయులకు కూడా కొన్ని టిక్కెట్లు దక్కాయి. అయితే, ఈ జాబితాలో కూడా గత సంవత్సరం పార్టీ నాయకత్వంపై తిరుగుబాటుకు కారణమైన గెహ్లాట్ అనుచరులు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శాంతి ధరివాల్ , నీటి సరఫరా మంత్రి మహేష్ జోషి పేర్లు లేవు.

ఈ జాబితా తర్వాత, పార్టీ మొత్తం 200 మందిలో 151 మంది అభ్యర్థులను ప్రకటించింది. రాజస్థాన్‌లోని మొత్తం 200 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 25న ఓటింగ్ జరగనుంది, ఫలితాలు డిసెంబర్ 3న జరగనున్నాయి. అంతకుముందు రోజు సచిన్ పైలట్ తన వైఖరిని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిని ఖరారు చేస్తారు. "ఎవరూ ఒకరి సలహా ఆధారంగా లేదా స్వీయ ప్రకటన ద్వారా ముఖ్యమంత్రి కాలేరు," అని ఆయన అన్నారు.

సీఎం అశోక్ గెహ్లాట్ తన ఎన్నికల ప్రచారంలో తాను విజయం సాధిస్తే మరోసారి బాధ్యతలు చేపడతానని సూచించిన తరుణంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. రాజస్థాన్ అభ్యర్థులపై ఢిల్లీలో వరుస సమావేశాలు జరిగాయి. నాలుగో జాబితా జాప్యంపై పార్టీలో కలకలం చెలరేగినట్లు సమాచారం.

ఉదయ్‌పూర్ స్థానం నుంచి కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్‌కు టిక్కెట్టు ఇచ్చారు. బాలి స్థానం నుంచి మాజీ ఎంపీ బద్రీ రామ్ జాఖర్ పోటీ చేయనున్నారు. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత జస్వంత్ సింగ్ కుమారుడు మన్వేంద్ర సింగ్‌కు బార్మర్‌లోని శివనా స్థానం నుంచి టిక్కెట్టు ఇచ్చారు.



సారాతో విడాకులు

మీడియాతో తన ఇంటరాక్షన్ సందర్భంగా, సచిన్ పైలట్ జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా కుమార్తె అయిన తన భార్య సారాకు విడాకులు ఇచ్చినట్టు అంగీకరించారు. టోంక్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలతో పాటు దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో

మారిన పద్ధతి

టిక్కెట్ల పంపిణీపై వ్యతిరేకత అంతంతే

సర్వే ఫలితాల ఆధారంగా టిక్కెట్లు

న్యూఢిల్లీ : టిక్కెట్ల పంపిణీపై సాధారణ నిరసన ఈసారి కనిపించలేదు. అక్కడక్కడా కొంత వ్యతిరేకత కనిపించినా అంతగా బలంగా లేదు.

అక్టోబర్ 15న మధ్యప్రదేశ్‌లో 144 మంది అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ విడుదల చేసింది. ఈ జాబితా చాలా మందిని ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఈ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించేందుకు చివరి క్షణం వరకు వేచి ఉండడమే ఇందుకు కారణం. టికెట్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసే వారి నుంచి వ్యతిరేకత రాకుండా ఉండడమే దీని ఉద్దేశం. ఈసారి సంప్రదాయం నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్ ఎందుకు నిర్ణయించుకుందనేది ప్రశ్న. వాస్తవానికి, ఈసారి పార్టీ కేంద్ర కమిటీ (సీఈసీ) రాష్ట్ర యూనిట్ నుంచి అభ్యర్థుల జాబితాను అందుకుంది. ఈ జాబితా నుంచి అభ్యర్థులను ఎంపిక చేసేందుకు హై ప్రొఫైల్ కమిటీ కొద్ది నిమిషాల సమయం మాత్రమే తీసుకుంది. దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్‌లు పరస్పరం కుమ్ములాటలకు సంబంధించి జరుగుతున్న చర్చలకు స్వస్తి చెప్పేందుకు ఇప్పటికే ప్రయత్నాలు చేశారు. ఈ ఇద్దరు నేతలు ఒక్కటవ్వడం ఇతర నేతలపైనా ప్రభావం చూపింది.

కమల్ నాథ్, దిగ్విజయ్ మధ్య సయోధ్య

గతంలో కూడా దిగ్విజయ్ సింగ్‌ను ప్రలోభపెట్టేందుకు కమల్‌నాథ్ ప్రయత్నించారు. కానీ, వారు విఫలమయ్యారు. అయితే ఆ తర్వాత ఇరువురు నేతల మధ్య సయోధ్య కుదిరింది. అక్టోబర్ 19న కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. అలాగే తమ నియోజకవర్గంలోని కార్యకర్తల నుంచి వ్యతిరేకత రావడంతో తొలి జాబితాలో ముగ్గురు అభ్యర్థుల పేర్లను మార్చారు. ఇప్పుడు టిక్కెట్ల పంపిణీపై మామూలుగా ఉన్న నిరసన ఈసారి కనిపించలేదు. అక్కడక్కడా కొంత వ్యతిరేకత కనిపించినా అంతగా బలంగా లేదు. గత 2-3 ఏండ్లలో కమల్ నాథ్ , ఆయన బందం అనేక సర్వేలు నిర్వహించిందని అంటున్నారు. వీటిలో 230 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిఘా పెట్టే ప్రయత్నం చేశారు. ఇది ఎన్నికల్లో గెలుపొందే అభ్యర్థుల ఎంపికకు దోహదపడుతుందని పార్టీ వర్గాలు అంటున్నాయి..

సర్వే ఆధారంగా 70 శాతం టిక్కెట్లు పంపిణీ

సర్వే ఫలితాల ఆధారంగా ఈసారి 60-70 శాతం టిక్కెట్లు ఇచ్చారు. చంబల్-గ్వాలియర్ ప్రాంతంలో అభ్యర్థుల ఎంపికలో ఈసారి పెద్దగా ఇబ్బంది లేదు. దీనికి కారణం ఈ ప్రాంతానికి చెందిన ప్రముఖ నేత జ్యోతిరాదిత్య సింధియా 2020లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడమే. టిక్కెట్ల పంపిణీలో సింధియా ఎప్పుడూ ఎక్కువ ప్రభావం చూపేవారు. దీనికి కారణం ఈ ప్రాంతంలో ఆయనకు గట్టి పట్టు ఉండటమే. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లో కూడా ఈసారి కాంగ్రెస్ తొలిసారిగా స్క్రీనింగ్ కమిటీ సభ్యులను పంపింది. సభ్యులు ప్రతి జిల్లాకు వెళ్లి అక్కడ సంభావ్య అభ్యర్థులతో మాట్లాడారు. ఇది అట్టడుగు స్థాయిలో సంభావ్య అభ్యర్థుల గురించి సమాచారాన్ని సేకరించడంలో సహాయపడింది. దీంతో టిక్కెట్ల పంపిణీలో లాబీయింగ్ తగ్గింది.





బాఘేల్ , సింగ్‌దేవ్ మధ్య సఖ్యత

ఛత్తీస్‌గఢ్‌లో మూడు జాబితాల్లో అభ్యర్థుల పేర్లను విడుదల చేశారు. 71 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 22 మందికి టిక్కెట్లు ఇవ్వకూడదని నిర్ణయించారు. వాస్తవానికి, ఛత్తీస్‌గఢ్‌లో అధికార వ్యతిరేక వేవ్‌ను ఎదుర్కోవడం కాంగ్రెస్‌కు కూడా సవాలుగా ఉంది, ఎందుకంటే ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ తన ఐదేండ్ల పదవీకాలం పూర్తయిన తర్వాత రెండవసారి సీఎం కావాలని పోరాడుతున్నారు. అయితే, ఈసారి 90 స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో ఆయనకు, ప్రత్యర్థి టీఎస్ సింగ్‌దేవ్‌కు మధ్య సమతూకం పాటించే ప్రయత్నం జరిగింది.

ఈ 11 స్థానాల్లో ఎవరి ఎమ్మెల్యే గెలిస్తే...

ఆ పార్టీదే సర్కారు..

- గత 50 ఏండ్లుగా ఇదే ట్రెండ్



ఇండోర్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు అనేక యాధృచ్ఛికాలతో నిండి ఉన్నాయి. ఇక్కడ మాండ్లా జిల్లా నివాస్ అసెంబ్లీని పరిశీలిస్తే.. గత 50 ఏండ్లుగా ఈ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీయే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇది కాకుండా, రాష్ట్రంలో ఇలాంటి సీట్లు చాలా ఉన్నాయి. ఇక్కడ గత 24 ఏండ్లు లేదా 29 ఏండ్లుగా ఇదే ధోరణి కొనసాగుతోంది. అందువల్ల ఈ స్థానాలను గెలుచుకోవడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. నివాస్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ తన కేంద్ర మంత్రి ఫగన్ సింగ్ కులస్తేను రంగంలోకి దించింది.

2018లో, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేయబడిన రెసిడెన్షియల్ అసెంబ్లీ నుంచి ఫగన్ సింగ్ కులస్తే తమ్ముడు రామ్ ప్యారే కులస్తేకి బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. అయితే, ఆయన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ మార్స్కోలే చేతిలో ఓడిపోయారు. దీంతో కమల్ నాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అయితే, తర్వాత జ్యోతిరాదిత్య సింధియా , అతని మద్దతుదారుల తిరుగుబాటు కారణంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలో కూలిపోయింది. బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చింది అనేది వేరే విషయం. రామ్ ప్యారే కులస్తే 2003 నుంచి నిరంతరం ఎమ్మెల్యేగా ఉన్నారు .అపుడు బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది.గతంలో 1977లో ఇక్కడ జనతా పార్టీ అభ్యర్థి గెలుపొందడంతో రాష్ట్రంలో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాత కాంగ్రెస్ 1980, 1985లో వరుసగా రెండుసార్లు ఈ స్థానాన్ని గెలుచుకుని రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేసింది. అయితే 1990లో ఫగన్ సింగ్ కులస్తే ఈ సీటును తిరిగి బీజేపీని గెలిపించారు. ఆ పార్టీ రాష్ట్రంలో కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1993 అసెంబ్లీ ఎన్నికలలో, కులస్తే ఎన్నికలలో ఓడిపోయారు . రాష్ట్రంలో బీజేపీ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. 1998లో కూడా కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని కైవసం చేసుకోవటంతో పాటు రాష్ట్రంలో తమ ప్రభుత్వాన్ని నిలుపుకుంది

అణచివేతను ఎదిరించే ప్రవృత్తి మనిషిలో స్వభావసిద్ధంగా ఉంటుంది.
- టాసిటస్

సంపాదకీయం

పార్టీలకు 'ఉద్యోగం...'

ఇప్పుడు ఎన్నికల కాలం నడుస్తోంది. పాత పార్టీలో తమ కొలువు (టిక్కెట్)లేదని తెలుసుకుంటున్న నేతలు... ఉపాధి, ఉద్యోగం (రాజకీయ భవిష్యత్) కోసం కొత్త పార్టీలోకి జంపవుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటిదాకా తామున్న పార్టీ ఇచ్చిన వాగ్దానాలపై విమర్శలు గుప్పిస్తూ.. ఇప్పుడు తాము చేరిన కొంగొత్త పార్టీల హామీలపై ప్రశంసలు కురిపిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ వాగ్దానాలు, హామీల్లో ఇటీవల కాలంలో చర్చనీయాంశమైంది నియామకాలు. అసలు ప్రత్యేక తెలంగాణ నినాదమే నీళ్లు, నిధులు, నియామకాలు. ఈ ట్యాగ్‌లైన్లలో ఇప్పటిదాకా యువత ఉత్సాహంగా ఎదురు చూసింది ఉద్యోగాలు. వాటి కోసం అదే యువత పడిగాపులు కాసింది.. అవి రద్దవటంతో నిర్లిప్తత, నైరాశ్యంలో కూరుకు పోయింది. కానీ ప్రస్తుత అసెంబ్లీ ఎలక్షన్ సీజన్‌లో ఈ అంశం చుట్టే కారు, కమలం పార్టీలు రాజకీయం చేస్తూ అసలు అంశాన్ని పక్కదోవ పట్టిస్తున్నాయి.

ఉద్యోగాలు, కొలువులు, ఉపాధి అనే నినాదాలు రాజకీయ పార్టీలకు, వాటి నేతలకు 'ఉపాధి హామీ పథకాలు' కాకూడదు. ఈ స్లోగన్స్ కేవలం నాయకులకు 'ఉద్యోగాలిచ్చే' మార్గాలుగా మారకూడదు. ఒక రాష్ట్రం, దేశం స్వయం సమృద్ధిని సాధించాలంటే మొదట యువత తమ కాళ్ల మీద తాము నిలబడగలిగే స్థితిని కల్పించాలి. అందుకోసం వారికి విరివిరిగా అవకాశాలు కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా దూసుకెళుతూ.. కొత్త పుంతలు తొక్కుతున్న వేళ... సరికొత్తగా అది లక్షలాది కొలువులను సృష్టించాలి. ఇందుకు ప్రభుత్వాలు, పాలకులు పూనుకోవాలి.

కేంద్రంలో ఉన్న బీజేపీ గత పదేండ్లుగా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానంటూ గద్దెనెక్కిన మోడీ సర్కార్... కొత్త కొలువుల సంగేతేమోగానీ, ఉన్న ఉద్యోగాలను ఊడబెరికి జనాలకు రోడ్ల పాల్జేసింది. విమానాలు, రైల్వేలు, పోర్టులు, పోస్టాఫీసులు, బ్యాంకులు... ఇలా ఒకటేమిటి గత పదేండ్లుగా ఒక్కో రంగాన్ని ప్రయివేటీకరిస్తూ లక్షలాది ఉద్యోగులను బయటకు గెంటేసింది. తద్వారా మునుపెన్నడూ లేనంతగా నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. మధ్యలో టాపిక్‌ను డైవర్ట్ చేసేందుకు అగ్నిపథ్‌లాంటి పథకాన్ని తెరపైకి తెచ్చినా అది వికటించి.. నిరుద్యోగుల ఆగ్రహానికి గురైంది. ఈ వాస్తవాలను మరుగుపరుస్తున్న రాష్ట్ర బీజేపీ నేతలు... ఉద్యోగాలివ్వలేదంటూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండటం కడు విడ్డూరం.



ఇదే సమయంలో పదేండ్లలో తెలంగాణలో ఇచ్చినన్ని కొలువులు దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇవ్వలేదంటూ బల్లగుద్ది మరీ చెప్పిన గులాబీ పార్టీ... మరి ఈ పదేండ్ల కాలంలో జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు ప్రవేశపెట్టలేదో చెప్పనుగాక చెప్పదు. దేశంలోని అన్ని రాష్ట్రాలతో ఎందుకు గానీ... దక్షిణాదిలోని కేరళ, తమిళనాడుతో పోల్చి చూసుకుంటే, ఆ రెండు రాష్ట్రాల్లో ప్రతీయేటా ఎంత మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు.. వారిలో మహిళలెంత..? పురుషులెంత..? అనే లెక్కలను శాఖలు, రంగాలు, జిల్లాల వారీగా తీసి మరీ జాబ్ క్యాలెండర్‌ను ప్రచురిస్తుంటారు. అలా ప్రకటించిన వెంటనే... అదే ఏడాది ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయటం, ఆ వెంటనే నిర్ణీత సమయంలోగా వాటిని భర్తీ చేయటం ఆయా రాష్ట్రాల్లో ఆనవాయితీ. కానీ ఇక్కడ అందుకు పూర్తి విరుద్ధం. 'మాదేమైనా అహోబిల మఠం అనుకున్నరా.. ఫక్తు రాజకీయ పార్టీ.. మేం ఏం చేసినా రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తం.. అందుకనుగుణంగానే మా చర్యలుంటయ్...' అంటూ తెలంగాణ వచ్చిన కొత్తలో పెద్ద సారు చెప్పినట్టు... ఎన్నికలు, ఉప ఎన్నికల నోటిఫికేషన్ల కోసమే ఉద్యోగ నోటిఫికేషన్లను బీఆర్ఎస్ సర్కారు వేస్తోందే తప్ప ఖాళీల భర్తీకి కాదనే అపవాదును అది మూటగట్టుకుంది. ఇప్పుడు ఎన్నికల సమయం కాబట్టి... ఇటీవల నిర్వహించిన ఓ మీట్ ది ప్రెస్‌లో 'ఈసారి నుంచి కచ్చితంగా జాబ్ క్యాలెండర్ వేస్తం..' అంటూ కారు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హామీ ఇచ్చినప్పటికీ, దానికి ఎలక్షన్ స్టంట్ అనే ముద్ర పడిపోయింది. ఎందుకంటే 2018 ముందస్తు ఎన్నికల్లో సైతం 'నిరుద్యోగ భృతి' అని వాగ్దానమిచ్చి.. ఆ తర్వాత మొండిచేయి చూపారు కాబట్టి.

ఈ క్రమంలో ఉద్యోగాలు, కొలువులు, ఉపాధి అనే నినాదాలు రాజకీయ పార్టీలకు, వాటి నేతలకు 'ఉపాధి హామీ పథకాలు' కాకూడదు. ఈ స్లోగన్స్ కేవలం నాయకులకు 'ఉద్యోగాలిచ్చే' మార్గాలుగా మారకూడదు. ఒక రాష్ట్రం, దేశం స్వయం సమృద్ధిని సాధించా లంటే మొదట యువత తమ కాళ్ల మీద తాము నిలబడ గలిగే స్థితిని కల్పించాలి. అందు కోసం వారికి విరివిరిగా అవకాశాలు కల్పించాలి.

సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా దూసుకెళుతూ.. కొత్త పుంతలు తొక్కుతున్న వేళ... సరికొత్తగా అది లక్షలాది కొలువులను సృష్టించాలి. ఇందుకు ప్రభుత్వాలు, పాలకులు పూనుకోవాలి. వారు ఆ విధంగా పూనుకునేలా ఓటర్లు చేయాలి. ఓటనే తమ వజ్రాయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలి. తమకు ఉద్యోగాలు, ఉపాధి చూపించకపోతే... నేతలకు, పార్టీలకు 'ఉద్యోగాలు ఊడిపోతాయి' అనే విధంగా గట్టి హెచ్చరికలు పంపగలగాలి. దానికి ప్రస్తుత ఎన్నికలే సరైన సమయం.

అణచివేతే లక్ష్యంగా..

అశుతోష్ శర్మ

తొమ్మిదేండ్ల నరేంద్రమోడీ పాలనలో ప్రధాన స్రవంతిలోని ఒక ముఖ్యమైన విభాగం, ప్రభుత్వ ప్రచార విభాగంగా మారింది. ఇది హిందూత్వ అనుకూల మీడియా సంస్థల ఆవిర్భావంతో సమానంగా ఉంది. ఇది అధికార పార్టీ అజెండాను సమర్థించి విస్తరించడమేకాక, మీడియా సంస్థలపై, విద్యావేత్తలపై, జర్నలిస్టులు, ప్రజామేధావులపై క్రమం తప్పకుండా దాడి చేస్తుంది. సవరించిన యూఏపీఏను ప్రభుత్వం, అణచివేయడానికి ఉపయోగించడం, పౌరుల గోప్యత హక్కును రక్షించేందుకు అవసరమైన లేదా సరిపోని, అసమర్థమైన చట్టాలు, ఉగ్రవాదంపై, ప్రపంచ నిఘా సంస్థ అయిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) సిఫార్సులను, ఆర్థిక సహకారం, సైద్ధాంతిక విరోధులను తటస్థం చేయడం కోసం ఈ చట్టాలను తమ గుప్పిట్లో ఉంచుకుంటుంది.

న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన నివేదికలో ఒక పారాగ్రాఫ్‌లో మాత్రమే న్యూస్‌క్లిక్ గురించి ప్రస్తావన ఉంది. న్యూ ఢిల్లీలోని ఫిల్లింగ్‌షోలో, మిస్టర్ సింగమ్స్ నెట్‌వర్క్, న్యూస్ సైట్ న్యూస్‌క్లిక్‌కు ఆర్థిక సహాయం అందించిందని, అది చైనా మాట్లాడే అంశాలతో ఆసక్తిని రేకెత్తించిందని నివేదిక పేర్కొంది. తన వాదనను ధ్రువీకరించుకోవడం కోసం, న్యూస్‌క్లిక్ వీడియోను సూచించింది. అక్టోబరు2, 2019న ప్రచురింపబడిన వీడియో శీర్షిక ఈ విధంగా ఉంది. 1949లో నిర్వహించబడిన, చైనా విప్లవం 70వ వార్షికోత్సవం సందర్భంగా, పీపుల్స్ డిస్పాచ్, విప్లవ చరిత్రను పరిశీలిస్తుంది. అది చైనాను భూస్వామ్య దేశం నుండి సామ్యవాద లక్షణాలతో, ఒక ప్రపంచ శక్తిగా ఎలా మార్పు చెందిందో వివరిస్తుంది. నేటికీ, చైనా విప్లవ చరిత్ర శ్రామిక వర్గాలకు, ప్రజల పోరాటాలకు స్ఫూర్తినిస్తూనే ఉంది. పెట్టుబడిదారీ దోపిడీ, సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేక పోరాటాలకు స్ఫూర్తినిస్తున్నది. ఈ వీడియోను 10 వేల మందికి తక్కువగానే వీక్షించారు.

యాధృచ్ఛికంగా ఈ వెబ్‌సైట్, రష్యావిప్లవంపై ప్రసాద్ రాసిన ఒక భాగాన్ని ప్రచురించింది. డిసెంబర్ 2018లో చైనా 40 సంవత్సరాల సంస్కరణల గురించి న్యూస్ క్లిక్ కోసం చిన్న వ్యాసాన్ని రాశారు. డెంగ్జియావోపింగ్, చైనాను మావోయిస్టు అభివృద్ధి నమూనా నుండి, సోషలిస్టు సంస్థలుగా, మార్కెట్ ఆర్థిక వ్యవస్థగా ఎలా మార్చారో వివరించారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే, గత రెండేళ్లుగా న్యూస్ క్లిక్ చైనాకు సంబంధించి ప్రచురించిన కొన్ని కథనాలలో ఒకటి, కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై నెమ్మదిగా పురోగతిని వివరించే నివేదిక. గాల్వాన్ సంక్షోభం తరువాత, తూర్పు లడఖ్‌లోని ఫార్వర్డ్ ప్రాంతాలలో, ప్రవేశానికి పరిమితులు, కమ్యునికేషన్‌ను పూర్తిగా నిషేధించడాన్ని గూర్చి ప్రచురించింది. మరొక ఆందోళన కలిగించే అంశం చైనా భారత భూభాగంలోకి ప్రవేశం చిందని నిర్ధారించే డాక్యుమెంట్, రక్షణ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్ నుండి కనిపించకుండా పోయిందని.. క్యూరేటివ్ నివేదిక ఆందోళనకు దారితీసింది. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, బాహ్య, అంతర్గత భద్రత కోసం,సైనికేతర రాజకీయ పరిష్కారం కోసం పిలుపు నిస్తూ ప్రభుత్వానికి 140మంది సైనిక అనుభవజ్ఞులు పంపిన ప్రకటనను గురించి ఈ నివేదిక తెలియచేస్తుంది.

దాని వీడియో విభాగంలో, పోర్టల్‌లో న్యూస్‌క్లిక్‌లో కన్సల్టెంట్ అయిన పరంజ్యోయ్ గుహా ఠాకుర్తా ద్వారా రక్షణ విశ్లేషకుడు, రిటైర్డ్ కర్నల్ అయిన అజయ్ శుక్లా ఇంటర్వ్యూ ఉంది. "ఎవరూ భారత భూభాగంలోకి ప్రవేశం చలేదు. భారతీయ పోస్టులను ఎవరూ స్వాధీనం చేసుకో లేదు"అని 2000 జూన్‌లో ప్రధాని మోడీ చేసిన ప్రకటనపై శుక్లా ప్రశ్నలను లేవనెత్తారు.

ఇండియా-చైనా సంబంధాలపై, మాజీ నావీ అధికారి, చైనీస్ స్టడీస్‌లో సీనియర్ ఫెలో అయిన అతుల్ భరద్వాజ్‌తో పుర్కాయస్థ హోస్ట్‌గా, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆ ఇంటర్వ్యూ సారాంశం ఈ విధంగా ఉంది. "విదేశాంగ మంత్రులు భారత చైనా దేశాల మధ్య ఉన్న ఏ ఒక్క అసాధారణ సమస్యను కూడా పరిష్కరించలేరు. భారతదేశానికి చైనాతో ఉన్న విస్తృతమైన ఆర్థిక సంబంధాలపై, భిన్నమైన దృక్పథాన్ని కలిగి ఉండడానికి భారత దేశం అంగీ కరిస్తే తప్ప ఇది సాధ్యం కాద"ని తెలిపారు.

న్యూస్‌క్లిక్ నివేదికలు, వ్యాఖ్యానాలు ఎల్లప్పుడూ, ఆశ్రిత పక్షపాత ధోరణిని(క్రోనీ క్యాపిటలిజమ్)ను తీవ్రంగా విమర్శిస్తాయి. ప్రజాప్రయోజనాలకు సంబంధించి, ప్రధాన స్రవంతి మీడియాలో ముఖ్యమైన సమస్యలపై, చోటు లభించని అంశాలపై, తన శక్తికి మించి స్పందిస్తుంది.

లా అండ్ ఆర్డర్ సమస్యలు, ఆర్థిక వ్యవస్థకు నష్టాలను సష్టించేందుకు, న్యూస్ క్లిక్ రైతుల ఆందోళనను ప్రేరేపించి నిధులను సమకూర్చిందని, ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగించిందని ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. కోవిడ్ 19, పాండమిక్‌ను నియంత్రించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా, న్యూస్ క్లిక్ తప్పుడు కథనాన్ని అందించిందని కూడా ఆరోపించింది.

పోలీసులు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం,



బలమైన రక్షణ చట్టం లేనప్పుడు, పరికరాల జప్తు మళ్ళీ జరుగుతుంది. ఒక లక్ష్యంతో నిఘా పెంచడం పై తమ అసమ్మతిని తెలియజేసింది. 18 మీడియా సంస్థల నిర్వాహకులు, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్ ప్రెస్ కార్ప్స్, ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెనల్స్ కలిసి పాత్రికేయులను విచారించే విధానం, వారి ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంపై తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌ను డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు.

దుర్దేశంతో వచ్చారని ప్రభుత్వం లక్ష్యంగా చేయబడిన అనేక మంది జర్నలిస్టులు ఫ్రంట్ లైన్‌తో చెప్పారు. ఈ భాగాన్ని ప్రారంభంలో ఉదహరించిన విలేకరి మాట్లాడుతూ, రైతుల నిరసనలను సిఏఏ వ్యతిరేక పోస్టులను కవర్ చేశారా? అని అడిగారు. అతను అవును అని చెప్పినప్పుడు, "ఈ చట్టాలు జాతీయ ప్రయోజనాల కోసం రూపొందించబడ్డాయి. కానీ మీరు ప్రజలను తప్పుదారి పట్టించేందుకు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని" కోపగించుకున్నాడు. అహ్మద్ రషీద్ తాలిబాన్, మిలిటెంట్ ఇస్లాం, ఆయిల్ ఫండమెంటలిజమ్ ఇన్ సెంట్రల్ ఆసియా లాంటి పుస్తకాలు వారి వద్ద ఎందుకు ఉన్నాయని ప్రశ్నించాడు. జి-20 సదస్సును ఎందుకు ప్రచురించలేదని గుహా తకుర్తాను అడిగాడు.

ఎఫ్ఐఆర్‌లో, రాజ్యసభ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, ఫ్రీలాన్స్ కన్సల్టెంట్ ఉర్మిలేష్ పేరు కూడా ఉంది. సందేహాస్పద నిధులు జాతి వ్యతిరేక కార్యకలాపాల కోసం మా మధ్య పంపిణీ చేయబడ్డాయని చెప్పాడు. న్యూస్‌క్లిక్ ఆఫీస్ లాక్ చేయబడింది, కానీ ప్రధాన జాతీయ, అంతర్జాతీయ వార్తలకు స్పందిస్తూనే ఉంది.అక్టోబర్ 9న "గాజా విషయంలో భారత వైఖరి ఎందుకు నిలకడగా లేదో తెలియజేస్తూ 10 కారణాలను మాజీ డిప్లొమాట్ భద్రకుమార్ ద్వారా ప్రచురించింది. అజయ్ గుడవర్తి, తన వ్యాసంలో ప్రజారంగాన్ని ఏ విధంగా నేరపూరితం చేస్తున్నారో తెలియజేస్తూ, మీడియాపై, ఇతర ప్రజాస్వామ్య సంస్థలపై దాడులను గూర్చి చర్చించారు.

ప్రముఖ పాత్రికేయుడు, న్యూస్‌క్లిప్ కన్సల్టెంట్ అయిన బిసార్‌శర్మ, తన యూట్యూబ్ చానల్లో తన పరికరాలను జప్తు చేసినప్పుడు, తనకు ఎలాంటి వారంటూ చూపించలేదని, ఎలాంటి కారణం చెప్పలేదని చెప్పాడు. ఉర్మిలేష్ ఇలా అన్నారు. "ప్రజాస్వామ్య దేశంలో ఇది ఎప్పుడు జరగదు. వారు నా పుస్తకాలు లాప్టాప్, మొబైల్ ఫోనును జప్తు చేయాల్సింది కాదు".

బలమైన రక్షణ చట్టం లేనప్పుడు, పరికరాల జప్తు మళ్ళీ జరుగుతుంది. ఒక లక్ష్యంతో నిఘా పెంచడం పై తమ అసమ్మతిని తెలియజేసింది. 18 మీడియా సంస్థల నిర్వాహకులు, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్ ప్రెస్‌కార్ప్స్, ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ కలిసి పాత్రికేయులను విచారించే విధానం, వారి ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంపై తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌ను డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు.

కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 7వ అధ్యాయం శోధన, జప్తు (సిఆర్‌పిసి) గురించి తెలియజేస్తుంది. తక్షణ శోధన అవసరమయ్యే సందర్భాలలో, పోలీసులు కారణాలను తెలియజేయాలి. కానీ, సెక్షన్ 165, 102 సిఆర్‌పిసి కేవలం అనుమానం ప్రాతిపదికన, ఆస్తిని శోధించడానికి, స్వాధీనం చేసుకోవడానికి ఈ సెక్షన్లు అనుమతిస్తాయి.

నిర్బంధించబడిన చాలామంది జర్నలిస్టులు తమ వద్ద జప్తు చేసిన పరికరాలకు, పోలీసులు వాటి విలువను ఇవ్వలేదని ఆరోపించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 ప్రకారం, స్వాధీనం చేసుకున్న పరికరం, ఆష్ విలువను నమోదు చేయడం, చార్జ్‌షీట్‌తో పాటు కోర్టులో సమర్పించడానికి స్వాధీనం చేసుకున్న మెమో కాపీని అందించడం పోలీసుల నైతిక బాధ్యత.

ఈ అంశానికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు పెండింగులో ఉన్నాయి. పిల్‌కు ప్రతిస్పందనగా కేంద్రం నవంబర్ 2022లో అఫిడవిట్ దాఖలు చేసింది. ఐదుగురు విద్యావేత్తలు దాఖలు చేసిన పిటిషన్, దర్యాప్తు సమయంలో డిజిటల్ పరికరాలను శోధించటం, స్వాధీనం చేసుకోవడం "అత్యంత చట్టబద్ధమైన రాష్ట్ర ప్రయోజనం" అని, గోప్యతా హక్కులను ఉల్లంఘించినట్టు చెప్పలేమని పేర్కొంటూ, నిందితులు జప్తు చేయబడిన పరికరాలను తిరిగి పొందేందుకు లేక వాటి నమూనాలను పొందేందుకు ట్రైల్ కోర్టును ఆశ్రయించవచ్చునని, కేంద్రం తెలిపింది.

ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ దాఖలు చేసిన మరో పిటిషన్, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. డిజిటల్ పరికరాలను శోధించటం లేక స్వాధీనం చేసుకునే సమయంలో పోలీసుల మితిమీరిన చర్యలను, సందేహాస్పద పద్ధతులను సంబంధించి నిందితులు ఆరోపిస్తున్నారు. ఆగస్టు 2022లో ఢిల్లీ అల్లర్లకు సంబంధించి, సీనియర్ జర్నలిస్ట్ ప్రశాంత్ టాండన్‌ను ఢిల్లీ పోలీసులు ప్రశ్నించారు. పోలీసులు అతని మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దానిని ఇప్పటికీ అతనికి తిరిగి ఇవ్వలేదు.

టాండన్ ఇలా అన్నాడు. "ఒకసారి ఎవరైనా మొబైల్ ఫోన్ లాక్కుంటే అందులో పోలీసులు ఏమి పెడతారో ఎవరికి తెలుసు. భీమా కోరేగావ్ కేసులో నిందితుల కంప్యూటర్లలో, సాక్ష్యాలను జొప్పించిన విషయాన్ని అంతర్జాతీయ మీడియా మనకు తెలియజేసింది. ప్రాథమిక సమస్య ఏమంటే, "ప్రతి పౌరుడిని సహజంగానే ఉగ్రవాదిగా భావించడం" అని టాండన్ అంటారు. పుర్కాయస్థ ఇటీవల రాసిన వ్యాసంలో, బీజేపీ ప్రభుత్వం యుఎపిఎ, మనీలాండరింగ్ నిరోధక లాంటి చట్టాలను విమర్శకులపై,ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఆయుధంగా వాడుకోవడాన్ని దుయ్యబట్టాడు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) ప్రయోగించబడిన రచయిత, చైర్మన్ ఆఫ్ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా, ఆకార్‌పటేల్ ఫ్రంట్ లైన్‌తో మాట్లాడుతూ, ప్రభుత్వ యంత్రాంగం పదే పదే యుఎపిఎను, జర్నలిస్టులను, మానవ హక్కుల సమర్థకులను, కార్యకర్తలను వేధింపులకు గురిచేయడానికి, భయపెట్టడానికి ఆయుధంగా వాడుకుంటున్నదని తెలిపాడు. తమ అస్పష్టమైన ఉగ్రవాద చట్టాల నిర్వచనాలతో, ఉచిత ట్రయల్ హక్కులను ఉల్లంఘించేందుకు ఆయుధంగా ఉపయోగించుకుంటున్నది.

ఫ్రీ స్పీచ్ కలెక్టివ్ సమాచారం ప్రకారం, దాదాపు 16 మంది జర్నలిస్టులపై2010 నుండి యుఎపిఎ చట్టం ప్రకారం అభియోగాలు మోపబడ్డాయి. కనీసం ఏడుగురు ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. న్యూస్ క్లిక్‌కు వ్యతిరేకంగా యుఎపిఎను ప్రయోగించడం, ఆందోళన కలిగిస్తోందని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన సంయుక్త లేఖలో తెలిపారు. సిద్ధిక్ కప్పన్‌కు రెండేళ్లకు పైగా జైలు శిక్ష విధించడం, ఫాదర్ స్టాన్‌స్వామి పోలీసు కస్టడీలో మరణించడాన్ని ఉదాహరణగా చూపారు.

ఫ్రీ స్పీచ్ కలెక్టివ్ సమాచారం ప్రకారం, దాదాపు 16 మంది జర్నలిస్టులపై2010 నుండి యుఎపిఎ చట్టం ప్రకారం అభియోగాలు మోపబడ్డాయి. కనీసం ఏడుగురు ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. న్యూస్ క్లిక్‌కు వ్యతిరేకంగా యుఎపిఎను ప్రయోగించడం, ఆందోళన కలిగిస్తోందని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన సంయుక్త లేఖలో తెలిపారు. సిద్ధిక్ కప్పన్‌కు రెండేళ్లకు పైగా జైలు శిక్ష విధించడం,ఫాదర్ స్టాన్‌స్వామి పోలీసు కస్టడీలో మరణించడాన్ని ఉదాహరణగా చూపారు.


లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో న్యూస్‌క్లిక్‌పై చర్య రాజకీయ కథనాలను నియంత్రించడానికి చేసిన ఒక దృఢమైన, నిస్సంకోచమైన ప్రయత్నమని చాలామంది పరిశీలకులు నమ్ముతున్నారు. ఒక స్వతంత్ర జర్నలిస్టు ఎ.జె. ప్రబాల్ తెల్పినట్లుగా, చాలా డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అవి ఏవీ ప్రభుత్వ రెవెన్యూపై గానీ, పత్రికా ప్రకటనలపైగానీ ఆధారపడి లేవు. గనుక మచ్చిక చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది.

(ఫ్రంట్ లైన్ సౌజన్యంతో)

- మల్లెంపాటి వీరభద్రరావు, 9490300111

వ్యక్తిగత సమాచార గోప్యతకు ఎసరు!

ఈ మధ్యకాలంలో వ్యక్తిగత సమాచార గోప్యత అన్నది భ్రమలాగే కనిపిస్తున్నది. సమాచార భద్రత అనేది ఒక ఊహలాగే మిగిలింది. ఆధార్ డేటా లీక్, భారీ డేటా ఉల్లంఘన డార్క్‌వెబ్‌లో 81 కోట్లమంది భారతీయుల వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేసింది. బిజినెస్ స్టాండర్డ్ నివేదించిన ప్రకారం 81.5 కోట్ల మంది భారతీయులు వ్యక్తిగత గుర్తింపు సమాచారం డార్క్‌వెబ్‌లో లీక్ అయినట్లు అమెరికాకు చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ రెస్యూరిటీ పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం.. పేర్లు, ఫోన్ నంబర్‌లు, చిరునామాలు, ఆధార్, పాస్‌పోర్ట్ సమాచారంతో సహా డేటా ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంది. ఇది భారతదేశ చరిత్రలో అతిపెద్ద డేటా ఉల్లంఘనగా గుర్తించబడుతుంది. దొంగిలించబడిన సమాచారాన్ని డార్క్‌వెబ్‌లో ప్రచారం చేసిన లీక్‌ని దృష్టికి తీసుకొచ్చారు. కోవిడ్-19 టెస్టింగ్ సమయంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సేకరించిన డేటా నుండి ఈ సమాచారం వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, లీక్ గురించి కేంద్రం ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇంకా మొద్దునిద్రలో ఉన్నట్లుంది. హ్యాకర్ షేర్ చేసిన పీడబ్ల్యూఎన్ 0001 డేటా ప్రకారం, దొంగిలించబడిన సమాచారంలో లక్షలాది మంది భారతీయుల పేర్లు, ఫోన్ నెంబర్లు, తాత్కాలిక, శాశ్వత చిరునామాలతో పాటు ఆధార్ పాస్‌పోర్ట్ వివరాలుంటాయి. కోవిడ్ పరీక్ష సమయంలో ఐసిఎంఆర్ సేకరించిన సమాచారం నుండి ఈ డేటా వచ్చిందని కూడా హ్యాకర్ పేర్కొన్నాడు. వైద్యడేటాలోని డేటా ఉల్లంఘనలు వ్యక్తులకు గణనీయమైన హాని కలిగిస్తాయి. వైద్య గుర్తింపు దొంగతనం (మోసపూరితంగా వేరొకరి పేరుతో వైద్య సేవలు పొందడం) సున్నితమైన వైద్య పరిస్థితులను బహిర్గతం చేయడం వంటివి ఉంటాయి. అటువంటి ఉల్లంఘనల పరిణామాలు ఆర్థిక నష్టానికి మించి విస్తరించవచ్చు. ఇది మితిమీరి వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయవచ్చు. గుప్తీకరణ, యాక్సెస్ నియంత్రణలు సాధారణ భద్రతా ఆడిట్‌లతో సహా వైద్య డేటాను రక్షించడానికి ఆరోగ్య సంరక్షణ సంస్థలు తప్పనిసరిగా పటిష్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలి. ఉద్యోగులకు శిక్షణ అవగాహనా కార్యక్రమాలు కూడా కీలకమైనవి, మానవ తప్పిదాలు లేదా అంతర్గత బెదిరింపుల కారణంగా అనేక డేటా ఉల్లంఘనలు జరుగుతాయి. డేటా ఉల్లంఘన జరిగినప్పుడు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు, సంస్థలు అవసరమైనప్పుడు బాధిత వ్యక్తులు, నియంత్రణ అధికారులు, మీడియాకు తక్షణమే తెలియజేయాలి. ప్రభావిత రోగులకు క్రెడిట్ పర్యవేక్షణ సేవలను అందించడం వంటి ఉల్లంఘన ప్రభావాన్ని తగ్గించడానికి సమర్థవంతమైన ప్రతిస్పందన ప్రణాళిక ఉండాలి. హ్యాకర్‌తో పరిచయాన్ని ఏర్పరచుకున్న దాని హంటర్ యూనిట్ పరిశోధకులు, వారు మొత్తం ఆధార్ భారతీయ పాస్‌పోర్ట్ డేటాబేస్‌ను విక్రయించడానికి సిద్ధంగా ఉన్నారని తెలుసుకున్నారు. మీడియా నివేదికల ప్రకారం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ప్రస్తుతం హ్యాకర్ ద్వారా కనుగొనబడిన పీడబ్ల్యూఎన్ 0001 ఉల్లంఘనపై దర్యాప్తు చేస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డేటాబేస్ నుంచి డేటాను తస్కరించి ఉండవచ్చని న్యూస్ 18 మరో నివేదిక పేర్కొంది. దీని ప్రకారం, కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా కూడా ఉల్లంఘన గురించి ఐసిఎంఆర్‌ని అప్రమత్తం చేసింది. కోవిడ్ 19 పరీక్ష సమాచారం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, ఐసిఎంఆర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వంటి వివిధ ప్రభుత్వ సంస్థలలో చెల్లాచెదురుగా ఉంది, ఉల్లంఘన ఎక్కడ ఉద్భవించిందో గుర్తించడం సవాలుగా మారింది. ఇప్పటివరకు, ఆన్‌లైన్‌లో సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ లేదా ఇతర సంబంధిత ఏజెన్సీల నుండి లీక్‌పై ఎటువంటి స్పందన లేదు.




భారతదేశంలోని ఒక పెద్ద వైద్య సంస్థ ఉల్లంఘనను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ సంవత్సరం ప్రారంభంలో, సైబర్ నేరగాళ్లు ఎయిమ్స్ సర్వర్‌లను హ్యాక్ చేసి, ఇన్‌స్టిట్యూట్‌లో ఒక టెరాబైట్ కంటే ఎక్కువ డేటాను స్వాధీనం చేసుకున్నారు, భారీ మొత్తం నగదు అడిగారు. ఇది ఆసుపత్రిని 15 రోజుల పాటు మాన్యువల్ రికార్డ్ కీపింగ్‌కి మార్చవలసి వచ్చింది, ఇప్పటికే రద్దీగా ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లో అన్ని ప్రక్రియలు మందగించాయి. ఉల్లంఘనలను నివారించడానికి డేటా సిస్టమ్‌ల రెగ్యులర్ పర్యవేక్షణ ఆడిటింగ్ కీలకం. బెదిరింపులను పరిష్కరించడానికి భద్రతా చర్యలు నిరంతరం నవీకరించబడాలి. వ్యక్తుల గోప్యత, ఆరోగ్య శ్రేయస్సుకు హాని కలిగించే సున్నితమైన వైద్య డేటాతో కూడిన డేటా ఉల్లంఘనలు ప్రత్యేకించి సంబంధించిన సంస్థలు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు ఈ విషయాలను తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యక్తిగత సమాచార గోప్యత పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వం భావించాలి.

- డా. యం. సురేష్ బాబు

ప్రభుత్వాలు మారినా మారని దళిత, గిరిజనుల బతుకులు

ప్రతి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దళిత, గిరిజన సంక్షేమం పట్ల నిరంతరం ప్రచారం చేయడం, నిధులు కేటాయించడం చేస్తున్నది. ఏడు దశాబ్దాలు గడిచిన ప్రాపకాలజ్ఞతగా అభివృద్ధి చెందడమే తప్ప ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ఈ వర్గాలను అభివృద్ధి చేసే ఆలోచన ప్రభుత్వాలకు లేదు. భూములు పంపిణీ చేస్తామని ప్రతిసారి చెప్పడమే తప్ప వారికి ప్రస్తుతం ఉన్న భూములను ప్రభుత్వాలే లాక్కుంటున్నాయి. రాష్ట్రంలో 16శాతం దళితులు, 6శాతం గిరిజనులు ఉన్నారు. దళిత జనాభా 55 లక్షలు కాగా, గిరిజన జనాభా 33 లక్షలు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమాజాభివృద్ధికి తగిన విధంగా వీరి అభివృద్ధి లేదు.



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

దళితుల సంక్షేమం : దళితుల్లో 33 శాఖలు ఉన్నాయి. వీరి మధ్య ఐక్యత లేకుండా పాలకులు నిరంతరం వివాదాలు సృష్టిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడానికి అనేక పథకాలు ఉన్నప్పటికీ అక్షరాస్యత దళితుల్లో 58.90 శాతం మాత్రమే ఉంది. మహిళల్లో 50 శాతం మించలేదు. జాతీయ స్థాయిలో దళితుల అక్షరాస్యత 66.54గా ఉంది. జాతీయ స్థాయికన్న తక్కువలో ఉంది. మొత్తం అన్ని వర్గాల అక్షరాస్యత జాతీయ స్థాయిలో 72.98 శాతంగా ఉంది. నిరంతరం దళితుల అక్షరాస్యత గురించి వల్లించే ప్రభుత్వాలు వారి గూడెలలో గల పాఠశాలలను ఎత్తివేస్తున్నారు. ప్రయివేట్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా ఫీజులు చెల్లించలేక 5-19 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు కూలీలకు వెళ్తున్నారు. రాష్ట్రంలోని దళిత బిడ్డలకు విద్య పథకాన్ని ప్రకటించి 10.85 లక్షల మందికి 268 గురుకులాలలో విద్య బోధన కల్పిస్తామని ప్రస్తుతం 1.73 లక్షల మందికి మాత్రమే విద్య అమలు జరుపుతున్నారు.

దళితుల అభివృద్ధి కోసం అనేక పథకాలను, వాటి వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ప్రధానంగా ప్రభుత్వ శాఖల కేటాయింపులలో 15 శాతం బడ్జెట్ దళిత ఉప ప్రణాళిక కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటా యింపులు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఉప ప్రణాళికలో 2014 నుండి నేటి వరకు కేటాయించిన నిధులలో రూ. 63,182.10 కోట్లు దారి మళ్ళించారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖ తరుపున కేటాయించిన అభివృద్ధి నిధులు రూ.21,322.75 కోట్లు పూర్తిగా వ్యయం చేయలేదు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1.80 లక్షల మందికి ఇస్తామన్న రుణాలు అమలు కాలేదు. ఇదే కాలానికి రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు కేటాయించిన రూ.2,99,110 కోట్లలో 60 శాతం మాత్రమే వ్యయం చేశారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం కూడా గత తొమ్మిదేండ్లలో రూ.7,39,107 కోట్లు ఉప ప్రణాళిక కింద రూ. 54,214 కోట్లు అంబరిల్ల పథకం కింద బడ్జెట్ కేటాయించినట్లు చూపారు. కానీ వ్యయం చేసిందే తక్కువ. ఇన్ని వేలకోట్లు కేటాయించిన దళిత జనాభాలో నేనికి ఆరు శాతం మంది సరైన అవాసలు, విద్య, వైద్య సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలో భూముల పంపిణీలో దళితులు నిర్లక్ష్యానికి గురయ్యారు. రాష్ట్రంలో 163 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. 16.37 లక్షల దళిత కుటుంబాలలో 7.12 లక్షల మందికి 13.12 లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉంది. మిగిలిన వారికి ఎలాంటి భూమి లేదు. ప్రతి కుటుంబానికి మూడెకరాల భూమి పథకాన్ని 2015 మార్చి 15న ముఖ్యమంత్రి ప్రారంభించారు. 9 సంవత్సరాలలో 6,242 మందికి 15,571 ఎకరాలు పంపిణీ చేసి ప్రభుత్వం పథకాన్ని ఉపసంహరించుకుంది. చివరికి గతంలో వారికి ఇచ్చిన ఆసైన్డ్ భూములను ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, చెట్ల పెంపకం పేరుతో ల్యాండ్ పూలింగ్ ద్వారా 30 వేల ఎకరాలు లాక్కుంటున్నారు. 2018-19లో దళిత క్రూషియల్ ఫండ్ ప్రకటన చేశారు. అది కాగితాలకే పరిమితమైంది. 2021లో ముఖ్యమంత్రి దళితబంధు ప్రకటించి 2023 ఫిబ్రవరి నాటికి 38,328 మందికి మాత్రమే 10 లక్షల చొప్పున పంపిణీ చేసి, ఆ తరువాత 4-5 గురికి కలిపి పథకానికి ప్రకటిస్తున్నారు. ఇంకా మిగతా 18 నియోజకవర్గాలలో ప్రతి నియోజకవర్గానికి 1100 దళిత కుటుంబాలకు దళిత బంధును ప్రకటించారు. 2023-24 సంవత్సరానికి 17 లక్షల మందికి రూ.17,700 కోట్లు ప్రకటించారు. కానీ, ఆరు మాసాలు గడుస్తున్నా బడ్జెట్ కేటాయింపుల అమలు లేదు. నేటికి అంటరానితనం కొనసాగుతూనే ఉంది. దళితులపై 66 గ్రామాల్లో 12,634 దాడులు, దౌర్జన్యాలు జరిగినట్లు నేషనల్ క్రైమ్ రిపోర్టు బ్యూరో ప్రకటించింది. మూడు ఏండ్లలో 34,498 మంది అన్ని వర్గాల బాలికలు అదృశ్యమయ్యారు. ఇందులో బలహీన వర్గాలు చెందిన వారే ఎక్కువ.



మారుతున్న సమాజాభివృద్ధికి అనుకూలంగా వీరి సంస్కృతి కూడా అభివృద్ధి చెందాలి. వీరి కోసం ప్రకటించిన పథకాల అమలుకు గ్రామ సభల ద్వారా వ్యయం చేయాలి. గిరిజనేతర కాంట్రాక్టర్లు గిరిజనాభివృద్ధికి అటంకంగా నిధులు కాజేస్తున్నారు. ప్రతి గిరిజన పల్లెలో పాఠశాల, మండలంలో నాలుగు వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నేటికి వైద్య సహాయం కోసం అటవీ ప్రాంతాల నుండి రాలేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పౌష్టికాహార లోపం వల్ల ఐదేండ్లలోపు పిల్లల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి.

గిరిజన సంక్షేమం : వీరిలో 32 శాఖలు ఉన్నాయి. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న వారికేగాక నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు గిరిజన చట్టాల రక్షణ లేదు. 1505 షెడ్యూల్డ్ గ్రామాలు కాగా, 247 నాన్ షెడ్యూల్డ్ గ్రామాలు ఉన్నాయి. 37 మండలాలను మాత్రమే షెడ్యూల్డ్‌గా ప్రకటించారు. వీరు ప్రధానంగా ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో ఉంటున్నారు. రాష్ట్రంలో గిరిజన ఉప ప్రణాళిక కింద 2014 నుండి 2024 వరకు రూ.91,529 కోట్లు, ఇదే కాలానికి బడ్జెట్ కింద రూ.80,136 కోట్లు కేటాయించారు. వీరికి తోడు దేశంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో గిరిజన సబ్‌ప్లాన్ కింద 1,19,509 కోట్లు, అంబరిల్లా పథకం కింద 4,292 కోట్లు కేటాయించారు. ఇన్ని నిధులు కేటాయించిన విద్య, వైద్య రంగాలలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. వీరిపై పోడు భూముల సాగు ఆక్రమ కేసులు బనాయించి జైళ్ళపాలు చేశారు. కొన్ని శాఖలకు 'లిపి'లేదు. అందుకు ఎలాంటి ప్రయత్నం జరగలేదు. దేశంలో అక్షరాస్యత 74శాతం కాగా, రాష్ట్రంలో అక్షరాస్యత 66.5 శాతం ఉన్నప్పటికి గిరిజనులలో పురుషులలో 60శాతం, మహిళలలో 45శాతం మాత్రమే ఉంది. కేరళలలో 85 శాతం అక్షరాస్యత ఉంది. డబుల్‌బెడ్ రూం కింద చేసిన నిర్మాణాలలో దళిత, గిరిజనులకు 50శాతం, మైనార్టీలకు 7శాతం, ఇతరులకు 43 శాతం నిర్ణయించారు. కానీ దశాబ్దాలు గడిచినా గిరిజనులు పూరి గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు అవాసలు దెబ్బతిన్నప్పటికి ఎలాంటి పరిహారాలు ఇవ్వడం లేదు.

ఇండ్ల స్థలాలకు భూములు ఉన్నప్పటికీ వారికి పంపిణీ చేయకుండా బేదకల్ చేస్తున్నారు. రవాణా సౌకర్యం లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించాలన్న ఆందోళన నేటికీ కొనసాగుతూనే ఉంది. చివరకు రాజ్యాంగం కల్పించిన అవకాశాలను కూడా గత ప్రభుత్వాలు అమలు చేయలేదు. వాటి అమలు కోసం సంఘాలు పెట్టి చేసిన పోరాటాలను అణిచి వేయడమే తప్ప సమస్యల పరిష్కారానికి ఎలాంటి కృషి లేదు. ఇప్పటికీ అక్షరాస్యతలో అట్టడుగున ఉన్నారు. గిరిజనులకు ఉన్న భూములను అభయారణ్యాల పేరుతో వేల ఎకరాల నుండి తొలగించారు. 2022 నాటికి అందరికి పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం లక్ష 96,676 మందికి, 721 కమ్యూనిటీ వ్యవస్థలకు మాత్రమే పంపిణీ చేశారు. గిరిజన వికాసం పేరుతో సన్న, చిన్నకారు రైతులకు సహకారం చేస్తామని చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదు. గిరిజన సంక్షేమ విద్యాలయాలలో ఐఐటి, ఎన్ఐటి, పిహెచ్‌డికి సీట్లు లేకపోవడంతో అభివృద్ధి కానరావడం లేదు. విదేశీవిద్య కోసం ఉపకార వేతనాలు ఇస్తామని నిరంతరం ప్రకటించిన ప్రభుత్వ పథకాన్ని పొందడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దశాబ్దాలుగా సాగులో ఉన్న వీరి భూములను లాక్కోవడమే గాక జైళ్లలోనూ పెట్టారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు షెడ్యుల్ 5, 6 అమలు కోసం పోరాటాలు చేయాల్సి వస్తున్నది. గిరిజన తెగల మధ్య వివాదాలు సృష్టించి పాలకులే వారి ఐక్యతను దెబ్బతిస్తున్నారు. ఎన్నికలు జరిగినప్పుడు గిరిజన అభివృద్ధికి వాగ్దానాలలో 20శాతం కూడా అమలు కావడం లేదు. మారుతున్న సమాజాభివృద్ధికి అనుకూలంగా వీరి సంస్కృతి కూడా అభివృద్ధి చెందాలి. వీరి కోసం ప్రకటించిన పథ కాల అమలుకు గ్రామ సభల ద్వారా వ్యయం చేయాలి. గిరిజనేతర కాంట్రాక్టర్లు గిరిజనాభివృద్ధికి అటంకంగా నిధులు కాజేస్తున్నారు. ప్రతి గిరిజన పల్లెలో పాఠశాల, మండలంలో నాలుగు వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నేటికి వైద్య సహాయం కోసం అటవీ ప్రాంతాల నుండి రాలేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పౌష్టికాహార లోపం వల్ల ఐదేండ్లలోపు పిల్లల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి.

23 శాతం జనాభా కలిగిన దళిత, గిరిజన ప్రజల అభివృద్ధి లేకుండా రాష్ట్రం, దేశం అభివృద్ధి కాదు. వీరి కేటాయింపులు వీరి అభివృద్ధి సంఘాల ద్వారానే వ్యయం చేయాలి. మధ్య దళారీల వ్యవస్థను తొలగించాలి. సమాజంలో వీరిని భాగస్వాములను చేయాలి. అప్పుడే వీరి బతుకుల్లో కొంతైనా వెలుగులు నింపడం సాధ్యం.

కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

అరకులోయ : కాఫీ, మిరియాలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ డిమాండ్ చేశారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని సుంకరమెట్ట పంచాయతీ పెదగంగుడి గ్రామ సమీప ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. విజూ కృష్ణన్ మాట్లాడుతూ అరకు ఆర్గానిక్ కాఫీకి దేశ, విదేశాల్లో మంచి పేరుందని తెలిపారు. కష్టపడి పండించే రైతుకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. అరకు కాఫీని జి 20 సమ్మిట్‌లో గొప్పగా ప్రచారం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. 2019-23 మధ్య రైతులకు రావాల్సిన రూ.60 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే కాఫీ రైతు సంఘం ఆధ్వర్యాన పోరాటాన్ని ఉధృతం చేయాలని రైతులను కోరారు.

చంద్రబాబు బెయిల్‌పై షరతులు విధించాలి

సీఐడీ పిటీషన్‌పై 3న హైకోర్టు తీర్పు

అమరావతి : స్కిల్ కేసులో నిందితుడైన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కంటికి ఆపరేషన్ పేరుతో మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యాక బెయిల్ షరతులను ఉల్లంఘించారంటూ ఏపీ హైకోర్టులో సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగిశాయి. చంద్రబాబుకు పలు షరతులు విధించాలన్న పిటిషన్‌పై ఈ నెల 3న తుది ఉత్తర్వులు జారీ చేస్తామని న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రకటించారు. రాజమండ్రి జైలు నుంచి చంద్రబాబు విడుదలైన వెంటనే బెయిల్ షరతులను ఉల్లంఘించారని అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. అనారోగ్యంతో బెయిల్‌పై బయటకు వచ్చిన వెంటనే రాజకీయ ర్యాలీ నిర్వహించారని చెప్పారు. మీడియాతో కూడా మాట్లాడారని, కోర్టు ఆదేశాల్ని ఉల్లంఘించారని చెప్పారు. చంద్రబాబు వెంట ఇద్దరు డీఎస్పీలు ఉండేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి నిఘా విభాగం ఉండగా, ఇద్దరు పోలీసు అధికారులను చంద్రబాబు వెంట ఉంచాల్సిన అవసరం ఉందా? అని హైకోర్టు ప్రశ్నించింది. నిఘా వేరు, నేరుగా అధికారులు ఉండే సమర్పించే నివేదిక వేరని అదనపు ఏజీ జవాబు చెప్పారు.

మాతృదేవోభవ ఆశ్రమానికి ఎస్‌బీఐ సాయం

- వాహనాన్ని అందించిన డీజీఎం రానా ఆశుతోష్



హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మరో ఎన్‌జీఓకు చేయూతనిచ్చింది. రంగారెడ్డి జిల్లా అల్మాస్‌గూడలోని మాతృదేవోభవ ఆనంద ఆశ్రమానికి బుధవారం టాటా వింగర్ వాహనాన్ని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రానా అశుతోష్ కుమార్ సింగ్ అందజేశారు. 2018లో యాదయ్య ప్రారంభించిన ఈ లాభాపేక్షలేని సొసైటీలో వికలాంగులు, ఆసర లేని బలహీన వర్గాల వారికి ఆశ్రయం కల్పిస్తుంది. ప్రస్తుతం ఇందులో 120 మందికి షెల్టర్ కల్పిస్తున్నారు. 8-10 మంది ప్రయాణించగల ఈ వాహనాన్ని వైద్య, ఇతర సదుపాయాల సేవలకు ఉపయోగించనున్నట్టు ఆ సంస్థ పేర్కొంది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో ఎస్‌బిఐ ముందు వరుసలో ఉందని డిఎండి రానా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్, జిఎంలు మంజూ శర్మ, దేబాశిష్ మిశ్రా, విద్యా రాజా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

అప్రకటిత ఎమర్జెన్సీయే..

- అందులో భాగమే ప్రతిపక్ష నేతలు, మీడియాపై నిఘా
- మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలు
- సంయుక్త కిసాన్ మోర్చా ఖండన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీలో భాగమే ప్రతిపక్ష నేతలు, మీడియాపై ప్రభుత్వం నిఘా పెట్టిందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) విమర్శించింది. మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలు చేపట్టిందని దుయ్యబట్టింది. ఈ మేరకు బుధవారం ఎస్‌కెఎం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రతిపక్ష నాయకులు, మీడియా ప్రతినిధులపై నిఘా గురించి ఆపిల్ ఐ ఫోన్ జారీ చేసిన హెచ్చరిక నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంకుశ, రాజ్యాంగ వ్యతిరేక వైఖరిని బహిర్గతం చేసిందని పేర్కొంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, పార్ట్ ..3 కింద పౌరులందరి గోప్యత, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనను వెల్లడిస్తుందని తెలిపింది.

నేరారోపణ చేయడానికి కొన్ని తప్పుడు సమాచారాలను రిమోట్‌గా నాటాలనే ఉద్దేశ్యంతో ఏ పౌరుడి మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్ వంటి ఇతర పరికరాలను రిమోట్‌గా యాక్సెస్ చేసే నిఘా ప్రజాస్వామ్య సమాజంలో అంగీకరించబడదని పేర్కొంది. ఆపిల్ ఐఫోన్ తన వినియోగదారులకు ప్రభుత్వ ప్రేరేపిత దాడి గురించి హెచ్చరించి ఇలాంటి నోటిఫికేషన్‌లను పంపడం ఇది రెండోసారని తెలిపింది. 2021లో ఆపిల్, గూగుల్ రెండూ ఇజ్రాయెలీ కంపెనీ ఎన్ఎస్ఓచే తయారు చేయబడిన స్పైవేర్ అయిన పెగాసస్ చేసిన దాడికి వ్యతిరేకంగా హెచ్చరికను పంపాయని గుర్తు చేసింది. ఈ అంశంపై విచారణకు సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి ప్రభుత్వం సహకరించడానికి నిరాకరించిందని పేర్కొంది.

ప్రధాని మోడీ, కేంద్ర హౌం మంత్రి అమిత్ షా పాలనలో ఇలాంటి చర్యలు కొత్తేమీ కాదని, కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేయడమే హౌం మంత్రిత్వ శాఖ అనాలోచిత పనులను బయటపెట్టడానికి సరిపోతుందని ధ్వజమెత్తింది. ఈ ప్రభుత్వం చేసే చర్యల్లో న్యూస్‌క్లిక్‌పై తప్పుడు ఎఫ్ఐఆర్ తో మీడియా స్వేచ్ఛపై దాడి, అమాయక జర్నలిస్టులను జైళ్లలో పెట్టేందుకు యూఏపీఏను దుర్వినియోగం చేయడం, రైతుల ఉద్యమాన్ని దేశ వ్యతిరేకమని ప్రచారం చేయడం, విదేశీ, ఉగ్రవాద శక్తులు నిధులు సమకూర్చడమంటూ ప్రచారం, అసమ్మతిని అణచివేసే నీచమైన మార్గాలకు తాజా ఉదాహరణలని పేర్కొంది.

దేశంలో 'అప్రకటిత ఎమర్జెన్సీ' విధించినందుకు ప్రధానమంత్రి, హౌంమంత్రి చర్యలను ఎస్కేఎం తీవ్రంగా ఖండించింది. కష్టపడి సాధించుకున్న తమ ప్రజాస్వామ్య హక్కులపై ఎలాంటి దాడి జరిగినా వదిలేది లేదని, ఇది గతంలో చాలాసార్లు రుజువైందని, ఈసారి కూడా ప్రజలే గెలుస్తారని తెలిపింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు, మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనను బట్టబయలు చేసేందుకు పోరాటమే ఏకైక మార్గమని, రైతులు, అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చి తమ డిమాండ్లపై పోరాటాలు నిర్మించాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది.

పొలిటికల్ సర్వేలు

- కొన్ని బీఆర్ఎస్‌కు అనుకూలం...
- మరికొన్ని కాంగ్రెస్‌కు పట్టం
- ఓటర్లకు గాలం వేసేందుకు మైండ్ గేమ్
- అయోమయంలో ఓటర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఎన్నికల వేళ వెలువడుతున్న సర్వేలు ఓటర్లను అయోమయానికి గురి చేస్తున్నాయి. కొన్ని సర్వేలు బీఆర్ఎస్‌కు అనుకూలం అయితే, మరి కొన్ని సర్వేలు కాంగ్రెస్‌కు పట్టం కడుతున్నాయి. వీటి విశ్వసనీయత సంగతి అలా ఉంచితే ఓటర్లకు గాలం వేసేందుకు రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా సర్వేలు నిర్వహించుకుంటూ మైండ్ గేమ్ ఆడుతున్నాయని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరవుతున్న నేపథ్యంలో వివిధ రకాల సంస్థలు చేస్తున్న సర్వేలు ప్రజల్లో గందరగోళానికి దారి తీస్తున్నాయి. ఒక్కో సంస్థ సర్వే ఫలితాలు ఒక్కో రకంగా ఉంటున్నాయి. ఆత్మ సాక్షి, రాజనీతి ఆర్గనైజేషన్, జనతాకా మూడ్ తదితర సంస్థలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటే, ఇండియా టుడే సీ ఓటర్, పోల్ ట్రాకర్, జన్మత్ తదితర సంస్థల సర్వేలు కాంగ్రెస్‌కు అధికారం ఖాయం అని చెబుతున్నాయి. బీజేపీ మాత్రం పోటి నుంచి అనధికారికంగా తప్పుకుందనే గుసగుసలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీకి అనుకూలంగా సర్వేలు రావడం లేదు.

ఆత్మసాక్షి సర్వే ప్రకారం బీఆర్ఎస్ 42.5 శాతం ఓట్లతో 64 నుంచి 70 స్థానాలు సాధిస్తుందని అంచనా వేసింది. కాంగ్రెస్ పార్టీ 36.5 శాతం ఓట్లతో 37 నుంచి 43 స్థానాలు దక్కించుకుని రెండవ స్థానానికి పరిమితం అవుతుందని తేల్చింది. 6 నుంచి 7 స్థానాలు గెలుచుకోవడం ద్వారా మజ్లిస్ మూడవ స్థానంలో నిలుస్తుండగా, 5 నుంచి 6 స్థానాలతో బీజేపీ నాలుగవ స్థానానికి పరిమితమవుతుందని అంచనా వేసింది.

పోల్ ట్రాకర్ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం కాంగ్రెస్ 64 నుంచి 74 స్థానాలు దక్కించుకోగా, 39 నుంచి 44 స్థానాలతో బీఆర్ఎస్ రెండవ స్థానానికి పరిమితం కానుంది. జనతాకా మూడ్ సంస్థ సర్వే ప్రకారం72 నుంచి 75 సీట్లతో తెలంగాణలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ పవర్‌లోకి రానుందని తెలిపింది.

కాంగ్రెస్ 31 నుంచి 36 సీట్లకే పరిమితమై రెండో స్థానంలో నిలవనుందని వెల్లడించింది. తెలంగాణలో కాంగ్రెస్ మెజారిటీ సాధిస్తుందని జన్మత్ సర్వే తేలిపింది. కాంగ్రెస్ పార్టీకి 58 నుంచి 60 సీట్లు రానుండగా, బీఆర్ఎస్ పార్టీ 43 నుంచి 45 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని పేర్కొంది. ఇండియా టుడే సీ ఓటర్ సర్వే ప్రకారం కాంగ్రెస్ పార్టీ 54 స్థానాలు దక్కించుకోనుండగా బీఆర్ఎస్ పార్టీకి 49 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఒక్కో సర్వే ఒక్కో విధంగా వస్తుండటంతో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో అసలు విజేత ఎవరో తెలియాలంటే డిసెంబర్ 3 దాకా ఆగాల్సిందే.

వివేక్ పోతే నష్టమేమీ లేదు మ్యానిఫెస్టోలో మార్పులు, చేర్పులుంటాయి

- మ్యానిఫెస్టోలో మార్పులు, చేర్పులుంటాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- ఆ పార్టీలో చేరిన బాపూరావు, కృష్ణారెడ్డి, సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి పార్టీని వీడిపోయినా తమకేమీ నష్టం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి అన్నారు. వివేక్ తయారు చేసిన మ్యానిఫెస్టోలో చేర్పులు, మార్పులుంటాయని చెప్పారు. బుధవారం ఢిల్లీలో బోథ్ ఎమ్మెల్యే బాపూరావు, కాంగ్రెస్ నేత చలమల్ల కృష్ణారెడ్డి, సుభాష్‌రెడ్డి ఆ పార్టీలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తమది క్యాడర్ బేస్డ్ పార్టీ అన్నారు. మాఫియా వ్యవస్థలను ప్రోత్సహిస్తున్నవారికి కేసీఆర్ టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. నిజాయితీతో పనిచేస్తున్న గిరిజన బిడ్డలకు మాత్రం టికెట్లు నిరాకరించారని విమర్శించారు. కర్నాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎలక్షన్ టాక్స్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నదని ఆరోపించారు. జనసేనతో సీట్ల సర్దుబాటుపై చర్చ నడుస్తున్నదనీ, రెండు రోజుల్లో ఫైనల్ అవుతుందని చెప్పారు. మిగిలిన 66 మంది అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు. బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ..కేసీఆర్‌కు ప్రజల మీద, వారి ఓట్ల మీద నమ్మకం లేదని విమర్శించారు. ఆయన ప్రాజెక్టుల టెండర్ల సమయంలో మాత్రమే మాట్లాడుతున్నారనీ, లీకులపై స్పందించడం లేదని చెప్పారు. గోదావరి నదిలో ఇసుక ద్వారా వేల కోట్ల దోపిడీ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ.. కేసీఆర్ ఆదిలాబాద్ జిల్లాలోని ట్రైబల్ ఎమ్మెల్యేలకు మళ్లీ తిరిగి టికెట్లు ఇవ్వలేదని విమర్శించారు. సోయం బాపూరావు గెలుపునకు కృషి చేస్తానని హామీనిచ్చారు. తనకు ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఇస్తారని ఆశిస్తున్నానన్నారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ విజయ దుందుబి మోగించబోతున్నదన్నారు. ఒకరిద్దరు నేతలు తమ పార్టీని వీడినా ప్రజలు మాతోనే ఉన్నారన్నారు. బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో కలుపడం ఖాయమన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు విశ్వాసం లేదన్నారు. డీకే అరుణ మాట్లాడుతూ... గద్వాల అసెంబ్లీ స్థానం నుంచి కాకుండా ఎంపీగా పోటీచేస్తానని గతంలోనే చెప్పానన్నారు. గద్వాలలో బీసీ అభ్యర్థిని నిలబెడుతున్నామన్నారు.

ఒకేషనల్ కోర్సు ప్రశ్నాపత్రంలో మార్పులు

- ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సు ప్రశ్నాపత్రంలో మార్పులు చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012-13 విద్యాసంవత్సరం కంటే ముందు ఉన్న ఇంగ్లీష్, జనరల్ ఫౌండేషన్ కోర్సు (జీఎఫ్‌సీ), ఆన్ ద జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) ఒకేషనల్ కోర్సు ప్రశ్నాపత్రంలో గరిష్ట మార్కులకు సంబంధించి మార్పులు చేశామని పేర్కొన్నారు. ఆ విద్యాసంవత్సరంలో చదివి ఇంకా బ్యాగ్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులకు వచ్చే ఏడాది వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పాత విధానంలో రాసేందుకు చివరి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి కొత్త విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇంగ్లీష్‌కు 75 మార్కులుంటే కొత్తగా 50 మార్కులు, జీఎఫ్‌సీకి 75 మార్కులుంటే 50 మార్కులు, ఓజేటీకి 50 మార్కులుంటే, వంద మార్కులకు మార్పులు చేశామని వివరించారు.

నాడు కాంగ్రెస్... నేడు బీజేపీ దొరలతో

పోరాడుతున్నాం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆనాడు కాంగ్రెస్ దొరలతో పోరాడామనీ, నేడు బీజేపీ దొరలతో పోరాడుతున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మంత్రి కే.టీ.రామారావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వివిధ పార్టీల నుంచి నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ఎక్కడా గొడవలు జరగలేదనీ చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు పెద్ద పీట వేస్తామన్నారు. ఈ ఎన్నికలు ఢిల్లీ దొరలకు, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్నవని తెలిపారు. రాహుల్ గాంధీ తాత తెలంగాణను బలవంతంగా ఆంధ్రలో కలిపినందున 56 ఏండ్లు గోస పడ్డదని వ్యాఖ్యానించారు. అదే రాహుల్ గాంధీ నాయనమ్మ కారణంగా వందల మంది తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. ఢిల్లీ దొరల కారణంగా వేల మంది బలిదానం చేసుకున్నారన్నారు. అనివార్యమయ్యాకే తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని చెప్పారు. ఢిల్లీ అహంకారానికి తలవంచేది, దించేది లేదని స్పష్టం చేశారు. ఓటుకు నోటుకు దొంగను పక్కన పెట్టుకొని రాహుల్ గాంధీ అవినీతి గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ గెలుపుకోసం

కార్పొరేషన్ చైర్మెన్ల కార్యాచరణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ మూడోసారి విజయం సాధిస్తుందని పలు కార్పొరేషన్ల చైర్మెన్లు వ్యాఖ్యానించారు. హ్యాట్రిక్ సాధించే దిశలో ఆ పార్టీ అభ్యర్థుల అఖండ విజయానికి కృషి చేసేందుకు ఎన్నికల కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్టు చెప్పారు. తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు, కల్లు గీత కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవికుమార్‌గౌడ్, గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మెన్ పిట్టల రవీందర్ ముదిరాజ్ బుధవారం సాయంత్రం హైదరాబాదులో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సూచనల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో బీఆర్ఎస్ అభ్యర్థులుగా ఎన్నికల రంగంలో ఉన్నవారి విజయానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్టు వివరించారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటిస్తామన్నారు. గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం అమలు జరుపుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలు, వృత్తిదారులకు వివరిస్తామన్నారు. రాష్ట్రంలో చోటుచేసుకున్న గుణాత్మకమైన మార్పులు, సర్వతోముఖాభివృద్ధిని ప్రచారం చేస్తామన్నారు.

కులం, మతం పేరిట బీజేపీ నయవంచన : ఖర్గే

రాయ్‌పూర్ : కులం, మతం పేరుతో ప్రజలను బీజేపీ మభ్యపెడుతున్నదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సుక్మాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ కాషాయ పార్టీపై విమర్శలు గుప్పించారు. దేశం కోసం త్యాగాలు చేసిన కాంగ్రెస్‌ను విమర్శించడమే బీజేపీ పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు.

లాల్ "కేరళీయం సెల్ఫీ" వైరల్



చిత్రం సినీ ప్రేమికులకు అరుదైన దృశ్యాన్ని అందించింది. మోహన్‌లాల్ తీసుకున్న సెల్ఫీలో మమ్ముట్టి, కమల్ హాసన్, శోభన, ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు వి శివన్‌కుట్టి, కె రాజన్, రోషి అగస్టిన్, స్పీకర్ ఎఎన్ శంసీర్ తదితరులు ఉన్నారు.

తిరువనంతపురం : వచ్చే ఏడాది జరగనున్న కేరళీయం ఈవెంట్ ప్రచారంలో భాగంగా కేరళ బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రముఖ నటులు కమల్ హాసన్, మమ్ముట్టి, శోభనలతో మోహన్ లాల్ సెల్ఫీ వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా మలయాళ అభిమాన నటుడు మోహన్‌లాల్ మాట్లాడుతూ... 'వచ్చే ఏడాది జరగనున్న 'కేరళీయం' ప్రచార కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రితో సెల్ఫీ దిగుదాం' అన్నారు. మలయాళీ అయినందుకు గర్వపడుతున్నాననీ, ఇది తన నగరం అని మోహన్‌లాల్ చెప్పారు. తిరువనంతపురం అంత సుపరిచితమైన నగరం లేదు. ఇక్కడి ప్రతి సందు, క్రేనీ తెలుసు. కేరళ కోసం ఈ నగరాన్ని ఎంచు కున్నందుకు ఆనందంగా ఉంది. తాను కేరళలో పుట్టినందుకు, మలయాళీ అయినందుకు గర్విస్తున్నా అని మోహన్‌లాల్ అన్నారు. మమ్ముట్టి మాట్లాడుతూ... ప్రేమ, సామరస్య ప్రపంచానికి కేరళ నమూనా అని వివరించారు. తన వద్ద లిఖితపూర్వక ప్రసంగం లేదంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన మమ్ముట్టి... కేరళ అనేది కేరళీయుల భావన మాత్రమే కాదని, అది యావత్ ప్రపంచానికి చెందాలని చెప్పారు. ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తామని చెప్పారు. ప్రేమ, సామరస్య ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలనీ, మనల్ని చూసి నేర్చుకునే ప్రపంచానికి మనం ఒక్కటే అని పిలవాలని అన్నారు. కాగా, లాల్ 'కేరళీయం సెల్ఫీ" కొద్దిసేపటికే సోషల్‌మీడియా ప్రసార మాధ్యమంలో వైరల్ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ కేరళ మేళాలో చిత్రీకరించిన ఈ చిత్రం సినీ ప్రేమికులకు అరుదైన దృశ్యాన్ని అందించింది.





గజ్వేల్ బరిలో ఈటల డౌటే?

(మొదటిపేజీ తరువాయి)

హుజురాబాద్ నియోజకవర్గానికే పరిమితం కావాలని ఈటల భావిస్తున్నట్టు తెలిసింది. ఉప ఎన్నిక సమయంలో ఉన్న సానుభూతి, సానుకూల పవనాలు ఇప్పుడు లేవనీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ బలమైన అభ్యర్థులను బరిలోకి దింపడంతో అక్కడా గెలుపు కోసం కష్టపడాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నానని ఈటల రాజేందర్ బీజేపీ జాతీయ నాయకత్వం వద్ద తేల్చిచెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. మరోవైపు తనను నమ్ముకుని వచ్చినవాళ్లకు టికెట్లు ఇచ్చే విషయంలో పార్టీ మొండిగా వ్యవహరించడం పట్ల ఆయన ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది.

ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమకు వేములవాడ సీటు ఇవ్వాలని ఈటల పట్టుబడుతున్నారు. ఇదే స్థానం కోసం మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు తన కొడుక్కు ఇవ్వాలని జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ టికెట్ అంశం ఎటూ తేలలేదు. దీనిపై ఈటల కినుక వహించారు. ఆయనకు పార్టీలో అధిక ప్రాధాన్యం ఇస్తూ తమను పట్టించుకోకపోవడంపై ఆగ్రహంతో ఉన్న నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విజయశాంతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బాబుమోహన్, తదితర కీలక నేతలతో కాంగ్రెస్ నాయకత్వం చర్చలు జరుపుతున్నది. వారిలో కొందరినైనా తమవైపు తిప్పుకోవాలనే ఆలోచనతో బీఆర్ఎస్ పార్టీ సైతం ఆపరేషన్ ఆకర్ష్‌ను మొదలుపెట్టింది. ఈ పరిణామాలపై బీజేపీ కార్యకర్తలు నైరాశ్యంలోకి కూరుకుపోయారు. ఈటల వచ్చాకే పార్టీ పరిస్థితి ఇలా తయారైందని బలంగా నమ్ముతున్నారు. బండి, ఈటల మధ్య గొడవను కొందరు ముఖ్య నాయకులు తమకు అనుకూలంగా మలుచుకుని ఇద్దర్నీ దెబ్బతీశారనే చర్చా నడుస్తున్నది. ఈటల చేరిన తర్వాత ఆయనకు చేరికల కమిటీ చైర్మెన్, ప్రచార కమిటీ బాధ్యతలను సైతం జాతీయ నాయకత్వం అప్పగించింది. కీలకనేతలెవ్వరూ బీజేపీలో చేరకపోగా..ఉన్నవాళ్లూ పార్టీని వీడుతున్నారనే విమర్శలను ఎక్కుపెడుతున్నారు. కార్యకర్తలే కాదు...ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న బీజేపీ నేతలందరూ ఇదే భావనలో ఉన్నారు. బీజేపీ జాతీయ నాయకత్వం బీసీ జపం చేస్తున్నా..ఆ పార్టీలో పాత, కొత్త నేతలకు టార్గెట్‌గా ఈటల రాజేందర్ అవుతున్నారు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో ఆయన పొలిటికల్ గ్రాఫ్ క్రమంగా తగ్గుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అందులో భాగంగానే హుజూరాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నుంచి ఆయన టఫ్ ఫైట్ ఎదుర్కొంటున్నారు. బీజేపీలో ఉంటే ఆయన గెలవరనే చర్చా నడుస్తున్నది.

బీజేపీకే అత్యధిక విరాళాలు

(మొదటిపేజీ తరువాయి)

రూపంలో 2021-22 వరకు అన్ని రాజకీయ పార్టీలకు కలిపి రూ. 9,188 కోట్లకు పైగా విరాళాలుగా అందించాయి. అందులో బీజేపీకి 57 శాతం పైగా నిధులు అందగా, కాంగ్రెస్‌కు కేవలం 10 శాతం మాత్రమే అందాయి. 2016-17 నుంచి 2021-22 మధ్య డేటా అందుబాటులో ఉన్న చివరి సంవత్సరం వరకు ఏడు జాతీయ పార్టీలు, 24 ప్రాంతీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మొత్తం రూ.9,188.35 కోట్ల విరాళాన్ని అందుకున్నాయి. ఇందులో బీజేపీకి రూ.5,272 కోట్లు, కాంగ్రెస్‌కు కేవలం రూ.952 కోట్లు రాగా, మిగిలినవి ఇతర పార్టీలకు చేరాయి.

జాతీయ పార్టీల ఎలక్టోరల్ బాండ్ల విరాళాలలో గణనీయమైన పెరుగుదల ఉంది. 2017-18 నుంచి 2021-22 మధ్య 743 శాతం పెరుగుదల ఉంది.అదే సమయంలో కార్పొరేట్ విరాళాలు మాత్రం 48 శాతం మాత్రమే పెరిగాయని ఏడీఆర్ పేర్కొంది. ప్రాంతీయ పార్టీలు కూడా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా తమ విరాళాలలో గణనీయమైన భాగాన్ని పొందాయి.

2016-17 నుంచి 2021-22 మధ్య రాజకీయ పార్టీలు అందుకున్న మొత్తం విరాళాలలో సగానికి పైగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చినవేనని, ఇతర జాతీయ పార్టీలన్నింటి కంటే బీజేపీకి ఎక్కువ నిధులు వచ్చాయని ఏడీఆర్ తెలిపింది.

2016-17 నుంచి 2021-22 మధ్య కాలంలో ఏడు జాతీయ పార్టీలు, 24 ప్రాంతీయపార్టీలకు దాదాపు రూ.16,437 కోట్ల విలువైన విరాళాలు అందాయని పేర్కొంది. ఇందులో రూ.9,188.35 కోట్లు (దాదాపు 56 శాతం) ఎలక్టోరల్ బాండ్ల ద్వారా స్వీకరించబడ్డాయి.

పార్టీలకు రాజకీయ నిధుల కోసం ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ బుధవారం కూడా కొనసాగింది.

ఎన్నికల తాయిలాలు అభ్యర్థుల ఖాతాల్లో కలపండి

(మొదటిపేజీ తరువాయి)

నోటిఫికేషన్‌తో పాటు నామినేషన్లు కూడా స్వీకరించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన సీఈసీ ప్రత్యేక బృందం బుధవారం హైదరాబాద్ చేరుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితేష్ కుమార్ వ్యాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్‌ల బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో భేటీ అయ్యింది. ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, అదనపు సీఈఓ లోకేష్ కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలు, కేంద్ర సాయుధ దళాల వినియోగం తదితర అంశాలను కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం ఆయా విభాగాల ఉన్నతాధికారులతో వేర్వేరుగా కేంద్ర బృందం భేటీ అయ్యి, ఏర్పాట్లను అడిగి తెలుసుకుంది. డీజీపీ అంజనీ కుమార్ పోలీసు బందోబస్తు, శాంతి భద్రతల పరిస్థితుల్ని వివరించారు. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ రాష్ట్రంలో మద్యం క్రయవిక్రయాలు, అక్రమ మద్యం స్వాధీనం, తనిఖీల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. రవాణా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీ ప్రసాద్ పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, తనిఖీలు, ప్రత్యేక బృందాల నియామకం తదితర అంశాలను తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి సంజయ్ కుమార్ జైన్, రాచకొండ పోలీస్ కమీషనర్ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, సెంట్రల్ రిజర్వుడ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఐజీ చారుసిన్హా, వాణిజ్య పన్నులశాఖ కమీషనర్ క్రిస్టినా చోంగ్తు, ఎక్సైజ్ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. కేంద్ర బృందంలోని అధికారులు వేర్వేరుగా ఆయా శాఖలకు చెందిన అధికారులతో భేటీ అయ్యి, సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అక్రమ మద్యం, మాదక ద్రవ్యాల తరలింపును అడ్డుకోవడానికి సాంప్రదాయ పద్ధతులు కాకుండా ఆధునికంగా ఆలోచించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు సూచించారు.

దీనికోసం సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. కాల్‌సెంటర్ నెంబర్ 1950 వినియోగం, వస్తున్న ఫిర్యాదులు, సువిధ పోర్టల్, ఆన్‌లైన్ ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన సీ-విజిల్, ఇంటిగ్రేటెడ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు, వాటి పనితీరును తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా తుది సవరణల తరువాత పెండింగ్ దరఖాస్తుల స్థితి, ఓటరు కార్డుల పంపిణీ, ఓటర్ల సమాచార స్లిప్‌ల పంపిణీ ఏర్పాట్లు వంటి పలు అంశాలను కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ (ఎమ్‌సీఎమ్‌సీ) సర్టిఫికెట్లను రోజువారీగా జారీ చేయాలని ఆదేశించారు. సమస్యాత్మకంతో పాటు కీలక పోలింగ్ కేంద్రాల్లో నిఘా కెమెరాల ఏర్పాట్లను సమీక్షించారు. దినపత్రికలు, వార్తా ఛానళ్ల కవరేజీని పరిశీలించారు. ఇంటివద్ద నుంచే ఓటు వేయాలనుకునే సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఫారాలను ముందుగానే అందచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గురువారం కూడా కేంద్ర బృందం హైదరాబాద్‌లోనే మకాం వేసి, సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాలు నిర్వహించనుంది. దీనిలో రాష్ట్ర ఎన్నికల అధికారులు కూడా పాల్గొంటారు.

భ్రమలు తొలిగినయ్.. రేకులు రాలుతున్నాయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాధారణంగా ఎన్నికలవేళ ఏ పార్టీలోనైనా సందడి ఉంటుంది. నేతల కోలాహలం కనిపిస్తుంది. కానీ, బీజేపీలో మాత్రం చేజారుతున్న నేతలతో తీవ్ర నైరాశ్యం నెలకొంటున్నది. "పోను..పోను..పార్టీ అసలే మారను.."అంటూనే నేతలు ఒక్కొక్కరుగా రాంరాం చెప్పేస్తున్నారు. హస్తం గూటికి క్యూ కడుతున్నారు. 'మీకు ఎమ్మెల్యే...మాకు ఎంపీ సీటు అనేలా దోస్తానా చేస్తూ కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై చర్యలు తీసుకోవడంలో బీజేపీ వెనుకడుగు వేసింది. బీఆర్ఎస్‌ను ఢీ కొట్టే సత్తా ఆ పార్టీకి అసలే లేదనీ, తమ భ్రమలన్నీ తొలగిపోయాయ'ని బాంబు పేల్చి మరీ పార్టీని వీడుతున్నారు. కాంగ్రెస్ పెద్దల డీల్‌దండంతో వివేక్ వెంకటస్వామి ఘర్‌వాపసీ విజయవంతంగా పూర్తయింది.

మొన్న స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్, నేడు మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ పార్టీని వీడటంతో ఎటూపాలుపోని పరిస్థితిలోకి బీజేపీ వెళ్లిపోయింది. అదే బాటలో విజయశాంతి, బాబూమోహన్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ కూడా ఉన్నారనే చర్చ పువ్వు పార్టీని మరింత కలవరపాటుకు గురిచేస్తున్నది. వారి కోసం హస్తం, బీఆర్ఎస్ పార్టీలు పోటీపడుతున్నాయి. యువతకు బీజేపీలో అస్సలే ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ రాష్ట్ర నేత ఏనుగు రాకేశ్‌రెడ్డి ఆ పార్టీకి బైబై చెప్పేశారు. ఒకదానికి వెనుక ఒకటిగా జరుగుతున్న పరిణామాలు ఆ పార్టీకి దెబ్బమీద దెబ్బ లాంటివే. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో టికెట్లు దక్కని అతి కొద్ది మంది నేతలు తమ పార్టీలో చేరుతున్నారనీ సంబురపడాలో...కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నందుకు బాధపడలాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్ జాతీయ నాయకత్వం విసురుతున్న బౌన్సర్లకు తెలంగాణలో బీజేపీ కీలక వికెట్లు టపటపా పడిపోతున్నాయి. బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు తేరుకునేలోపే జరగరాని నష్టం జరిగిపోతున్నది. ఇటీవల రాజగోపాల్‌రెడ్డి..ఏనుగు రవీందర్‌రెడ్డి...కపిలవాయి దిలీప్‌కుమార్...రేవూరి ప్రకాశ్‌రెడ్డి.. ఎ.శ్రీనివాస్‌రెడ్డి..ఇలా కీలక నేతలను లాక్కున్న కాంగ్రెస్ మిగతా వారిపై ఫోకస్ పెట్టింది. అందులో భాగంగానే వివేక్ వెంకటస్వామి ఘర్‌వాపసీని విజయవంతంగా ముగించింది. ఇప్పుడు మిగతా నేతలపైనా దృష్టి పెట్టింది. వివేక్ వెంకటస్వామి బీజేపీని వీడటం ఆ పార్టీకి మీడియా పరంగానూ, ఆర్థిక పరంగానూ తీవ్ర నష్టం చేకూర్చినట్లేనని చర్చ నడుస్తున్నది. దీంతో ఈటలకు వ్యతిరేకంగా జట్టు కట్టిన అసంతృప్త నేతల్లో ఇప్పటికే ఆ పార్టీని ఐదుగురు సీనియర్లు వీడినట్టు అయింది. వీరంతా మూకుమ్మడిగా రెండు,మూడు కీలకాంశాలు చెప్పి పార్టీని వీడటం గమనార్హం. ఆరు నెలల కిందటి దాకా బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులూ పదేపదే బీఆర్ఎస్ అవినీతి చిట్టా తమ దగ్గర ఉందనీ, త్వరలోనే వారి పని ఖతం అనే స్థాయిలో మాట్లాడారు. దీంతో తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి కేసీఆర్‌తో విభేదించి బయటకు వచ్చిన వారంతా కాలక్రమంలో బీజేపీలో చేరిపోయారు. కానీ, కర్నాటక ఎన్నికల తర్వాత బీజేపీ వైఖరిలో దూకుడు తగ్గింది. మద్యం కుంభకోణం విషయంలో కవిత అరెస్టు కాబోతున్నది.. కాబోతున్నది..అని పదేపదే ప్రచారం చేసినా అదీ జరగలేదు. కాళేశ్వరం అవినీతి అంశంపైనా విచారణ చేపట్టలేదు. పైగా, బీఆర్ఎస్‌తో బీజేపీ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నదని అందుకే ఆ పార్టీలో దూకుడు తగ్గిందనే చర్చామొదలైంది. దీంతో బీజేపీ నాయకత్వంపై వలసనేతలకున్న భ్రమలు క్రమంగా తొలగిపోవడం ప్రారంభమైంది. బీజేపీలో ఉంటే తమకు రాజకీయ భవిష్యత్ ఉండదనే నిర్ణయానికి వచ్చేశారు. దీంతో ఎలా వెళ్లిన నేతలు అలాగే ఒక్కొక్కరుగా బయటకు వచ్చేస్తున్నారు. ఈ జంపింగ్‌లు ఇంతటితోనే ఆగవనీ, వారం రోజుల్లో ఇవి మరింత తీవ్రమయ్యే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. పార్టీ నుంచి నాయకులు ఎందుకు వెళ్లిపోతున్నారు? ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు? మీరేం చేస్తున్నారు? ఎన్నికల ముందు ఇదేం పరిస్థితి? అని రాష్ట్ర నాయకత్వంపై అమిత్‌షా, నడ్డా అక్షింతలు వేసినట్టు తెలిసింది.

ఎన్నికలకు ముందు రూ.1,148 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు

- హైదరాబాద్‌లోనే అత్యధిక బాండ్లు
- వివిధ పార్టీలకు చేరిన విరాళాలు కోట్లల్లో...

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు రూ.1,148 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల విక్రయం జరిగింది. వీటివల్ల వివిధ పార్టీలకు కోట్ల రూపాయల నిధులు సమకూరాయి. 28వ విడత ఎలక్టోరల్ బాండ్లను అక్టోబర్ 4 నుంచి 14 వరకు విక్రయించగా, అక్టోబర్ 9న ఐదు అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్‌లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అక్టోబర్‌లో మొత్తం రూ.1,148.38 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌లను విక్రయించింది. అత్యధికంగా హైదరాబాద్ శాఖలో (33 శాతం) అమ్మకాలు జరిగాయి. ఈమేరకు సమాచార హక్కు అర్జీకి ఇచ్చిన సమాధానం ప్రకారం ఎస్బీఐ హైదరాబాద్ శాఖ రూ. 377.63 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను విక్రయించింది. ఇది మొత్తంలో దాదాపు 33 శాతం, కానీ ఎన్‌క్యాష్ చేయడానికి సమయం వచ్చినప్పుడు, తెలంగాణ రాజధానిలో రాజకీయ పార్టీలు రూ. 83.63 కోట్లు (7 శాతం) మాత్రమే రీడీమ్ చేశాయి. పారదర్శకత ప్రచారకర్త కమోడోర్ లోకేష్ కె బాత్రా (రిటైర్డ్) ఆర్టీఐ ప్రశ్నకు ఎస్‌బిఐ ఇచ్చిన సమాధానంలో 25 రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్లను రీడీమ్ చేయడానికి ఖాతాలు తెరిచాయని తెలిపింది.

ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాలలో, హైదరాబాద్ తరువాత టాప్ బ్రాంచ్‌లుగా కోల్‌కతా (రూ.255.28 కోట్లు), ముంబయి (రూ.177.90 కోట్లు), న్యూఢిల్లీ (రూ.130.68 కోట్లు), చెన్నై (రూ.95.50 కోట్లు) ఉన్నాయి. జాతీయ పార్టీలు తమ ఖాతాలను కలిగి ఉంటాయని భావిస్తున్న ఎస్బీఐ న్యూఢిల్లీ శాఖలో అత్యధిక మెజారిటీ ఎలక్టోరల్ బాండ్లు ఎన్‌క్యాష్ చేయబడ్డాయి. న్యూఢిల్లీలో రూ. 800 కోట్లు (70 శాతం), కోల్‌కతా రూ.171.28 కోట్లు, హైదరాబాద్, ముంబయిల్లో రూ. 39 కోట్లు చొప్పున, పాట్నాలో 25 కోట్లు ఎన్‌క్యాష్ చేయడంలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

ఎలక్టోరల్ బాండ్లు రూ. 1,000, రూ. 10,000, రూ. 1 లక్ష, రూ. 10 లక్షలు, రూ. 1 కోటి డినామినేషన్లలో అందుబాటులో ఉన్నప్పటికీ, అతిపెద్ద డినామినేషన్ అత్యంత ప్రజాదరణ పొందింది. ప్రస్తుతం, ఎస్బీఐ 2,012 వ్యక్తిగత ఎలక్టోరల్ బాండ్లను విక్రయించింది. వీటిలో సగానికి పైగా (1,095) రూ. 1 కోటి విలువ కలిగి ఉన్నాయి.

వారు విచ్ఛిన్నకారులు

(మొదటిపేజీ తరువాయి)

పదేండ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సీఎం కేసీఆర్ ఇచ్చిన మద్దతేనని గుర్తుచేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎంఐఎం పార్టీకి ఏటీఎం లాంటోరని వ్యాఖ్యానించారు. రెండు శాతం ఓట్లే వచ్చే బీజేపీ బీసీని సీఎంను చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో ఆ మూడు పార్టీలు ఒక్కటై ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. రాష్ట్ర ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి, 2024లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే ఓబీసీల కుల గణన చేపడతామని అన్నారు. ఓబీసీల కులగణనతో ఆర్థిక సంక్షేమ వికాసానికి పునాది ఏర్పడుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కల్వకుర్తి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో జరిగిన సభల్లో రాహుల్‌గాంధీ పాల్గొని మాట్లాడారు.

రాష్ట్రంలో ధరణి వల్ల దాదాపు 20 లక్షల మంది రైతులు నష్టపోయారని, ధరణీ వల్ల కేసీఆర్ కుటుంబానికి మాత్రమే లాభం జరిగిందని రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణ ఏర్పడితే మేలు జరుగుతుందని ప్రజలందరూ ఎన్నో కలలుగన్నారని, వారి కలలను కేసీఆర్ కుటుంబం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను పెంచుకుంటూ పోయి చివరకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, ఇప్పుడు ఆ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడం, నీరు ఉబికి రావడం లాంటి సమస్యలు బయటపడుతున్నాయన్నారు. ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూములు పంచితే కేసీఆర్ మాత్రం ధరణి పేరుతో వాటిని లాక్కొని పేదలను రోడ్డున పడేశారని విమర్శించారు.

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే మరునాడే ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ టాక్స్ అధికారులు దాడులు చేస్తారని, కానీ రాష్ట్ర సీఎంపై ఇప్పటివరకు అలాంటి దాడులు ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. తనపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు 20 కేసులను బనాయించిందని, చివరకు నా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేసి ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు కూడా గుంజుకుందన్నారు.

మోడీ తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడబోనన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇస్రో సంస్థను బలోపేతం చేస్తే, తామే చేశామని మోడీ చెప్పుకోవడం విడ్డూరమని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ తుఫాను ప్రకంపనలు, ఈ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబాన్ని ఇంటికి పంపించడానికి తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను తప్పనిసరిగా అమలు చేసి తీరుతామని అన్నారు.

ప్రజల సమస్యలను విస్మరించి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

సభల్లో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్ రెడ్డి, మల్లు రవి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల శ్మశాన వాటిక



(మొదటిపేజీ తరువాయి)

యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ ఆవేదన వ్యక్తం చేశారు. గాజా స్ట్రిప్‌పై కనికరంలేని ఇజ్రాయిల్ బాంబుదాడుల్లో సుమారు 3,542 మంది చిన్నారులు మరణించినట్టు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక తెలిపింది. డజన్ల నుండి వందలాది, వేలాది మంది చిన్నారులు దాడుల్లో మరణించడం ఆవేదన కలిగిస్తోందని, రోజుకి సగటున 400కు పైగా చిన్నారులు మరణిస్తున్నారని అన్నారు.

ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణకు పిలుపునివ్వాలని పునరుద్ఘాటించారు. అలాగే ఎలాంటి అడ్డంకులు లేకుండా మానవతా సాయం అనుమతించేలా అన్ని సరిహద్దులను వెంటనే తెరవాలని అన్నారు. కాల్పుల విరమణ ప్రకటించకపోతే చిన్నారులు తీవ్రమైన నీటి, మందుల కొరతను ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. 72 గంటల పాటు కాల్పుల విరమణ ప్రకటిస్తే సుమారు వెయ్యిమంది చిన్నారులను రక్షించినట్లేనని ఎల్డర్ తెలిపారు. ఆహారం, నీరు, ఇంధనం, మందులతో పాటు ఇతర మానవతా సాయాన్ని వారికి అందించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

గాజాలో చిన్నారులు బాంబులు, మోర్టార్ల కన్నా డీహైడ్రేషన్‌తో మరణించే ముప్పు ఉందని హెచ్చరించారు. చాలా మంది పిల్లలు ఉప్పునీరు తాగడంతో అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో తీవ్రమైన నీటి సంక్షోభం ఉందని, సాధారణంగా లభించే మంచినీటిలో కేవలం 5 శాతం మాత్రమే అందుబాటులో ఉందని అన్నారు. చాలావరకు సముద్రపు నీటి నుంచి ఉప్పును వేరు చేసే ప్లాంట్లు ధ్వంసం కాగా, మరికొన్ని ఇంధనం లేక మూతపడ్డాయని అన్నారు.

గాజాలో మూడు వంతులకు పైగాచిన్నారులు గాయాలతో, ఎదుర్కొన్న దాడులతో మానసిక ఆందోళనకు గురయ్యారని అన్నారు. ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య యుద్ధం ముగిసే నాటికి కొన్ని తరాల భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ వెంటనే కాల్పుల విమరణను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టులన్నీ పరిహాసాలేనా..!?

మేడిగడ్డ బ్యారేజీ బాటలోనే అన్నారం

- ఇసుక సమస్యతో నీటిబుంగలు !
- సుందిళ్లలోనూ లోపాలు ?

బి.బసవపున్నయ్య



కాళేశ్వరంపై నీలినీడలు

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పరిపాలనా కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకమవుతున్నది. వాటి ఉనికిపై రోజురోజుకు అనుమానాలు పెరుగుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల నిధులు కృష్ణా, గోదావరి జలాల్లో కొట్టుకుపోయిన భావన కలుగుతున్నది. నాసిరకం పనులు చేశారనడానికి అనేక భౌతిక సాక్ష్యాలు ఆయా ప్రాజెక్టుల బ్యారేజీ పిల్లర్ల పగుళ్లు, నీటి బుంగల రూపంలో కండ్లకుకడుతున్నాయి. అవినీతి, అక్రమాలకు అడ్రస్‌గా తెలంగాణ ప్రాజెక్టులు మిగిలిపోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు నిజంగానే అగ్ని పరీక్షను ఎదుర్కొంటున్నది. ప్రభుత్వంతోపాటు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలవైపు ప్రజలు అనుమానపు చూపులు చూసే పరిస్థితి ఎదురవుతున్నది. అధికార, ప్రతిపక్షాల ఆవేశకావేశాలు ఎలా ఉన్నా, వాస్తవాలను ఏమార్చే పరిస్థితి లేదు. నిన్నటి మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీ ఉదంతం మరువక ముందే నేడు జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని అన్నారం బ్యారేజీ నాలుగో బ్లాకులోని 38, 39, 40 నంబరు గల రెండు గేట్ల వద్ద లీకేజీతో మరో ప్రమాదం ముందుకురావడంతో కాళేశ్వరంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పిల్లర్ల బేస్‌మెంట్ కింద ఇసుకలో కదలికలు ఉండటం మూలానే నీటిబుంగలు ఏర్పడుతున్నాయి. ఇది పక్కా భారీ లీకేజీ ఉంటేనే సాధ్యమవుతుందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థ ఆధ్వర్యంలో రూ. 2730 కోట్లతో అన్నారం బ్యారేజీ నిర్మితమైంది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు ఖండిస్తున్నా, ఇదే వాస్తవమని స్థానికులు చెబుతున్నారు. మేడగడ్డ బ్యారేజీలోనూ ఇసుక సమస్యమూలంగా పగుళ్లు వచ్చినట్టు సాగునీటిశాఖ తాత్కాలిక నిర్ణయాకొచ్చింది. విచారణ అనంతరం వాస్తవాలు బయటకురానున్నాయి. దీంతో రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు నిర్మించిన ప్రాజెక్టులపై అనుమానాలు పొడసూపుతున్నాయి. నాణ్యత ప్రశ్నార్థకమవుతుండటంతో ఆయా ప్రాజెక్టుల నాణ్యతపై వాటి కింద ఉన్న సామాన్య నిర్వాసితులు, ఇతర అంశాలపై ఆందోళన కలుగుతున్నది.

కేసీఆర్ సర్కారు సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. తెలంగాణ కోసం పోరాడే క్రమంలో నీళ్లు, నిధులు, నియామకాల పేర ట్యాగ్‌లైన్ సైతం తగిలించుకుంది. నీళ్ల విషయంలో తప్ప మిగిలిన రెండింటిలో పెద్దగా పురోగతి లేదు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను ఎక్కువశాతం ప్రాజెక్టుల్లోనే కుమ్మరించింది. నిధుల విషయానికొస్తే ప్రజల నుంచి వచ్చిన ఆదాయాన్ని మాత్రం ఖర్చుపెట్టగలిగిందిగానీ, కేంద్రంలోని బీజేపీ సర్కారు నుంచి ఏమీ రాబట్టలేకపోయింది. నిటిఅయోగ్ సూచించినా కాళేశ్వరానికి నయాపైసాను తెచ్చుకోలేకపోయింది. కాగా భారీగా ప్రజల సొమ్ముని ఖర్చుపెట్టి నిర్మించిన ప్రాజెక్టుల్లో లోపాలు బట్టబయలవుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీలు మూడున్నాయి. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీ, అన్నారం(సరస్వతీ) బ్యారేజీ, పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాశీపేటలో సుందిళ్ల బ్యారేజీలు నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ కంప్ట్రోలర్, అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రిపోర్టు ప్రకారం కాళేశ్వరం బహుళార్థక సాధక ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టుకు రూ.1.26 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. మరో రూ. 50 వేల కోట్లు ఖర్చుపెడితేగానీ ఆ ప్రాజెక్టు పూర్తికాదనేది సాగునీటి శాఖ సమాచారం. ఆమేరకు 'కాగ్' సైతం ధృవీకరించింది. ప్రాజెక్టు కోసం తొలుత రూ. 80 వేల కోట్లకుపైగా ప్రాథమిక అంచనాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను ప్రభుత్వం సైతం రూపొందించింది. కాలం గడుస్తున్నా కొద్దీ అంచనాలుపెరుగుతూ వచ్చాయి. ప్రాజెక్టును వేగంగా చేపట్టి పూర్తిచేయాలనే లక్ష్యంతో ఒక్క కంపెనీకి కాకుండా పలు సంస్థలకు పనులు కేటాయించింది. గ్లోబల్ టెండర్లు పిలిచినా కొన్ని సంస్థల పట్ల పక్షపాతం చూపించారంటూ ఆరోపణలు, విమర్శలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. చివరకు అసెంబ్లీలోనూ చర్చ జరిగింది. ప్రతిపక్షాలు గులాబీ సర్కారుపై ఒంటికాలిపై లేచాయి. వాటిన్నంటిని బేఖాతరు కేసీఆర్ ప్రభుత్వం తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లంటూ ముందుకు సాగిపోయింది. ప్రస్తుత పరిస్థితి ప్రాజెక్టుల్లోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తుండటం గమనార్హం. వర్షాలతో వచ్చిన వరదలకు రక్షణ గోడ సరిగ్గాలేక కన్నేపల్లి పంపుహౌజ్‌లోని దాదాపు సగం మోటర్లు నీటమునిగాయి. బీహెచ్‌ఈఎల్ ద్వారా మెఘా ఇంజినీరింగ్ కంపెనీ మోటర్లను సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. వీటిని పునరుద్ధరించడానికి దాదాపు ఏడాదిపైనే సమయం పట్టింది. ఇకపోతే మేడిగడ్డ సంగతి ఇంకా తేలనేలేదు, అప్పుడే ముచ్చటగా మూడో సంఘటన చోటుచేసుకోవడం సర్కారుపై దెబ్బమీద దెబ్బపడుతున్నది. ఇదిలావుండగా సుందిళ్లబ్యారేజీ నిర్మాణంలోనూ లోపాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుండటం గమనార్హం.

సంచలనం కోసమే దుబ్బాక అభ్యర్థిపై దాడి

- ఎంపీపై హత్యాయత్నం చేసిన నిందితుని అరెస్ట్
- సిద్దిపేట పోలీస్ కమీషనర్ ఎన్.శ్వేత
- ప్రత్యేక బృందాలతో కొనసాగుతున్న కేసు విచారణ

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

సంచలనమైన సంఘటన చేయడం ద్వారా తనపై అందరి దృష్టి పడాలనే హత్యాయత్నానికి పాల్పడినట్టు దుబ్బాక అభ్యర్థి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన నిందితుడు రాజు చెప్పినట్టు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలోని సూరంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన ఘటం రాజు(40) కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడని తెలిపారు. దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామని, ప్రత్యక్ష, పరోక్ష సాక్షులను విచారించి.. సాంకేతిక నైపుణ్యంతో ఆధారాలు సేకరించామన్నారు. నిందితుడు ఘటం రాజు విలేకరి అని చెప్పుకుంటూ ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తూ జల్సాలు చేసే వాడన్నారు. అతనిపై ఎక్కడా కేసు నమోదు కాలేదన్నారు. ఈ క్రమంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని చంపాలనే ఉద్దేశంతోనే దుబ్బాక మార్కెట్‌లో కత్తి కొనుగోలు చేసి హత్యకు యత్నించినట్టు తెలిపారు. హత్యకు యత్నించిన ప్రదేశంలో నిందితుడిని అక్కడున్న ప్రజలు కొట్టి గాయపరిచారని తెలిపారు. రాజును అదుపులోకి తీసుకొని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించామన్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసిన అనంతరం నిందితుడు రాజును తొగుట సీఐ కమలాకర్ బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా.. సంచలనమైన సంఘటన చేయడం ద్వారా తనపై అందరి దృష్టి పడాలనే హత్యాయత్న చేశానని నేరాన్ని ఒప్పుకున్నట్టు సీపీ తెలిపారు. నిందితుడు నేరం చేయడానికి గల ఇతర కారణాలు ఉన్నాయా.. నిందితుడికి ఈ నేరం చేసేందుకు ఎవరైనా సహకరించారా.. ఎవరైనా ప్రోత్సహించారా.. అన్న కోణాల్లోనూ విచారణ కొనసాగుతుందని సీపీ శ్వేత తెలిపారు.

ప్రతి ఒక్కరూ తమ మూలాలను కాపాడుకోవాలి

- లండన్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి ఒక్కరూ లండన్‌లో విభిన్న బహుళ సంస్కృతిని ఆలింగనం చేసుకుంటూనే తమ మూలాలను కాపాడుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. ఆమె అక్కడ మొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే మొదటిసారిగా వివిధ తెలంగాణ ఎన్నారైలు, తెలంగాణ సంఘాలు ఐక్యంగా ఏర్పాటు చేసిన విగ్రహమని తెలిపారు. అక్కడ కమ్యూనిటి సంస్థల సంస్కృతి, భాషా, సేవా కార్యక్రమాలను ఆమె ప్రశంసించారు. తెలంగాణ తల్లి విగ్రహం ఇంగ్లాండ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ సమాజానికి ఐక్యత, శక్తికి చిహ్నంగా నిలుస్తున్నదని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించినందుకు కవితకు తెలంగాణ ప్రజా సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు కిశోరె మున్నాగాల , దన్నంనేని సంపత్ కృష్ణ , సుమన్ బలమూరి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న మంత్రి కేటీఆర్ వాహనం తనిఖీ



నవతెలంగాణ - తూప్రాన్ రూరల్ / మనోహరాబాద్

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద బుధవారం మంత్రి కేటీఆర్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో చెక్‌పోస్ట్‌లో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాహనాన్ని పోలీసులు, ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. కేటీఆర్ తన వాహన తనిఖీకి పూర్తిగా సహకరించారని పోలీసులు తెలిపారు. తనిఖీ అనంతరం కేటీఆర్ కామారెడ్డి బయలుదేరారు.

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ఫ్రీ మెడికల్ సౌకర్యం

- సర్క్యులర్ జారీ చేసిన సింగరేణి డైరెక్టర్(పా)
- సీఐటీయూ పోరాటం వల్లే.. : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణిలోని ప్రయివేటు సెక్యూరిటీ గార్డులు, కన్వెయన్స్ డ్రైవర్లు, ఇతర పర్చేస్ టెండర్లు(యూనిట్ రేట్)లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఫ్రీ మెడికల్ (పీఎంఈ, ఐఎండీ) సౌకర్యం కల్పిస్తూ సర్క్యులర్‌ను సింగరేణి డైరెక్టర్(పా) బలరాం నాయక్ బుధవారం జారీ చేశారు. దీనివల్ల నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులకు లబ్ది చేకూరనున్నది. పీఎంఈ, ఐఎంఇ చేయించుకునే సందర్భంగా ప్రతి కాంటాక్ట్ వర్కర్ ఇక నుంచి రూ.2,500 కట్టాల్సిన అవసరం లేదు. ఈ సర్క్యులర్ రిలీజ్ చేసిన సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం నాయక్‌కి, దీనికోసం కృషి చేసిన జనరల్ మేనేజర్ (పర్సనల్) బి. హనుమంతరావుకి, పర్సనల్ అధికారులకు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు ధన్యవాదాలు తెలిపారు. సీఐటీయూ పోరాటాల ఫలితంగానే సర్క్యులర్ జారీ అయిందని పేర్కొన్నారు.



పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఆపాలి

భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలి

- ప్రజా సంఘాల డిమాండ్

నవతెలంగాణ - ముషీరాబాద్

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని ఆపాలని, పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని, భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలని సీఐటియూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా టీఎన్‌టీయూసీ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాలు తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాలస్తీనాకు మద్దతుగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలస్తీనా భూభాగం మీద, ప్రజల మీద ఇజ్రాయిల్ తీవ్రమైన దాడులు చేస్తున్నదన్నారు.

ఎక్కడ చూసినా శవాల గుట్టలు, పసిపిల్లల ఆర్తనాదాలతో గాజా ప్రాంతమంతా రోదనగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 75 ఏండ్లుగా పాలస్తీనా భూభాగాన్ని అక్రమించుకుంటూ ఈ యుద్ధం ద్వారా ప్రపంచ పటం నుంచి పాలస్తీనా ఉనికి లేకుండా చేయాలని, పాలస్తీనా ప్రజలందరిని శరణార్థులుగా మార్చేసి అ భూబాగాన్ని అక్రమించాలని, ఒక సామ్రాజ్యవాద అధిపత్య కుట్రతో యుద్ధం కొనసాగుతున్నదన్నారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ.. అమెరికా ఒక్కటే ఇజ్రాయిల్‌కు అండగా నిలబడిందన్నారు. దేశంలోని బీజేపీ ప్రభుత్వం గత సంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఇది మన దేశానికి ప్రమాదకరమని, ప్రపంచ శాంతికి నష్టం కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా ఇజ్రాయిల్‌లోని గాజా ప్రాంతాన్ని వదిలిపెట్టాలని, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను అంగీకరించాలని కోరారు.

కార్యక్రమం లో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, టీఎన్‌టీ యూసీ అధ్యక్షులు యంకె బోస్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, సీఐటీయూ నాయకులు వంగూరి రాములు, బి మధు, కూరపాటి రమేష్, శ్రీకాంత్, ఈశ్వర్ రావు, వెంకటేష్, కుమార్, మహేందర్, మూడ్ శోభన్ (తెలంగాణ రైతు సంఘం), అరుణజ్యోతి, అశాలత, విమల(ఐద్వా), యం ధర్మానాయక్ (గిరిజన సంఘం) కోట రమేష్, జావెద్ (డివైఎఫ్ఐ), టి. నాగరాజు, అశోక్ రెడ్డి, లెనిన్ (ఎస్ఎఫ్ఐ) తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రలోభాలకు చెక్‌పెట్టేలా..!

- సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ఈసీ
- ఈ యాప్‌తో ఫోటో, ఆడియో, వీడియో ఆధారంగా ఫిర్యాదు
- వెంటనే పరిశీలించనున్న ఈసీ.. గోప్యంగా ఫిర్యాదుదారుల వివరాలు
- గూగుల్ ప్లే స్టోర్ నుంచి సీ-విజిల్ యాప్ డౌన్‌లోడ్..

నవతెలంగాణ-సిటీబ్యూరో



త్వరలో జరగనున్న తెలంగాణ శాసనసభ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు, ఆయా రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు మద్యం, డబ్బు పంపిణీపై నిఘా పెట్టేందుకు ఎలక్షన్ కమిషన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలో 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఈ యాప్‌ను ఉపయోగించింది. అప్పట్లో ఈ యాప్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ సీ-విజిల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఫోటోలు, ఆడియో, వీడియోల ఆధారంగా నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వారెవరైనా ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. మీ పేరు, జిల్లా, పిన్‌కోడ్ వంటి వివరాలు ఎంటర్ చేయమంటుంది. అనంతరం ఫొటో, ఆడియో, వీడియో మూడు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. లైవ్ లొకేషన్ ఆన్ చేసి అక్కడి పరిస్థితుల ఆధారంగా ఆప్షన్ ఎంపిక చేసుకుని ప్రొసీడ్ కొడితే నేరుగా సంబంధిత అధికారులకు విషయం చేరిపోతుంది. సీ-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతారు.

వంద నిమిషాల్లోనే..

ఎక్కడైతే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా మద్యం, డబ్బు, ఇతర సామాగ్రి పంపిణీ చేస్తూ.. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తారో దానికి సంబంధించిన ఫొటో, ఆడియో, వీడియో గానీ తీసి.. దాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇందులో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులను ఎలక్షన్ కమిషన్ వెంటనే పరిశీలిస్తుంది. వంద నిమిషాల్లోనే చర్యలకు ఉపక్రమిస్తుంది. సీ-విజిల్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వారి పేర్లు, ఫోన్ నెంబర్లను ఈసీ రహస్యంగా ఉంచుతుంది. అంతేగాక బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారనే అంశాన్ని కూడా ఫిర్యాదుదారులకు చేరవేస్తారు. కాబట్టి ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కండ్ల ముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే జీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదుచేయాలి. ఇది సురక్షితమైనదని, దీనిని ఆపరేటింగ్ చేయడం సైతం చాలా సులువైనదని అధికారులు చెబుతున్నారు. ఇంగ్లీష్‌లో కానీ తెలుగులో కానీ సమస్యను పంపించవచ్చు. గ్రేటర్‌లోని ప్రజలు సీ-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఈ యాప్ ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సీ విజిల్ యాప్‌ను ఎక్కువ మంది డౌన్‌లోడ్ చేసుకునేలా, ప్రలోభాలపై ఫిర్యాదుచేసేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని అధికారులు వివరిస్తున్నారు.

వికలాంగుల కోసం.. సాక్ష్యం యాప్

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వికలాంగుల కోసం సాక్ష్యం అనే ఒక యాప్ తయారు చేశారు. ఈ యాప్ ద్వారా వివిధ రకాలైన సేవలు పొందుటకు అవకాశం కల్పించారు. ఈ యాప్ ద్వారా వికలాంగులకు కొత్త ఓటర్ నమోదు, ఓటర్ బదిలీ, తప్పుల సవరణ, తీసివేత, ఆధార్‌తో అనుసంధానం చేసుకోవచ్చు. అలాగే వీల్ చైర్ కోసం అభ్యర్థన పెట్టుకోవచ్చు. వికలాంగులను ఓటర్ కేంద్రం వరకు తీసుకెళ్లి.. తిరిగి పంపుటకు అభ్యర్థనతో పాటు సహాయకులకు అభ్యర్థన చేసుకునే వీలుంది. ఎలక్ట్రోల్ రోల్ నందు పేరుని గుర్తించడం, పోలింగ్ కేంద్రం ఎక్కడ అనేది తెలుసుకోవడం మొదలైన సేవలు ఈ యాప్ ద్వారా అందిస్తారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటితో పాటు మరో నాలుగు యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది.

చంద్రబాబుకు ఘనస్వాగతం

టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

- మాజీ సీఎంను పరీక్షించిన ఏఐజీ దాక్టర్ల బృందం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబుకు హైదరాబాద్‌లో ఘనస్వాగతం లభించింది. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన బాబు, బుధవారం తెల్లవారురఘామున ఉండవల్లి నివాసానికి వెళ్లారు. అక్కడి నుంచి గన్నవరం విమానాశ్రయం చేరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా బేగంపేట విమానాశ్రయానికి భారీగా ఆపార్టీ శ్రేణులు, అభిమానాలు, ఐటీ ఉద్యోగులు జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లో చంద్రబాబు నివాసం వరకు ర్యాలీగా వెళ్లారు. కోర్టు షరుతుల నేపథ్యంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడకుండానే కారులో నుంచి ప్రజలకు నమస్కరించి ముందుకుసాగారు. వందలాది అభిమానులు, కార్లు, బైక్‌లపై చంద్రబాబు కాన్వాయ్‌ను అనుసరిస్తూ బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వచ్చారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఏఐజీ డాక్టర్ల బృందం చంద్రబాబు నివాసానికి వెళ్లి అతనిని కలిసింది. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచన మేరకు గురువారం ఉదయం పది గంటలకు చంద్రబాబు ఏఐజీ ఆస్పత్రికి వెళ్లనున్నారు. ఈ మేరకు ఆయనకు అవసరమైన వైద్యపరీక్షలు చేయనున్నారు. 52 రోజులపాటు రాజమండ్రి జైలులో ఉన్న ఆయన మంగళవారం విడుదలైన సంగతి తెలిసిందే. అలాగే ఏఐజీ ఆస్పత్రిలో పరీక్షలు, ఇతరాలు అయిన తర్వాత సాయంత్రం ఇంటికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం మరుసటి రోజు శుక్రవారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి చంద్రబాబుకు వైద్యపరీక్షలు చేసే అవకాశముంది. రెండోరోజు కూడా బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంచుకున్నారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని బాబుకు జేజేలు పలికారు. ఆపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇతర నాయకులు ఇందులో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డ రైతాంగం

కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్నారు : మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డ రైతాంగం సీఎం కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్నారని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరును ఎండబెట్టిందని, అప్పులున్న రైతుల ఇంటి తలుపులు పీక్కొని వచ్చిందని విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా రూ.72,815 కోట్ల రైతులకు జమ చేసిన ప్రపంచంలోనే ఏకైక ప్రభుత్వమని తెలిపారు. రైతు బీమా ద్వారా 1,11,320 మంది రైతు కుటుంబాలకు రూ.5,566 కోట్ల బీమా పరిహారం అందేలా చేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా తెలంగాణ తరహా పథకాలు లేవని తెలిపారు. ధాన్యం సేకరణలో, 24 గంటల ఉచిత విద్యుత్ అందించడంలో, రుణమాఫీ, నకిలీ, కల్తీ విత్తనాలను అరికట్టడంలో దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు.

బీసీలకు 20 టికెట్లు మాత్రమే ఇచ్చి న్యాయమెలా చేస్తారు?

- కాంగ్రెస్‌కు పొన్నాల ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ 20 మంది బీసీలకు టిక్కెట్లిస్తే 40 మంది రెడ్లకు ఇచ్చిందనీ, అలాంటి పార్టీతో బీసీలకు న్యాయమెలా దక్కుతుందని బీఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వి.హనుమంతరావు సొంత నియోజకవర్గంలో ముగ్గురు బీసీలు టికెట్లడిగితే ఇవ్వకుండా ఖైరతాబాద్ నుంచి రోహిన్ రెడ్డిని తెచ్చి నిలబెట్టారని విమర్శించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్, ఎర్ర శేఖర్, ఆదిలాబాద్ సుజాత, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే అనిల్ లాంటి అనేక మంది బీసీ నేతలకు టికెట్స్ ఎగ్గొట్టి రెడ్డిలకు అమ్మనుకున్నారని ఆరోపించారు. సర్వేలు చేస్తున్నామనీ, ఆ సర్వేల్లో గెలిచిన వారికే టికెట్లు ఇస్తామనీ, పారాచూట్లకు టికెట్లు లేవని స్పష్టం చేసి, 40 టికెట్లను అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో నియంత పాలన నడుస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్‌తో బీసీలకు న్యాయం జరగడమనేది ఒక కల అని ఎద్దేవా చేశారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బత్తుల హైమావతికి గాయాలు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

రోడ్డు ప్రమాదంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బత్తుల హైమావతికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల హైమావతి, ఆమె కుమారుడు లెనిన్‌తో కలిసి కారులో ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళుతుండగా వరంగల్ క్రాస్ రోడ్డులో ఆగి ఉన్న లారీని కారు ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హైమావతికి, లెనిన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వారిని సీపీఐ(ఎం) జిల్లా, మండల నాయకులు పరామర్శించారు.

చెట్ల పొదల్లో నవజాత శిశువు

- పీక్కుతిన్న కుక్కలు..
- ఐడీఏ బొల్లారంలో దారుణం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

నవజాత శిశువును బ్యాగులో కుక్కి చెట్ల పొదల్లో పడేయగా.. కుక్కలు పీక్కుతిన్నాయి. ఈ దారుణమైన ఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో అప్పుడే పుట్టిన ఓ నవజాత శిశువును గుర్తు తెలియని దుండగులు బ్యాగులో తెచ్చి చెట్ల పొదల్లో పడేశారు. అక్కడి వీధికుక్కలు ఆ శిశువు సగ భాగం.. కాళ్ల నుంచి మెడ వరకు తినేశాయి. తల, మెడ మిగిలి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కనీసం కండ్లు కూడా సరిగ్గా తెరువని పసిగుడ్డును కుక్కలు పీక్కుతినడం చూసి అక్కడి వారు చలించిపోయారు.

కాంగ్రెస్ హయాంలో మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించాం

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గతంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ గుర్తు చేశారు. ఆ సమయంలో లక్షల మంది మైనార్టీ విద్యార్థులు చదువుకున్నారని చెప్పారు. తెలంగాణలో 936 మంది, ఏపీలో 400 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ చదువుతున్నారని చెప్పారు. దేశంలో 400 మంది మైనార్టీ డాక్టర్స్ వస్తే ఉమ్మడి ఏపీ నుంచి 1500 మంది డాక్టర్స్ చదివారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ అధికార ప్రతినిధి షమా అహ్మద్, పార్టీ నేతలు జఫ్ఫార్ జవీద్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజాముద్దీన్ తదితరులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు హామీ ఏమైందని బీఆర్ఎస్ సర్కారును ప్రశ్నించారు. 'ఇస్లామిక కల్చరల్ సెంటర్స్, మైనార్టీలకు ఇండ్లు' ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు 55 ఇంజనీరింగ్ కళాశాలు ఏర్పాటు చేస్తే, ఇప్పుడు ఆరు మాత్రమే ఉన్నాయన్నారు. త్వరలో మైనార్టీ,బీసీ డిక్లరేషన్స్ రాహుల్, ప్రియాంక గాంధీ విడుదల చేస్తారని తెలిపారు. రూ. 5000 కోట్లతో మైనార్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. తాను ఎక్కడ పోటీ చేయాలనేది అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

కల్వకుంట్ల 'స్కామేశ్వరం'

- నిన్న మేడిగడ్డ, నేడు అన్నారం బ్యారేజీలపై రేవంత్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'కల్వకుంట్ల 'స్కామేశ్వరం'లో మరో మైలు రాయి. నిన్న మేడిగడ్డ, నేడు అన్నారం. అక్కడ కూలుతున్నవి బ్యారేజీలు కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జీవితాలు. ప్రాజెక్టు అంటే నీ ఫామ్ హౌస్‌కు ప్రహరీ గోడనుకున్నావో. నీ మనవళ్ళు ఆడుకునే ఇసుక గూళ్లు అనుకున్నావో. రూ.లక్ష కోట్ల ప్రజల సొమ్మును మింగేసి, నాలుగు కోట్ల జనం నోట్లో మట్టి గొట్టావు. వందేండ్లకు పైగా ఉండాల్సిన నిర్మాణాలు, ఇలా కండ్లముందే కొట్టుకుపోవడానికి కారణం. మందేసి నువ్వు గీసిన ఆ పనికిమాలిన డిజైన్లు రూ. లక్ష కోట్ల అవినీతి' అని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు.

నేటి నుంచి డిజిటల్ సిటీజన్ సమ్మిట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేటి నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ డిజిటల్ సిటీజన్ సమ్మిట్ జరగనున్నది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో స్వచ్ఛంద సంస్థ డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఒసామా మంజర్, సెంటర్ ఫర్ డెవలప్ మెంట్ పాలసీ అండ్ ప్రాక్టీస్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ అమీర్ ఉల్లా ఖాన్, గ్లోబల్ డిజిటల్ ఇన్ క్లూజివ్ పాట్నర్ షిప్ ప్రతినిధి సోనియా జార్జ్ సమ్మిట్ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ టీ హబ్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సమ్మిట్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ఆవిష్కరణల నిపుణులు, విద్యావేత్తలు, పౌర సమాజ ప్రతినిధులు,ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య విస్తరణ, ఇంటర్నెట్ కనెక్టివిటీని పెంచడానికి గల అవకాశాలపై ప్రభుత్వాలతో కలిసి పని చేస్తున్నట్టు వారు తెలిపారు.

స్లీపర్ సెల్స్‌గా కాంగ్రెస్, బీఆర్ఎస్

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానికొకటి స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్నాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం విమర్శించారు. ఆ రెండు పార్టీలు ఒప్పందం కుదుర్చుకొని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాపార భాగస్వాములని ఆరోపించారు. తెలంగాణ ప్రజలపై రాహుల్‌గాంధీ కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి నోటుకు ఓటు కేసు ఏమైందని కేసీఆర్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరు ఉండాలనేది కేసీఆర్ నిర్ణయిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, బీజేపీ పార్లమెంట్ కార్యాలయ మాజీ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసనా సామర్థ్యాలు పెంచేలా గుణాత్మక విద్యను బోధించాలి


- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చిట్ల పార్థసారథి

నవతెలంగాణ-ఆర్మూర్



అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందించేలా గుణాత్మక విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. తన తల్లిదండ్రులు చిట్ల ప్రమీల - జీవన్ రాజ్ పేరిట నెలకొల్పిన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో బుధవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని పెర్కిట్‌లో విద్యా స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. మండలం పరిధిలోని 21 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు, ఆంగ్ల మాధ్యమంలో గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించే 140 మంది ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యాల పెంపుపై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్.సి.ఈ.ఆర్.టీ) నిపుణులతో ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. తాము బోధించే సబ్జెక్టులను ఇంగ్లీషు భాషలో విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో, వారి సామర్థ్యాలను పెంపొందించేలా ఎలా బోధించాలి అనే అంశాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్లు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ, మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నప్పటికీ విద్యార్థుల్లో ప్రస్తుత పోటీ ప్రపంచ స్థాయికి తగినట్టుగా ప్రతిభ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గుణాత్మక విద్యా బోధనా, అభ్యాసనా సామర్థ్యాల పెంపుతో పరిస్థితిలో మార్పు వస్తుందని, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించిన అనేక సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గుణాత్మక విద్య పాఠశాల స్థాయిలో సాధించాలంటే ఆయా విషయాల్లో నిర్దేశించిన సామర్థ్యాలు, అభ్యాసన ఫలితాలు ఖచ్చితంగా తరగతి గది ద్వారా మాత్రమే సాధించవలసి ఉంటుందన్నారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధిస్తున్న అనేక మంది విద్యార్థులు పై చదువులకు సంబంధించిన ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో మాత్రం ప్రవేశ అర్హత పొందలేకపోతున్నారని తెలిపారు. ప్రతి ఏటా సుమారు 15 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తుండగా, వారిలో అతికష్టంగా లక్ష మందికి మాత్రమే కొలువులు లభిస్తున్నాయన్నారు. ముఖ్యంగా పేద, దిగువ, మధ్య తరగతికి చెందిన పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యా బోధన జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బట్టీ పట్టే విధానం దూరమై, ప్రాథమిక స్థాయి నుండే అభ్యాసన ఫలితాలు, సామర్థ్యాల పెంపు దిశగా కృషి జరగాలన్నారు. ఎస్.సి.ఈ.ఆర్.టీ ఈ దిశగా ప్రయత్నాలు చేస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామం అని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. తాను చదువుకున్న ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల గురించి, ఇక్కడి విద్యార్థుల బాగోగుల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పడే తపన అనన్య సామాన్యమైనది కొనియాడారు. తీరిక లేని కీలకమైన విధుల్లో కొనసాగుతున్నప్పటికీ విద్యా స్ఫూర్తి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, డీఈఓ దుర్గాప్రసాద్, డీఐఈఓ రఘురాజ్, డీపీఓ జయసుధ, ఎస్సీఈఆర్‌టీ రిసోర్స్ పర్సన్లు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ చారి, రాజేందర్ కుమార్, ట్రస్ట్ కార్యదర్శి ఎన్.నర్సింలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారో తీన్‌మార్





ప్రపంచకప్‌లో నేడు
భారత్ x శ్రీలంక
వేదిక : ముంబయి
సమయం : మ॥ 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

అమ్మాయిలకు మరో గెలుపు
ఆసియా ఛాంపియన్‌ట్రోఫీ హాకీ

బెంగళూరు: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత మహిళల జట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1గోల్స్ తేడాతో విజయం సాధించింది. నవనీత్ కౌర్, దీపిక ఒక్కో గోల్ కొట్టగా.. జపాన్ తరఫున ఏకైక గోల్‌ను కనాడిటారా చేసింది. మరో మ్యాచ్‌లో కొరియా జట్టు 3-0తో థాయ్‌లాండ్‌ను, చైనా జట్టు 4-0తో మలేషియాను చిత్తుచేశాయి.



భారత్‌ను నిలువరించేనా..?

నేడు శ్రీలంకతో కీలక పోరు
మ్యాచ్‌కు ముందు సచిన్ విగ్రహం ఆవిష్కరణ



ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఎదురులేని టీమిండియా.. నేడు మరో కీలకపోరుకు సిద్ధమైంది. నేడు ముంబయిలోని వాంఖడే స్టేడియంలో శ్రీలంకతో పోరుకు సిద్ధమైంది. ఈ టోర్నీలో పటిష్టమైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్‌తోపాటు బంగ్లాదేశ్‌పాటు రెండు సంచలనాలను నమోదు చేసిన ఆఫ్ఘన్‌పై గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 12 పాయింట్లు ఉన్నాయి. ఆడిన ఆరింట్లోనూ గెలిచింది. ఇప్పటికే సెమీస్‌కు చేరిన టీమిండియా.. మిగిలి మూడు మ్యాచుల్లోనూ నెగ్గడమే లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన మూడు మ్యాచుల్లోనూ గెలిస్తే.. గ్రూప్ 'టాపర్ ఆఫ్ ది టోర్నీ'గా సెమీస్‌కు చేరుకోవడంతోపాటు రికార్డును నెలకొల్పనుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పటిష్టంగా ఉన్న టీమిండియాను శ్రీలంక ఓడించడం కష్టసాధ్యమే. షమీ, బుమ్రా పదునైన బౌలింగ్‌కు తోడు బ్యాటింగ్‌లో రోహిత్, విరాట్, గిల్, కెఎల్ రాహుల్ ఫామ్‌లో ఉండడం కలిసిరానుంది. గాయంతో గత రెండు మ్యాచ్‌లకు దూరమైన హార్దిక్ పాండ్యా కోలుకున్నాడు. ఇక వాంఖడే మైదానం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రెండోసారి బ్యాటింగ్‌కు దిగే జట్టుపై స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించొచ్చు. ఈ టోర్నీలో ఆశించినస్థాయిలో రాణించలేకపోతున్న మహ్మద్ సిరాజ్ స్థానంలో జట్టులోకి వచ్చిన షమీ.. ఆడిన రెండు మ్యాచుల్లోనూ ఏకంగా 9వికెట్లు తీశాడు.

టీమిండియాదే ఆధిపత్యం...

ఇరుజట్ల జరిగిన వన్డేల్లో మనదే ఆధిపత్యం. భారత్-శ్రీలంక జట్ల మధ్య మొత్తం 167వన్డేలు జరగ్గా.. 98మ్యాచుల్లో టీమిండియా, 57వన్డేల్లో శ్రీలంక గెలిచాయి. మరో 11 మ్యాచుల్లో ఫలితం తేలలేదు. ఒకటి టైగా ముగిసింది. ఇటీవల ఇరుజట్ల మధ్య జరిగిన ఐదు మ్యాచుల్లోనూ భారత్ విజయం సాధించడం విశేషం. ఇందులో ఆసియా కప్ ఫైనల్లో భారతజట్టు కేవలం 50 పరుగులకే శ్రీలంకను ఆలౌట్ చేసింది. ఆ మ్యాచ్‌లో హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఏకంగా ఆరు వికెట్లు తీసి దెబ్బకొట్టాడు. శ్రీలంకపై సిరాజ్‌కు అద్భుత బౌలింగ్ రికార్డు ఉన్న నేపథ్యంలో టీమిండియా తుదిజట్టులో అతడికి చోటు దక్కినా ఆశ్చర్యపోన్నక్లేదు. ఇక వన్డే ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో ఇరుజట్లూ 9 మ్యాచుల్లో తలపడ్డాయి. చెరో నాలుగింటిలో విజయం సాధించగా.. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. మరోవైపు శ్రీలంక జట్టు గత మ్యాచ్‌లో పసికూన ఆఫ్ఘనిస్తాన్ చేతిలో ఓటమితో నైరాశ్యంలో ఉంది. ఈ టోర్నమెంట్‌లో ఆడిన 6మ్యాచుల్లో శ్రీలంక జట్టు కేవలం 2 మ్యాచుల్లో మాత్రమే గెలిచింది. పాథుమ్ నిస్సంక, కుశాల్ మెండిస్, సదీరా సమరవిక్రమ మంచి ఫామ్‌లో ఉన్న బ్యాటర్లు. మధుశంక, వెల్లలాగే, కసున్ రజిత, తీక్షణ భారత పిచ్‌లపై ఆడిన అనుభవముంది.

సచిన్ విగ్రహం ఆవిష్కరణ

వాంఖడే స్టేడియంలో భారత్-శ్రీలంక జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభానికి ముందు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సచిన్ టెండూల్కర్ స్టాండ్ సమీపంలో ఈ విగ్రహాన్ని నవంబర్ 2న వన్డే ప్రపంచ కప్ మ్యాచ్ సందర్భంగా ప్రారంభించనున్నట్లు ఎంసిఏ అధ్యక్షుడు అమోల్ కాలే తెలిపారు. ఈ కార్యక్రమంలో సచిన్‌తోపాటు పలువురు ప్రముఖులు, భారత జట్టు సభ్యులు కూడా ఈ వేడుకకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్‌లో 50ఏళ్లు నిండిన లెజెండ్‌కు నివాళిగా టెండూల్కర్ జీవిత-పరిమాణ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అసోసియేషన్ నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టెండూల్కర్.. వాంఖడే మైదానంలో ఒక స్టాండ్‌కి అతని పేరును కలిగి ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ 100సెంచరీలను నమోదు చేయడంతోపాటు వన్డేల్లో తొలి డబుల్ సెంచరీ(2010) కొట్టిన తొలి ఆటగాడు కూడాను.

సెమీస్‌కు దక్షిణాఫ్రికా

న్యూజిలాండ్‌పై 190పరుగుల తేడాతో గెలుపు
● డికాక్, డుస్సెన్ సెంచరీలు ● మహరాజ్‌కు నాలుగు వికెట్లు



పుణె: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జట్టు మరో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఏకంగా 190పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 357పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 35.3ఓవర్లలో 167పరుగులకు కుప్పకూలింది. ఈ గెలుపుతో దక్షిణాఫ్రికా జట్టు 7మ్యాచుల్లో 12పాయింట్లతో సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

తొలుత దక్షిణాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్(114; 116 బంతుల్లో 10ఫోర్లు, 3సిక్సర్లు) ఈ ప్రపంచకప్‌లో నాల్గో శతకానికి తోడు, వాండర్ డుస్సెన్(133; 118బంతుల్లో 9ఫోర్లు, 5సిక్సర్లు) రెండో శతకాన్ని కొట్టాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (53; 30బంతుల్లో 2ఫోర్లు, 4సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడి అర్ధ శతకం సాధించాడు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 357పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఓపెనర్ తెంబా బావుమా(24) త్వరగా పెవీలియన్‌కు చేరగా.. 2 వికెట్‌కు డుస్సెన్-డికాక్ 200పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇన్నింగ్స్ ఆరంభంలో డికాక్ నెమ్మదిగా ఆడాడు. డికాక్-డుస్సెన్ తొలుత నిలకడగా ఆడినా.. ఆ తర్వాత బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగెత్తించారు. ఈ క్రమంలో డికాక్ 103బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ జోడీని సౌథీ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో డికాక్.. ఫిలిప్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. కొద్దిసేపటికే నీషమ్ బౌలింగ్‌లో ఫోర్ బాది డుస్సెన్ 101 బంతుల్లో శతకాన్ని కొట్టాడు. వ్యక్తిగత స్కోర్ 133పరుగుల వద్ద డుస్సెన్‌ను సౌథీ క్లీన్‌బౌల్డ్ చేశాడు. అప్పటికే క్రీజులో కుదురుకున్న మిల్లర్ దూకుడుగా ఆడాడు. నీషమ్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో సిక్స్ బాది అర్ధ శతకం పూర్తి చేసుకున్న మిల్లర్.. తర్వాతి బంతికే డారిల్ మిచెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌథీకి రెండు, ట్రెంట్ బౌల్ట్, నీషమ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ ఓపెనర్ కాన్వే(2) త్వరగా ఔటైనా.. యంగ్(33), మిచెల్(24) ఫర్వాలేదనిపించారు. మిడిలార్డర్‌లో ఫిలిప్(60) అర్ధసెంచరీ మినహా మరో బ్యాటర్ రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. దీంతో న్యూజిలాండ్ జట్టు ఈ టోర్నమెంట్‌లో తొలిసారి స్వల్ప స్కోర్‌కే ఆలౌటైంది. మహరాజ్‌కు నాలుగు, జెన్సన్‌కు మూడు, కొర్జేకు రెండు, రబడాకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డుస్సెన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: క్వింటన్ డికాక్ (సి)ఫిలిప్స్ (బి)సౌథీ 114, బవుమా (సి)మిచెల్ (బి)బౌల్ట్ 24, డుస్సెన్ (బి)సౌథీ 133, మిల్లర్ (సి)మిచెల్ (బి)నీషమ్ 53, క్లాసెన్ (నాటౌట్) 15, మార్‌క్రమ్ (నాటౌట్) 6, అదనం 12. (50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 357పరుగులు.

వికెట్ల పతనం: 1/38, 2/238, 3/316, 4/351

వికెట్ల పతనం: బౌల్ట్ 10-1-49-1, హెన్రీ 5.3-0-31-0, సోథీ 10-0-77-2, సాంట్నర్ 10-0-58-0, ఫిలిప్స్ 7-0-52-0, రవీంద్ర 2-0-17-0, నీషమ్ 5.3-0-69-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి)మార్క్‌క్రమ్ (బి)జెన్సన్ 2, యంగ్ (సి)డికాక్ (బి)కొర్జె 33, రవీంద్ర (సి)కొర్జే (బి)జెన్సన్ 9, మిచెల్ (సి)మిల్లర్ (బి)మహరాజ్ 24, లాథమ్ (సి)మహరాజ్ (బి)రబడా 4, ఫిలిప్స్ (సి)రబడా (బి)కొర్జే 60, సాంట్నర్ (బి)మహరాజ్ 7, టిమ్ సోథీ (ఎల్‌బి)జెన్సన్ 7, నీషమ్ (బి)మహరాజ్ 0, బౌల్ట్ (సి)మిల్లర్ (బి)మహరాజ్ 9, హెన్రీ (నాటౌట్) 0, అదనం 12. (35.3ఓవర్లలో ఆలౌట్) 167పరుగులు.

వికెట్ల పతనం: 1/8, 2/45, 3/56, 4/67, 5/90, 6/100, 7/109, 8/110, 9/133, 10/167

బౌలింగ్: జెన్సన్ 8-1-31-3, ఎన్గిడి 6-1-28-0, రబడా 6-2-16-1, కొర్జే 6.3-0-41-2, మహరాజ్ 9-0-46-4.

పోల్‌వాల్ట్‌లో దేవ్ మీనాకు స్వర్ణం
జాతీయ క్రీడలు

న్యూఢిల్లీ: జాతీయ క్రీడల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన 18ఏళ్ల దేశ్‌కుమార్ మీనా పోల్‌వాల్ట్‌లో సంచలనం సృష్టించాడు. బుధవారం జరిగిన పోల్‌వాల్ట్ పోటీల్లో దేవ్ కుమార్ 5.16మీ. ఎగిరి స్వర్ణ పతకం సాధించాడు. అలాగే వచ్చే ఏడాది జరిగే ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్స్ పోటీలకు అర్హత సాధించాడు. 18ఏళ్ల దేవ్ కుమార్ వ్యవసాయ రైతు బిడ్డ. వ్యక్తిగత బెస్ట్ 5.20మీ. కాగా.. ఆ రికార్డును సమం చేయలేకపోయాడు.



నవచిత్రం

మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్‌కి ప్రతిబింబం



హీరో శివాజీ, వాసుకి ఆనంద్ సాయి ప్రధాన పాత్రలలో ఆదిత్య హాసన్ దర్శకత్వంలో రూపొందిన వెబ్ సిరీస్ 'ఎట్ ది రేట్ నైన్టీస్'. 'ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' అనేది ట్యాగ్ లైన్. ప్రతి మధ్యతరగతి కుటుంబాన్ని ప్రతిబింబించే ఈ వెబ్ సిరీస్‌ని ఎంఎస్‌ఓపీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజశేఖర్ మేడారం నిర్మిస్తున్నారు. నవీన్ మేడారం సమర్పిస్తున్నారు.

వెంకటేష్ ఈ వెబ్‌సిరీస్ టీజర్‌ని బుధవారం లాంచ్ చేశారు. 90ల్లోని జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ టీవీలో 'మనోరంజని' కార్యక్రమాన్ని చూపిస్తూ టీజర్ ప్రారంభమైంది. దాదాపు రెండు నిమిషాల నిడివి గల టీజర్ ఆద్యంతం నవ్వులు పూయించింది. శివాజీ ఓ మిడిల్ క్లాస్ ఫాదర్, స్కూల్ టీచర్. అతని భార్య పాత్రలో వాసుకి నటించారు. వీరి ముగ్గురు పిల్లలు. ఈ కుటుంబం చుట్టూ అల్లుకున్న సన్నివేశాలు అలనాటి అందమైన జ్ఞాపకాలతో పాటు మధ్యతరగతి కుటుంబాల ఆనందాలు, సరదాలు, సంఘర్షణలను ఎంతో అందంగా, మనసుని హత్తుకునేలా చూపించాయి.

ఈ సంక్రాంతికి ఈటీవీ విన్ యాప్ ద్వారా ప్రేక్షకుల ముందుకు ఈ వెబ్ సిరీస్ రానుంది అని మేకర్స్ తెలిపారు.



సూర్యదేవర నాగవంశీ, శ్రీకాంత్ ఎన్ రెడ్డి

24న ఆదికేశవ రిలీజ్

పంజా వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆదికేశవ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. శ్రీకాంత్ ఎన్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విడుదల విశేషాలను షేర్ చేసుకోవడానికి మంగళవారం దర్శకుడు శ్రీకాంత్ ఎన్‌రెడ్డితో కలిసి నిర్మాత ఎస్.నాగవంశీ ప్రెస్‌మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, 'ప్రస్తుతం క్రికెట్ వరల్డ్ కప్ జరుగుతోంది. ఈ వరల్డ్ కప్‌లో భారత్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. భారత్ విజేతగా నిలుస్తుందనే అంచనాలున్నాయి. ఈ వరల్డ్ కప్ ప్రభావం సినిమాలపై పడుతుంది. ముఖ్యంగా భారత్ మ్యాచ్‌లు ఉన్న సమయంలో థియేటర్ల దగ్గర సందడి వాతావరణం కనిపించడంలేదు. అందుకే చిత్ర బృందం, డిస్ట్రిబ్యూటర్స్ అందరితో చర్చించి ఈనెల10వ తేదీన విడుదల కావాల్సిన 'ఆదికేశవ'ను ఈనెల 24వ తేదీన విడుదల చేస్తున్నాం. సినిమా మీద చాలా నమ్మకంగా ఉన్నాం. ఈ సినిమా ఖచ్చితంగా అందరినీ అలరిస్తుంది' అని తెలిపారు. శ్రీకాంత్ ఎన్ రెడ్డి కూడా ఈ చిత్రంపై ఎంతో నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ముంబయిలో నయా షెడ్యూల్ షురూ..

హీరో రామ్ పోతినేని డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌తో చేస్తున్న పాన్ ఇండియా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ సినిమా షూటింగ్‌ను తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం ముంబైలో చిత్రీకరణ ఏకధాటిగా జరుగుతోంది. తన మునుపటి చిత్రం 'స్కంద' కోసం బరువు పెరిగిన రామ్ ఈ సినిమా కోసం కొన్ని కిలోల బరువు తగ్గి సిక్స్-ప్యాక్ అబ్స్ సాధించారు. ఈ సందర్భంగా రామ్ పంచుకున్న ఫోటోలు తన కండలు తిరిగిన ఫిజిక్‌ని ప్రజెంట్ చేస్తున్నాయి. రామ్ తన ముఖాన్ని దాచుకున్నప్పటికీ, వెస్ట్‌లో మాచోగా కనిపిస్తున్నారు. రామ్‌ని ఈ తరహాలో మేకోవర్ చేసిన క్రెడిట్ పూరి జగన్నాథ్‌కి కూడా దక్కుతుంది. రామ్, పూరి కాంబినేషన్‌లో బ్లాక్‌బస్టర్ అయిన 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్'ను పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు. మాస్, యాక్షన్ సినిమాలని ఇష్టపడేవారికి ఈ సినిమా సరికొత్త అనుభూతినిస్తుంది. వచ్చే ఏడాది మహాశివ రాత్రి కానుకగా మార్చి 8న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



సిక్స్ ప్యాక్‌తో రామ్



పూరీ జగన్నాథ్, రామ్

ఆద్యంతం ఆసక్తికరం...

'మాఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. డా.అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల ముఖ్యపాత్రల్లో నటించిన ఈ చిత్రానికి గౌరికృష్ణ నిర్మాత. ఈనెల 3న పంపిణీదారుడు వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రీరిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకకు హీరో అడవి శేష్‌తో పాటు నిర్మాత ఎస్‌కేఎన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



ఈ వేదికపై చిత్ర బిగ్ టికెట్‌ను అతిథులు అడవి శేష్, ఎస్‌కేఎన్ ఆవిష్కరించారు. అడవి శేషు మాట్లాడుతూ, 'నా ఫస్ట్ సక్సెస్ 'క్షణం'కు వర్క్ చేసిన టీమ్ అంతా ఈ టీమ్‌లో ఉన్నారు. ముఖ్యంగా దర్శకుడు అనిల్ నాకు మంచి స్నేహితుడు. అతను ఓ బ్లాక్‌బస్టర్ సినిమా తీసి, దానికి సీక్వెల్ తీయడం ఆనందంగా ఉంది. ఇది నా సొంత సినిమా లాంటిది. తప్పకుండా ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

దర్శకుడు అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ, 'చిన్నసినిమాగా మొదలైన ఈ సినిమా ఈ రోజు పెద్ద సినిమాగా మారిందంటే అందుకు కారణం వంశీ నందిపాటి. అలాగే నాకు బడ్జెట్ పరంగా సహకరించిన నిర్మాతకు థ్యాంక్స్' అని తెలిపారు.

సత్యం రాజేష్ మాట్లాడుతూ,'ఈ రోజు ఇంత గొప్పగా 100 కోట్ల సినిమాలా కాన్ఫిడెంట్‌గా విడుదల చేస్తున్నామంటే వంశీ నందిపాటి కారణం. ఈ సినిమాకు టెక్నీషియన్సే హీరోలు. ఈ చిన్న సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత గౌరికృష్ణ మాట్లాడుతూ,'దర్శకుడు ఈ కథను ఎంతో అద్భుతంగా తీశాడు. తప్పకుండా చిత్రం ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

ఘనంగా తంగలాన్ టీజర్ లాంచ్

విక్రమ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'తంగలాన్'. దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో పార్వతీ, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్ధ ఘటనల ఆధారంగా పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. పా రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు.



ఈ సినిమాను జనవరి 26న రిలీజ్ చేయనున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

బుధవారం హైదరాబాద్ ఏఎంబీ మల్టీప్లెక్స్‌లో ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, దర్శక,నిర్మాత పా.రంజిత్, నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా, నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి, హీరో సత్యదేవ్, డైరెక్టర్స్ బాబి, సురేందర్ రెడ్డి, కరుణ కుమార్, వేణు ఊడుగుల పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ, 'నాకు సినిమాల మీదున్న ప్రేమ, మీకు సినిమాల మీదున్న ప్రేమ ఒక్కటే. మీరు సినిమా బాగుంటే ఏ భాషా చిత్రాన్నైనా చూస్తారు. తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమలు కలిసి పనిచేస్తే ప్రపంచంలో బెస్ట్ మూవీస్ మనమే చేయగలం. ఈ మూవీతో ఫస్ట్ టైమ్ విక్రమ్ మా స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో నటించడం హ్యాపీగా ఉంది. ఆయన లాంటి గొప్ప నటుడితో సినిమా నిర్మించినందుకు గర్వపడుతున్నా. డైరెక్టర్ పా.రంజిత్ తన టీమ్‌తో గొప్ప చిత్రాన్ని రూపొందించారు. జనవరి 26న మన సినిమా లవర్స్ అంతా ఈ సినిమాను థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకుంటాం' అని అన్నారు.

సినిమా మీద తెలుగు ఆడియెన్స్ చూపించే ప్రేమ స్వచ్ఛమైనది. ఈ టీజర్‌లో మేము చూపించిన కంటెంట్ మీకు నచ్చిందని అనుకుంటున్నా. సినిమా కూడా మీకు నచ్చేలా ఉంటుంది. ఒకప్పుడు భారతీయ సినిమా అంటే బాలీవుడ్ సినిమా అనుకునే వారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. దక్షిణాది సినిమాల గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. విక్రమ్‌తో వర్క్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఈ సినిమాతో ఆ అవకాశం దక్కింది. ఆయనతో ఈ సినిమా చేసినందుకు గర్వపడుతున్నా' అని దర్శక, నిర్మాత పా.రంజిత్ చెప్పారు.

హీరో విక్రమ్ మాట్లాడుతూ, 'ఫస్ట్ టైమ్ యంగ్ టీమ్‌తో సినిమా చేశాను. ఇదొక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. 'తంగలాన్'లాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తాయి. ఇలాంటి అరుదైన సినిమాలో నటించే అవకాశం రావడం చాలా గౌరవంగా భావిస్తున్నా. మా టీజర్ మీకు నచ్చిందని భావిస్తున్నా. నన్ను నమ్మి ఈ సినిమా చేసిన మేకర్స్‌కి థ్యాంక్స్' అని అన్నారు.

నరకాసుర సూపర్ హిట్ ఖాయం

'పలాస' ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన సినిమా 'నరకాసుర'. అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ కథానాయికలు. సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ బ్యానర్స్‌లో డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకుడు. ఈ నెల 3న తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో రక్షిత్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ మూవీ ఏపీ, తమిళనాడు సరిహద్దుల్లోని ఓ కాఫీ ఎస్టేట్ నేపథ్యంలో సాగుతుంది. నేను లారీ డ్రైవర్ శివగా నటించాను. 'పలాస'లో దళితులకు సంబంధించిన సమస్యలు చూపించినట్లే, ఈ సినిమాలో హిజ్రాల తాలూకా పాయింట్ ఒకటి తీసుకున్నాం. కథపరంగా ఛత్తీస్ ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో షూటింగ్ చేశాం. 'పుష్ప' మూవీకి ఈ మూవీకి ఎలాంటి పోలిక ఉండదు. ఇది సూపర్ హిట్ అనే నమ్మకంతో ఉన్నాం. మంచి మాస్ హీరోగా పేరు తెచ్చుకోవాలని ఉంది. 'శివదనే, ఆపరేషన్ రావణ్' రిలీజ్‌కి రెడీ అవుతున్నాయి. మరో 2 ప్రాజెక్ట్స్ కన్ఫర్మ్ అయ్యాయి' అని తెలిపారు.



రక్షిత్ అట్లూరి



మనం సరిపడా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తినకపోతే.. ఆరోగ్యంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేంటో తెలుసుకుంటే తినాల్సిన వాటిని సరిపడా తినవచ్చు. ఈ రోజుల్లో డాక్టర్ల దగ్గరకు వెళ్తున్న పేషెంట్లలో డాక్టర్లు కనిపెడుతున్నదేంటంటే... చాలా మంది కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల వంటివి సరిపడా తినట్లేదు. అలా తినకపోవడం వల్ల ఎటువంటి సమస్యలు ఎదురవుతుంటాయో తెలుసుకుందాం...

పోషకాలు చాలకపోతే?

○ సరిపడా కూరగాయలు తినకపోతే దంతాల చిగుళ్ల నుంచి రక్తం కారడం మొదలవుతుంది. అందుకు శరీరంలో సరిపడా సి విటమిన్ లేకపోవడం వల్లే. కూరగాయలు, పుల్లటి పండ్లు తింటే... సి విటమిన్ లభిస్తుంది.

○ పచ్చటి ఆకుకూరలు, కూరగాయలు సరిపడా తినకపోతే అలసట పెరుగుతుంది. నీరసంగా అవుతారు. ఏ పనీ చెయ్యబుద్ధి కాదు. ఎందుకంటే వాటిలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంది. అది మీకు అలసట, నీరసం వంటివి రాకుండా చేస్తుంది.

○ శరీరంలో పొటాషియం లోపిస్తుంది. అందువల్ల కండరాల్లో నొప్పి, వాపు, మంట వంటి ఫీలింగ్స్ కలుగుతాయి. అలా అయితే ఆలస్యం చెయ్యకుండా వెంటనే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తినడం ప్రారంభించండి.

○ తిన్న ఆహారం జీర్ణం కావాలంటే... శరీరానికి ఫైబర్ కావాలి. పెద్దవాళ్లకు రోజుకు 25 గ్రాముల ఫైబర్ అవసరమని డాక్టర్లు చెబుతున్నారు. అది కావాలంటే కూరగాయలు, పండ్లు తినాలి. లేదంటే మలబద్ధకం సమస్య తలెత్తుతుంది.

○ సరిపడా కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల వంటివి తినకపోతే మెదడు కూడా సరిగా పనిచెయ్యదు. క్రమంగా అది మొద్దుబారిపోతుంది. చివరకు మతిమరపు లాంటి భయంకరమైన సమస్యలకు దారితీస్తుంది.

ముఖాన్ని అందంగా ఉంచుకోవడానికి అందరూ చాలా రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. దానితో పాటు కాళ్లని కూడా అందంగా ఉంచుకోవాలి. అప్పుడప్పుడు నెయిల్ ఫాలిష్ వేయడమే కాదు, అవి అందంగా కనిపించడానికి, మురికి లేకుండా ఉంచుకోవాలి. అందుకోసం పెడిక్యూర్ తప్పనిసరి.. పార్లర్‌కు వెళ్ళి డబ్బు ఖర్చు పెట్టడం కంటే ఇంట్లోని చిన్న చిన్న చిట్కాలతో వాటిని అందంగా మలుచుకోవచ్చు. అవేంటంటే...

పాదాలు పదిలం



○ ఇంటి వద్ద పెడిక్యూర్ చేసుకోవాలంటే మొదట మీ కాళ్లకు ఉండే నెయిల్ పాలిష్ తీసేయండి. ఆ తర్వాత బకెట్‌లో పావు వంతు వేడి నీళ్లు తీసుకోండి. అందులో కొంచెం ఉప్పు వేయండి. అలాగే 10 చుక్కల నిమ్మ రసం లేదా ఆరెంజ్ జ్యూస్ వేయండి. మీరు కావాలనుకుంటే నిమ్మ లేదా ఆరెంజ్ ఎసెన్స్ వేసుకోవచ్చు. ఆ తర్వాత మీ పాదాలను ఆ బకెట్‌లో ఉంచండి.


○ మీ పాదాలను ఓ పావుగంట పాటు ఆ బకెట్‌లోనే ఉంచండి. ఆ తర్వాత బ్రష్‌తో పాదాలను రుద్దండి. బలంగా కాకుండా మెల్లగా రుద్దాలి. దీని కోసం కొన్ని రాళ్లు కూడా దొరుకుతాయి. ఆ రాళ్లను ఉపయోగిస్తే మంచి ప్రయోజనం ఉంటుంది.

○ కాళ్లు రుద్ది కడిగిన తర్వాత శుభ్రమైన టవల్‌తో తుడవండి. మళ్లీ ఓ సారి శుభ్రమైన నీటితో పాదాలు శుభ్రం చేసుకోండి. కాళ్ల మీద ఉండే మట్టిని తొలగించడం ద్వారా క్రిములను కూడా పారదోలవచ్చు. గోళ్లు కట్ చేయాలంటే నెయిల్ కట్టర్ వాడాలి. బ్లేడ్ లాంటివి వాడొద్దు.

○ గోళ్లు కట్ చేసే ముందు వాటిని శుభ్రం చేయాలి. గోళ్లు బాగా దగ్గరగా కట్ చేయవద్దు. గోళ్లలో మట్టి ఉంటే దాన్ని కాటన్‌తో తొలగించాలి. పాదాలు, గోళ్ల మీద క్రీమ్‌తో మసాజ్ చేయాలి. అది చర్మం లోపలికి ఇంకేంత వరకు మసాజ్ చేస్తూనే ఉండాలి.

○ కాలి మడమను చాలా జాగ్రత్తగా శుభ్రం చేయాలి. అవసరమైతే మరికొంత క్రీమ్ అప్లై చేయాలి. మసాజ్ చేసేటప్పుడు ఎప్పుడూ కూడా కింద నుంచి పైకి మసాజ్ చేయాలి. మడమకు కూడా మసాజ్ చేయాలి. ఆ తర్వాత శుభ్రమైన టవల్‌తో కాళ్లు తుడుచుకోవాలి. అంతా పూర్తయిన తర్వాత మళ్లీ నెయిల్ పాలిష్ వేసుకోవచ్చు.

రాగులు మనకు ఎంతో మేలు చేస్తాయి. ఇనుము, కాల్షియం, పీచు అధికంగా వుండే రాగులతో చేసుకునే వంటకాల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. సాధారణంగా రాగులతో రాగి జావా, రాగి ఇడ్లీ లాంటివి చేసుకుంటూనే వుంటాం. వాటితో పాటు మరికొన్ని వెరైటీలు కూడా చేసుకుంటే తినేందుకు ఆసక్తి కూడా పెరుగుతుంది. వీటిని పెద్దలతో పాటు పిల్లలకు కూడా పెట్టవచ్చు. వారూ తినేందుకు ఆసక్తి కనబరుస్తారు. మరి అవేంటో ఓ సారి చూద్దామా...!



రాగులతో రుచిగా...

దోశ...

కావాల్సిన పదార్థాలు : రాగి పిండి - కప్పు, మినపప్పు - పావకప్పు కన్నా తక్కువగా, పెసరపప్పు, కందికప్పు - రెండు చెంచాల చొప్పున, జీలకర్ర - చెంచా, మిరియాలు - చెంచా, పుల్ల పెరుగు - పావుకప్పు, ఉప్పు - తగినంత, నూనె - పావు కప్పు.



తయారు చేసే విధానం : మినపప్పు, పెసరపప్పు, కందిపప్పు కలిపి కొన్ని గంటల ముందు నానబెట్టుకుని తర్వాత మెత్తగా రుబ్బుకోవాలి. ఇందులో రాగి పిండితో పాటూ నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసి కలుపుకోవాలి. తర్వాత అవసరాన్ని బట్టి నీళ్ల పోసుకుంటూ దోశపిండిలా చేసుకోవాలి. ఈ పిండిని వేడి పెనం మీద వేసి, దోశలా కాల్చుకుంటే కరకరలాడే రాగి దోశ సిద్ధం.

రాగి, కొబ్బరితో...

కావాల్సిన పదార్థాలు : రాగిపిండి - కప్పు, బెల్లం తరుగు, వేయించిన పల్లీలు, కొబ్బరి తురుము - పావు కప్పు చొప్పున, ఉప్పు - చిటికెడు, నెయ్యి - పావుకప్పు.

తయారు చేసే విధానం : ముందుగా ఓ గిన్నెలో రాగిపిండి, ఉప్పు తీసుకుని నీళ్ల చల్లుకుంటూ తడిపొడిగా కలపాలి. తర్వాత కొబ్బరి తురుము వేసి కలపాలి. ఈ పిండిని ఆవిరి మీద పది, పదిహేను నిమిషాలు ఉడికించుకుని ఓ పళ్లెంలోకి తీసుకుని చల్లారనివ్వాలి. చల్లారిన తర్వాత అందులో చిన్న పలుకులుగా చేసుకున్న పల్లీలు, బెల్లం తరుగు వేసి బాగా కలపాలి. చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని ఉండల్లా చుట్టుకుంటే సరిపోతుంది.



బూరెలు...

కావాల్సిన పదార్థాలు : రాగులు, బెల్లం తురుము - కప్పు చొప్పున, పచ్చి కొబ్బరి తురుము - పావు కప్పు, యాలకుల పొడి - చెంచా, మినపప్పు, కప్పు, బియ్యం - రెండు కప్పులు, నూనె - వేయించడానికి సరిపడా, నెయ్యి - రెండు చెంచాలు.




తయారు చేసే విధానం : బియ్యం, మినపప్పును కలిపి, రాగుల్ని విడిగా నాలుగ్గంటల ముందు నానబెట్టుకోవాలి. బియ్యం, మినపప్పును కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. నానబెట్టిన రాగుల్ని కడిగి, నీటిని వంపేసి తడిపోయేదాకా ఎండలో ఉంచి ఆ తర్వాత పొడి చేసుకోవాలి. బాణలిలో నెయ్యి కరిగించి రాగిపిండిని దోరగా వేయించుకోవాలి. ఆ తర్వాత యాలకుల పొడి, పచ్చికొబ్బరి తురుము కలపాలి. ఓ గిన్నెలో కొద్దిగా నీరు తీసుకుని మరో పొయ్యి మీద మరిగించి బెల్లం తురుము కలపాలి. అది కరిగాక వడకట్టి రాగిపిండికి చేర్చి ఉండల్లా చేసుకోవాలి. వీటిని మినపప్పు మిశ్రమంలో ముంచి కాగుతున్న నూనెలో వేయాలి. బంగారు రంగులోకి వచ్చాక తీసేస్తే పోషకాల బూరెలు సిద్ధమైనట్టే.

హల్వా....

కావాల్సిన పదార్థాలు : రాగులు - ఒక కప్పు, బెల్లం - అర కప్పు, కొబ్బరి తురుము - మూడు చెంచాలు, యాలకుల పొడి - చెంచా, నెయ్యి - చెంచా, ఉప్పు - చిటికెడు.

తయారు చేసే విధానం : రాగుల్ని రెండు మూడు గంటల పాటు నీళ్లలో నానపెట్టాలి. పైన చెప్పిన పదార్థాలన్నింటినీ మిక్సీలో వేసి కొద్దిగా నీళ్ల పోసి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని పలుచటి బట్టలో వేసి పిండితే పాలు వస్తాయి. ఈ పాలను మందమైన వెడల్పాటి గిన్నెలో పోసి స్టవ్ మీద పెట్టి మిశ్రమం కాస్త గట్టి పడేవరకు గరిటెతో తిప్పాలి. తరువాత నెయ్యి, యాలకుల పొడి వేసి కలపాలి. హల్వా రూపాన్ని సంతరించుకున్న తరువాత దించి నెయ్యి లేదా నూనె రాసిన పళ్లెంలో ఈ మిశ్రమాన్ని పోయాలి. ఆ తరువాత మీకు నచ్చిన ఆకారంలో కోసుకోవాలి.



మళ్లీ నిఘా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలు, వేర్వేరు సమయాల్లో వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని చేసిన ప్రయత్నాలను యాపిల్ గుర్తించింది. అయితే ఏ సందర్భంలోనూ దాడి చేసిన వ్యక్తిని నియోగించింది ఏ ప్రభుత్వమో వెల్లడించలేదు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే యాపిల్ నుండి ఎల్ సాల్వెడార్ దేశానికి చెందిన 12 మంది పాత్రికేయులకు అప్పట్లో అలర్ట్‌లు వచ్చాయి. అప్పుడు ఏం తేలింది? వారిని లక్ష్యంగా చేసుకుంది అక్కడి ప్రభుత్వమేనని కదా..?

ఆ అవసరం ఎవరికి?

మరి మన దేశంలోని ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని వారి ఫోన్లను హ్యాక్ చేయాల్సిన అవసరం ఎవరికి ఉంటుంది? దీనికి సమాధానం చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతాడు. మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా దర్యాప్తు సంస్థలను ప్రయోగించడాన్ని చూస్తూనే ఉన్నాం. ఫలితంగా కొందరు నెలల తరబడి కారాగారాల్లో మగ్గుతున్నారు. ఇక కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, ప్రతిపక్ష నేతల ఫోన్లలో పెగాసస్ స్పైవేర్‌ను అమర్చిన విషయం తెలిసిందే. మరి యాపిల్ సంస్థ తాను పంపిన నోటిఫికేషన్లలో కొన్ని తప్పుడువై ఉండవచ్చునని ఎందుకు చెబుతోంది? మోడీ ప్రభుత్వానికి వంత పాడే కొన్ని మీడియా సంస్థలు అత్యుత్సాహాన్ని ప్రదర్శించాయి. అసలు యాపిల్ ఏం చెప్పాలని అనుకుంటుందో దానిని అర్థం చేసుకోకుండా వార్తలు వండి వార్చాయి. యాపిల్ చేసిన ప్రకటన ఆ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో చాలా కాలంగా ఉంటోంది. కానీ యాపిల్ ఇచ్చిన వివరణలో కొంత భాగాన్ని మాత్రమే మీడియా ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసింది.

యాపిల్ ఏం చెప్పింది?

వాస్తవానికి యాపిల్ వెబ్‌సైట్‌లో ఇలా ఉంది...'ప్రభుత్వ ప్రేరేపిత దాడులు చేసే వారికి పుష్కలంగా నిధులు అందుతాయి. ఆ దాడులు అత్యాధునికంగా ఉంటాయి. అలాంటి దాడులను గుర్తించాలంటే థ్రెడ్ ఇంటెలిజెన్స్ సిగ్నల్‌పై ఆధారపడాలి.అయితే అవి తరచుగా అసమగ్రంగా ఉంటాయి. సరిగా ఉండవు. యాపిల్ ఇచ్చే కొన్ని అలర్ట్ నోటిఫికేషన్లు తప్పుడువై ఉండవచ్చు. లేదా కొందరు హ్యాకర్లను గుర్తించకపోవచ్చు'. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే ప్రభుత్వ ప్రేరేపిత దాడుల కారణంగా జరిగే ప్రమాదాలను యాపిల్ సంస్థ పునరుద్ఘాటించింది.

యాపిల్ ఒక్కటే కాదు

స్పైవేర్ దుర్వినియోగంలో ప్రభుత్వ పాత్రను బయటపెట్టిన టెక్నాలజీ సంస్థల్లో యాపిల్ మొదటిదేమీ కాదు. 2021లో ఇజ్రాయిల్ స్పైవేర్ పెగాసస్ వ్యవహారాన్ని ది వైర్ సంస్థ మరో 16 మీడియా సంస్థలతో కలిసి రట్టు చేసింది. గతంలో యాహూ, గూగుల్ సంస్థలు కూడా ఇప్పుడు యాపిల్ పంపిన విధంగానే అలర్ట్ నోటిఫికేషన్లు పంపాయి.

గ్యాస్ బాదుడు

న్యూఢిల్లీ : వాణిజ్య అవసరాల కోసం ఎల్పీజీ గ్యాస్‌ను వినియోగించే వారికి చేదు వార్త. చమురు కంపెనీలు వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధరల్ని పెంచేశాయి. హోటళ్లు, రెస్టారెంట్లలో వాడే వాణిజ్య సిలిండర్ ధర తాజాగా రూ.101.50 పెరిగింది. గత రెండు నెలల్లో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర పెరగడం ఇది రెండోసారి. కొత్త ధరలు తక్షణమే అమలులోకి వచ్చాయి. రాజధాని న్యూఢిల్లీలో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1731 నుండి రూ.1,833కు పెరిగింది. దేశంలోని నాలుగు మెట్రో నగరాలకు సంబంధించి చెన్నయ్‌లో దీని ధర అత్యధికంగా రూ.1,999.50 ఉండగా ముంబయిలో అతి తక్కువగా రూ.1,785.50కు విక్రయిస్తున్నారు. కొల్‌కతాలో ఈ సిలిండర్ ధర రూ.1,943గా, బెంగళూరులో రూ. 1914.50గా ఉంది. గత నెలలో చమురు కంపెనీలు వాణిజ్య సిలిండర్ ధరను రూ.209 పెంచాయి. సెప్టెంబర్‌లో రూ.158 తగ్గించాయి. ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయని, వాటికి అనుగుణంగానే వాణిజ్య సిలిండర్ల ధరల్ని పెంచాల్సి వస్తోందని చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ చెబుతున్నాయి.

మోడీ దేశాన్ని ఏం చేస్తాడో..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాఆశీర్వాద సభల్లో కేసీఆర్ ప్రసంగించారు.

దళితబంధు ఎన్నికల కోసం కాదు..

ప్రజాస్వామ్య పరిణతి వస్తేనే అద్భుతాలు, అభివృద్ధి అని కేసీఆర్ అన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు చేస్తేనో దళితబంధు రాలేదన్నారు. ఉత్తర భారతదేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, చివరకు ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోనూ దళితులపై దాడి జరగని రోజు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది ఓట్లు రావాలి, పూట గడవాలని కాదు.. తెలంగాణను బాగు చేయాలనే ఆలోచనతో మ్యానిఫెస్టోలో లేకపోయినా దళితబంధు అనే పదాన్ని వెలుగులోకి తెచ్చామన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా తెచ్చిన ఈ పథకాన్ని రాజకీయాలకు అతీతంగా ఖమ్మం జిల్లాలో ప్రతిపక్ష ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలోని చింతకాని మండలం మొత్తానికి వర్తింపజేశామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా దళితబంధు అమలు చేసేందుకు జీవో జారీ చేసిన కొద్దిరోజులకే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఆరునూరైనా గెలిచేది బీఆర్ఎస్సేనని.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దళితబంధును యథాతథంగా అమలు చేస్తామన్నారు.

మోడీ ప్రయివేటీకరణ..

మోడీ ప్రయివేటీకరణ పేరుతో.. ఎల్ఐసీ, ఓడరేవులు, విమానాశ్రయాలు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వరంగంలో నుంచి కరెంట్‌ను ప్రయివేటీకరించేందుకు తాను అంగీకరించలేదన్నారు. భద్రాద్రి వంటి పవర్‌ప్లాంట్‌ను జెన్కో ఆధ్వర్యంలో నిర్మించామన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టమంటున్నారని, సంవత్సరానికి రూ.25 కోట్ల నష్టాన్ని భరించామే కానీ మోటార్లకు మీటర్లు పెట్టలేదని తెలిపారు.

కాంగ్రెస్‌వి బలుపు రాజకీయాలు..

"ఓ ఇద్దరు కాంగ్రెస్‌లో చేరిండ్రు.. ఒకడు మాట్లాడతడు.. అసెంబ్లీ గేటు తాకనీయడట.." అని అన్నారు. మీరు తలచుకుంటే దుమ్ములేవదా.. అని కేసీఆర్ సభికులను ప్రశ్నించారు. డబ్బు రాజకీయాలు, అహంకార రాజకీయాలు తగవన్నారు. కాంగ్రెస్ ధరణి పోర్టల్ ఎత్తివేస్తామంటోంది.. ధరణి పోతే మళ్లీ రైతుల భూములపై వీఆర్ఏ, వీఆర్వో, ఎమ్మార్వో, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ ఎవడికి కోపం వచ్చినా భూములు మారతాయన్నారు. రాహుల్‌కు ఎద్దు, వ్యవసాయం తెల్వదన్నారు. గుండెకాయలాంటి సీతారామను పూర్తి చేసి సాగర్ నీళ్ల తండ్లాట నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాను బయటపడేస్తామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ వస్తే చీకట్లు వస్తాయన్నారని.. ఇప్పుడు మనకు వెలుగులు, వాళ్లకు చీకట్లు వచ్చాయన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలు ఏపీ, తెలంగాణల్లో రోడ్లు ఎలా ఉన్నాయో చూడాలన్నారు. డబుల్ రోడ్డు వస్తే తెలంగాణ.. సింగిల్ రోడ్డు వస్తే ఏపీదని తెలిపారు. ఏపీ రైతులు తెలంగాణకు వచ్చి ధాన్యం అమ్ముకుంటున్నారన్నారు. వ్యక్తుల మధ్య పోరాటం కాదు.. పార్టీ మధ్య పోరాటం.. కాంగ్రెస్ ఏమి చేసిందో మనసుపెట్టి ఆలోచన చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సభల్లో బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తాతా మధుసూదన్, రఘోత్తమ్‌రెడ్డి, అశ్వారావుపేట బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాములునాయక్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మెన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఉమామహేశ్వరరావు, బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం జిల్లా అధ్యక్షులు చింతనిప్పు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లతో రహస్య వ్యాపారాలు!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. పాలక రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా అజ్ఞాతంగా క్విడ్ ప్రో కో లోకి ప్రవేశించేందుకు గానూ రెగ్యులర్ బ్యాంకింగ్ మార్గం ద్వారా ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసేందుకు వీలుందని రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం పేర్కొంది. ధ్రువీకరించిన ఖాతాలు కలిగిన వ్యక్తులను ప్రభావవంతమైన సంస్థలు రహస్యంగా ఏర్పాటుచేసుకునే అవకాశాలు వున్నాయని తెలిపింది.

"ఉదాహరణకు 'ఎ' అనే వ్యక్తి రూ.100 కోట్లు విలువ చేసే ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశారు. 'బి' కోసం ఏర్పాటు చేయబడిన వ్యక్తే 'ఎ'. ఎందుకంటే 'ఎ' కి నిర్ధారించబడిన కెవైసి అకౌంట్ వుంది. రాజకీయ పార్టీకి విరాళమిచ్చేది 'బి'. కోటి రూపాయలు చొప్పున వంద కోట్ల బాండ్లను కొనుగోలు చేసేందుకు 'బి'కి వందమంది వ్యక్తులు వుండవచ్చు కూడా." అని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ పేర్కొన్నారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి ఆయన నేతత్వం వహిస్తున్నారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ మొదటి రోజు జరిగిన విచారణలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రసంగిస్తూ, 'ఇటువంటి విషయాల్లో భారతీయుడి మనసు చాలా తెలివిగా వుండగలదు, అనేక రకాలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మేం నియంత్రిస్తాం.' అని అన్నారు. కెవైసి ఖాతాదారుల ద్వారా బాండ్లు కొనుగోలు చేయడంతో అసలు విరాళమిచ్చే వ్యక్తి వివరాలు అజ్ఞాతంగా వుంచబడుతున్నాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఆచరణాత్మక రాజకీయాల్లో ఆ విరాళమిచ్చే వ్యక్తి అనేక మార్గాల్లో తన విరాళం గురించి రాజకీయ పార్టీకి తెలియజేయవచ్చన్నారు. ఇక్కడ విరాళమిచ్చే వారు ఎవరో తెలియకుండా వుంటున్నది ప్రజలకే కానీ రాజకీయ పార్టీకి కాదని చంద్రచూడ్ అన్నారు.

ప్రతిపక్షాల దాతలకు ఉపయోగం

పాలక పార్టీ నుంచి వచ్చే పర్యవసానాలకు భయపడకుండా ప్రతిపక్షాలకు విరాళాలు ఇవ్వాలనుకునేవారికి ఈ అజ్ఞాతమనేది ఉపయోగపడుతుందని కోర్టు అభిప్రాయపడింది. 'మీరు దాత పేరు వెల్లడించినట్లైతే, మీరు ఒక రాజకీయ పార్టీకి విరాళమిచ్చారని ఇతర రాజకీయ పార్టీలు కూడా తెలుసుకుంటాయని భావించాల్సి వుంటుంది. ఒకవేళ అధికారంలో లేని పార్టీకి మీరు విరాళమిచ్చారనుకుందాం, ఆ దాతకు ఆ రాష్ట్రంలో వ్యాపారం వుందనుకుందాం, ఆ దాత పేరు అందరికీ తెలిసిపోతుంది. అక్కడ లాజిక్ వుంది. ఈ లాజిక్ చెల్లుబాటు అవుతుందా లేదా అన్నది మనం నిర్ణయించుకోవాల్సి వుంది." అని అన్నారు.

విరాళాల్లో 90శాతం పాలక పార్టీలకే

పిటిషనర్ల తరపున వాదనలు ప్రారంభించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, రాజకీయ పార్టీకి ఇచ్చే విరాళాల గురించి తెలుసుకోవడమనేది ప్రాథమిక హక్కని పేర్కొన్నారు. ఎన్నికల బాండ్లు చట్టబద్ధమైన ముడుపులని ఆయన వ్యాఖ్యానించారు. ఇవి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. విరాళాల్లో 90శాతానికి పైగా పాలక పార్టీలకే వస్తున్నాయన్నారు. ఇప్పటికే జరిగిన లేదా జరగాల్సిన పనుల కోసం ఉద్దేశించబడినవని ఆయన వాదించారు.

అనుకున్నంతా అయింది.. పరువంతా పోయింది

(మొదటిపేజీ తరువాయి)

చేసిన నిందితులెవరైనా, ఏస్థాయిలో ఉన్నా చట్ట ప్రకారం శిక్షించాల్సిందే. అయితే మూడోసారి అధికారంలోకి రావాలనే తపనతో బీఆర్ఎస్ నాయకత్వం తప్పులో కాలేసింది. అభాసుపాలైంది. రాజకీయ ప్రయోజనాలను ఆశించి సభలు, సమావేశాలు, ట్వీట్ల ద్వారా స్టేట్‌మెంట్లు ఇచ్చారు. సోషల్‌మీడియాలోనూ భారీగా పోస్టులు పెట్టారు. రాజకీయ పార్టీలను సైతం తప్పుబట్టారు. చికిత్స సందర్భంగా ఆస్పత్రిలోనూ హడావిడి చేశారు. ఈ ఘటనను ఎన్నికల్లో లబ్ధికోసం ఉపయోగించుకునే ప్రయత్నం బీఆర్ఎస్ నేతల నుంచి గట్టిగానే జరిగింది.

చివరకు కత్తిదాడి వెనుక ఎవరి ప్రమేయం లేదనీ, అతడు సెన్సేషన్ కోసమే ఎంపీపై దాడి చేశాడని పోలీసులు ధృవీకరించడం గమనార్హం. ఈనేపథ్యంలో సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని సీపీ శ్వేత సూచించారు. కాగా ఆ జిల్లా సీపీతో ఓ మంత్రి 'రిపోర్టు ఇచ్చేటప్పుడు, మీడియాతో మాట్లాడే ముందు ఒక్క మాట చెప్పొచ్చుకదా ?" అని అడిగినట్టు తెలిసింది. అందుకు సదరు సీపీ చిరునవ్వుతో సమాధానం దాటవేసినట్టు సమాచారం. ఆ చిరునవ్వు వెనుక ఎన్నికల కమిషన్ ఆదేశాలే కారణం కావచ్చు. ప్రభుత్వానికి సహకరించే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల మూకుమ్మడిగా వేటు వేసిన సంగతి తెలిసిందే.

తీస్తా సెతల్వాద్‌ను అరెస్టు చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

గతంలో ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంలో చాలా సమయం గడిచిందని, ఎలాంటి చార్జిషీట్ దాఖలు చేయలేదని వ్యాఖ్యానించింది. సంబంధిత విషయాలలో తీస్తా సెతల్వాద్‌కు కోర్టులు బెయిల్ మంజూరు చేసినందున, ఈ విషయంలో ఏమీ మనుగడ సాగించలేదని కూడా పేర్కొంది.

సెతల్వాద్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. గుజరాత్ ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. అహ్మదాబాద్‌లోని గుల్బర్గ్ హౌసింగ్ సొసైటీలో "మ్యూజియం ఆఫ్ రెసిస్టెన్స్" నిర్మాణానికి సేకరించిన నిధులను దుర్వినియోగం చేశారనే కేసుకు సంబంధించి సెతల్వాద్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు విచారించింది. ఇక్కడ 2002 మతపరమైన అల్లర్లలో 60 మందికి పైగా మరణించారు.

ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తుల మధ్య ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేనప్పటికీ, 2015లో అత్యున్నత న్యాయస్థానం ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేసింది. ఈ వ్యవహారం ఇంకా తేలకపోవడంతో తీస్తా సెతల్వాద్ అరెస్టుపై స్టే కొనసాగుతోంది. బుధవారం ఆదేశాల్లో స్టేను ధర్మాసనం పర్మినెంట్ చేసింది.

ఈ కేసులో తమ ముందస్తు బెయిల్ దరఖాస్తులను గుజరాత్ హైకోర్టు తిరస్కరించడంతో పౌర హక్కుల కార్యకర్త, ఆమె భర్త జావేద్ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నిన్న లక్ష్మీ.. నేడు సరస్వతి..

(మొదటిపేజీ తరువాయి)

వదులుతున్నట్టు తెలిసింది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ పిల్లర్ అక్టోబర్ 22న 2ఫీట్ల మేర కుంగిపోయిన విషయం విధితమే. 7వ బ్లాక్‌లోని 20వ నంబర్ పిల్లర్ కుంగింది. దానికి ఇరువైపులా ఉన్న 19,21 పిల్లర్లపై ఎఫెక్ట్ పడింది. కేంద్ర బృందం కూడా బ్యారేజీని పరిశీలించే తప్ప ఇంకా ఏమీ తేల్చిచెప్పలేదు. అయితే ప్రాజెక్టు నిర్మాణ దశలోనే నిర్మాణ లోపాలున్నాయని గతంలో ప్రచారం జరిగింది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలూ వచ్చాయి. ఈ క్రమంలోనే కాళేశ్వరం ప్రాజక్టు పరిధిలో వరుస సంఘటనలు చోటుచేసుకోవడంతో వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని ప్రతిపక్షాలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. కాగా, ఏటా జరిగే మెయింటెనెన్స్‌లో భాగంగా ఇలా చేస్తామని, గతేడాది కూడా ఇలానే లీకేజీ చేసి పరిశీలించామని ఇంజినీరింగ్ అధికారులు తెలపడం గమనార్హం.

బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదు : ఏ యాదగిరి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అన్నారం బ్యారేజీ

అన్నారం బ్యారేజీపై మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతుంది. బ్యారేజీకి ఢోకా లేదు. పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు రూమర్లు నమ్మవద్దు. ప్రతేడాది సహజంగా ఆపరేషన్ మెయింటెనెన్స్ చేస్తాం. 1275 మీటర్స్ లెంగ్త్‌లో రెండు చోట్ల సీపేజ్ ఉంది. కానీ, ఎక్కడ కూడా ఇసుక రావడం లేదు. ఇరిగేషన్‌శాఖ, ఆఫ్కాన్స్ సంస్థల మధ్య కాంట్రాక్టు ఉంటుంది. దాని నిర్వహణ బాధ్యత వాళ్లదే. సీపేజ్ ఉన్న చోట నీళ్లు తగ్గినప్పుడు మెటల్, సాండ్, ఫిల్టర్ మీడియా వేస్తున్నాం. సాండ్‌తోని రింగ్ బండ్ కూడా వేస్తున్నాం. ఏటా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ ఉంటుంది. ప్రాజెక్టు తట్టుకునే విధంగా సీపేజ్ వాటర్ అలో చేసేందుకు డిజైన్‌లోనే అరేంజ్‌మెంట్ ఉంటుంది. అవసరమైతే కెమికల్ గ్రౌటింగ్ కూడా వేస్తాం.

నాణ్యతాలోపం వల్లే ఇలా జరుగుతున్నాయి : ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య, అన్నారం

అన్నారం సరస్వతి బ్యారేజీ పనులు హడావిడిగా చేయడంతో నాణ్యతా లోపం వల్ల నీరు లీకేజీ అవుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం బ్యారేజీ నీరు లీక్ కావడం నాణ్యత లోపానికి నిదర్శనం. అంతేకాదు, బ్యాక్ వాటర్ వల్ల వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. కానీ రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు. దాంతో రైతులు ఏటా అరిగోస పడుతున్నారు.



వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అత్యంత వేగంగా సమీకరణలు మారుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఆయా పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15సార్లు ఎన్నికలు జరగ్గా ఎనిమిది సార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, రెండు సార్లు బీఆర్ఎస్, రెండు సార్లు ఇండిపెండెంట్లు గెలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి కొండా సురేఖ, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, బీజేపీ నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పోటీ చేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన నన్నపనేని నరేందర్ తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి వద్దిరాజు రవిచంద్రపై 28వేల782 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా సురేఖ, కాంగ్రెస్ అభ్యర్థి బస్వరాజ్ సారయ్యపై 55వేల 85 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. ఈసారి మూడు పార్టీల మధ్య పోటీ ఉన్నా నరేందర్, కొండా సురేఖ మధ్యే గట్టి పోటీ ఉండబోతుంది. 'తూర్పు' కోటపై జెండా పాతాలని ఎవరికివారే గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు.

వరంగల్ తూర్పులో వారిద్దరే...

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు

నరేందర్, కొండా సురేఖ మధ్యే పోటీ
15 విడతలు ఎన్నికలు జరగ్గా.. 8 సార్లు కాంగ్రెస్ విన్

నవతెలంగాణ-వరంగల్
ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 6సార్లు బీసీ నేతలే ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతూ వచ్చారు. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపనేని నరేందర్, కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ మధ్యే హోరాహోరీ పోరు ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు రంగంలో ఉన్నా పోటీ ముఖాముఖిగానే ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2014 నుంచి 2018 నాటికి బీఆర్ఎస్ మెజార్టీ సగానికి సగం తగ్గడం గమనార్హం. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న 'తూర్పు' నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్ జెండా పాతడానికి రంగం సిద్ధం చేసింది. అభివృద్ధి పేరిట బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్ ఇప్పటికే ప్రచారంలో వున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖ తన ప్రచారాన్ని ముమ్మరం చేయాల్సి ఉంది.

2014లో ఇక్కడ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన కొండా సురేఖకు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కకపోవడంతో బీఆర్ఎస్‌కు దూరమై చివరకు కాంగ్రెస్‌లో చేరారు. నాటి నుంచి 'తూర్పు' నియోజకవర్గానికి దూరమై 2018లో పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి ఈ ఎన్నికల్లో మళ్లీ 'తూర్పు'కు వచ్చి పోటీ చేస్తున్నారు. పాత పరిచయాలున్నా, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపి ఎన్నికల్లో విజయం సాధించడానికి పావులు కదపాల్సి వుంది. ఎమ్మెల్యేపై, బీఆర్ఎస్ పార్టీపై వున్న వ్యతిరేకత కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చే అవకాశం కనిపిస్తుంది.

'నన్నపనేని'పై అసంతృప్తి

బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌పై నియోజకవర్గంలో అసంతృప్తి ఉంది. 'నన్నపనేని' వ్యక్తిగత వ్యవహారశైలి మీద బీఆర్ఎస్ శ్రేణుల్లోనే వ్యతిరేకత వుంది.

'నన్నపనేని'ని వ్యతిరేకిస్తున్న నేతలు, కార్పొరేటర్లను తమవైపు తిప్పుకోవడానికి కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నియోజకవర్గంలో శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య వున్నా వారితో ఎమ్మెల్యేకు సమన్వయం లేదనేది బహిరంగ రహస్యమే. సొంత పార్టీ నేతలు, కార్పొరేటర్లపైనే 'నన్నపనేని' కేసులు పెట్టించి వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పలువురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించుకొని, భవిష్యత్ రాజకీయాలపై నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ పరిణామాలను కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మలచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలిసింది.

కేసీఆర్‌పై పోటీ అంటే

షబ్బీర్‌కు భయం..

రేవంత్‌రెడ్డి వస్తే.. గంపకింద కమ్ముదాం

అదానీ పంపుతున్న సిమెంట్, సలాకా పంచుతున్న బీజేపీ

కేసీఆర్ గెలిస్తే.. దళితులకు అసైన్డ్ భూములిస్తం: కేటీఆర్



నవతెలంగాణ-భిక్కనూర్/దోమకొండ

'గంప గోవర్ధన్ చేతిలో మూడుసార్లు ఓడిపోయిన షబ్బీర్ అలీ కేసీఆర్‌పై గెలవడం కష్టమని నిజామాబాద్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. కేసీఆర్‌పై పోటీ చేయడానికి రేవంత్‌రెడ్డి వస్తుండట. ఈసారి కూడా అదే గంప కింద రేవంత్‌రెడ్డిని కప్పి పెట్టాలి' అని మంత్రి కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. గంపగోవర్ధన్ కోరిక మేరకే కేసీఆర్ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారని, లక్ష మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్, దోమకొండ మండల కేంద్రాల్లో బుధవారం ప్రజాఆశీర్వాద సభలకు కేటీఆర్ హాజరై ప్రసంగించారు.

అదానీ పంపిస్తున్న సలాకా సిమెంటును బీజేపీ అభ్యర్థి పంపిణీ చేస్తున్నారని, దాన్ని ప్రతి ఒక్క కుల సంఘం తీసుకోవాలని, ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను చూసి ప్రజలు ఓటు వేస్తారని తెలిపారు. కేసీఆర్ కామారెడ్డి నుండి పోటీ చేసి గెలిస్తే కామారెడ్డిలో ఉన్న ప్రభుత్వ భూములు అమ్మేస్తారని ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాటలు నమ్మవద్దని, కామారెడ్డి నుంచి కేసీఆర్ గెలిచిన తర్వాత నియోజకవర్గంలో ఉన్న అసైన్డ్ భూములు దళితులకు ఇవ్వనున్నట్టు తెలిపారు. కేసీఆర్‌ను ఢీకొట్టడానికి ఇతర రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారని, కానీ కేసీఆర్ లోకల్ అని, రాష్ట్ర ప్రజల మధ్యలో ఉండి దేశానికి తెలంగాణ దిక్సూచిగా అభివృద్ధి చేయడం ఖాయమని స్పష్టం చేశారు. ఎవరెన్ని చెప్పినా, ఎవరు ఎన్ని డబ్బులు పంపిణీ చేసినా.. ఎన్నికల్లో మాత్రం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు సూచించారు.

మా పూర్వికుల స్వస్థలం కోనాపూర్

కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ మండలం పోసానిపల్లి గ్రామంలో మా నాయనమ్మ ఉండేవారని, నిజాం ప్రభుత్వం హయాంలో మానేరు ప్రాజెక్టులో మా భూములు కోల్పోవడంతో, నాటి నిజాం ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలతో చింతమడక గ్రామానికి వలస వెళ్లినట్టు కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ గెలిస్తే.. గజ్వేల్, సిద్ధిపేట కన్నా కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దోమకొండను మున్సిపాలిటీ చేయాలని, మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ కోరగా.. ప్రభుత్వం ఏర్పాటు తరువాత వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇతర పార్టీల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఉర్దూ చైర్మెన్ ముజీబుద్దీన్, మాజీ ఫుడ్ కమిటీ చైర్మెన్ తిరుమల్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్, మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, పట్టణ సర్పంచ్ తునికి వేణు, ఎంపీపీ గాల్ రెడ్డి, జడ్పీటీసీ పద్మ నాగభూషణం గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణ గౌడ్, సిద్ధ రాములు తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే సాంఘిక, ఆర్థిక, సమానత్వాన్ని సాధించాలని, రాజ్యాంగం యొక్క లక్ష్యం కూడా అదేనని, రాజకీయ ప్రజాస్వామ్యం సామాన్యులకు అందకపోతే బాధితులు ఈ రాజ్యాంగ వ్యవస్థను కూల్చేస్తారని నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగాన్ని పార్లమెంట్‌కు సమర్పిస్తూ అంబేద్కర్ హెచ్చరించారు. అందుకే రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలంటే దాని కోసం పోరాడే వారికే ఓటు వేసి గెలిపించండి.



నన్ను నేను నమ్ముకున్న ప్రతిసారీ
విజయం నన్నే వరించేది..
ఒకరిపై ఆధారపడిన
ప్రతిసారీ నన్ను నేను
నిందించుకోవలసి వచ్చేది..!!
చివరికి నాకర్థమయింది
స్వశక్తికి మించిన ఆస్తి లేదని!!"

– షేక్స్‌పియర్





సిద్ధమైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రచార రథాలు



డిజిటల్ లావాదేవీలపై నిఘా

బ్యాంకు ఖాతాలపై దృష్టి
రోజువారీ సమాచారం సేకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ – సిరిసిల్ల రూరల్



డిజిటల్ లావాదేవీలపై ఎన్నికల అధికార యంత్రాంగం నిఘా పెంచింది. ఎన్నికల ప్రచారం ప్రారంభం కావడంతో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి రాజకీయ నాయకులు వివిధ మార్గాల్లో తమ ప్రయత్నాలు ప్రారంభించారు. డబ్బు, మద్యంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు వేస్తున్న ఎత్తుగడలను అడ్డుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భాగంగా ఆదాయ పన్ను, పోలీస్ శాఖల అధికారులు బ్యాంకు ఖాతాలపై దృష్టి సారించారు.

ఎన్నికల ప్రచారంతో ఓటర్లను ప్రలోభ పెట్టే క్రమంలో డబ్బులు చేతులు మారుతున్నాయి. ఈ క్రమంలో పోలీసుల తనిఖీలూ మరింత తీవ్రమయ్యాయి. డబ్బుల తరలింపు కష్టతరం అవుతున్న నేపథ్యంలో ముఖ్య నేతలకు, ఓటర్లకు బ్యాంకు ఖాతాలు, డిజిటల్ లావాదేవీల ద్వారా చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో డిజిటల్ లావాదేవీలు పరిమితికి మించి జరుగుతున్నాయని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు యూపీఐ, బ్యాంకు ఖాతాలపై కూడా నిఘా పెంచారు. డిజిటల్ లావాదేవీలను పరిశీలించాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో అధికారులు సేవింగ్, కరెంట్ ఖాతాలతో పాటు జీరో బ్యాలెన్స్ ఖాతాలపై కూడా నిఘా పెట్టారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇంటర్నెట్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలతో పాటు పరిమితికి మించిన లావాదేవీలు నిర్వహించే ఖాతాల వివరాలను ఎన్నికల సంఘం ఆదాయ పన్ను శాఖ అధికారులకు అందజేయనుంది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ ప్రయివేటు రంగ బ్యాంకులు వందకు పైగా ఉన్నాయి. ఈ బ్యాంకుల్లోని ఖాతాలపై ఆదాయపు పన్ను, పోలీసు శాఖల అధికారులు నిఘా ఉంచారు. ముఖ్యంగా జీరో బ్యాలెన్స్ ఖాతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సాధారణంగా బ్యాంకుల్లో 49వేల లోపు నిర్వహించే లావాదేవీలపై ఎలాంటి ఆంక్షలూ ఉండవు. 50వేల పైన నిర్వహించే లావాదేవీలకు తప్పనిసరిగా పాన్ కార్డు వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. ఏమాత్రం అనుమానం కలిగినా సంబంధిత ఖాతాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. లక్ష రూపాయలకు మించి లావాదేవీలు జరిగే ఖాతాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, ఆసరా పింఛన్‌దారుల ఖాతాలపైన ఆరా తీస్తున్నారు.

పాలేరు నుంచి షర్మిల పోటీ



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

వైఎస్ఆర్ టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో ఉంటారు. ఈ నెల 6న నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించిన షర్మిల...రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్‌టీపీ తరుపున ఇంకా కొంత మంది అభ్యర్థులను ప్రకటించాల్సి ఉన్నది. ఆ పార్టీ తరుపున పోటీ చేసేందుకు ఇప్పటికే 550 దరఖాస్తులు వచ్చాయి.

పంచ్ తంత్రం!



ఒక్కొక్క వ్యక్తితో ఒడుపుగా మాట్లాడి
సరుకులమ్మితేగానీ సాగు షాపు
నిలువు జీతములెక్క నిలుచుండి రోజంతా
సేలుజేసినగాని కూలి దక్కు
యేండ్లకొద్దీ ప్లాను ఎంతెంతో శ్రమజేయ
అక్కరొచ్చిన దక్కునొక్కరూక
మనసంత కేంద్రించి ధనమెంతో వెచ్చించి
దీర్ఘకాలకృషితో మార్గమేయ

మిగిలితే వేయి రూకలు మిగులునేమో
నష్టభయమేమో నిరతంబు కష్టపెట్టు
ఇడుములిన్నింటి బడయనేల
రాజకీయాలలోజేరి దోచుకొనక

– ఏనుగు నరసింహారెడ్డి

ఉద్యమ పథంలో కెఎల్..

మూడు పర్యాయాలు ప్రజల ఎమ్మెల్యేగా సుస్థిర స్థానం

ఆయన క్రమశిక్షణ గల కమ్యూనిస్టు ఉద్దండుడు.. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల నాయకునిగా వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు.. టెనెన్సీ యాక్టు సవరణ, గిరిజన, రైతు సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి.. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో పార్టీ పిలుపునందుకుని శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసిన నేత మాజీ ఎమ్మెల్యే కెఎల్ నర్సింహారావు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరును ఆయన సూచించినది ఆయనే.

టెనెన్సీ యాక్టు సవరణ, గిరిజన, రైతు సమస్యలపై కృషిసల్పిన యోధుడు

- విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు నినాదంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా

ఆణిముత్యాలు..

నవతెలంగాణ-ఇల్లందు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు తాలూకా బేతంపూడి గ్రామంలో కొండపల్లి లక్ష్మీనర్సింహం (కేఎల్) జన్మించారు. ఆయన వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా కెఎల్.నర్సింహారావు ఆదర్శప్రాయులు. 1952లో అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపారు. 1957లో మద్రాస్ నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డప్పుడు ప్రోగ్రెసీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్(పిడిఎఫ్) నుంచి పోటీ చేసి హైదరాబాదు శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాడు సుందరయ్య ప్రతిపక్ష నేతగా, కెఎల్ ఉపనాయకునిగా పనిచేశారు. టెనెన్సీ యాక్టుకు సవరణకు ఆనాడు అసెంబ్లీలో కెఎల్ కృషి చేశారు. ఈ చట్టంలో 37, 37ఎ, 38ఈ సెక్షన్స్ ప్రవేశపెట్టించి కౌలుదారులకు మేలు చేశారు. 1962లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు నినాదంతో..

విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాగిన ఉద్యమంలో పార్టీ నిర్ణయం మేరకు తన శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1956లో ఆంధ్ర, హైదరాబాదు రాష్ట్రాలను కలిపే సమయంలో ఆంధ్రప్రదేశ్ పేరును కెఎల్ సూచించారు. దానికే ఎక్కువ మంది మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఫైనల్ చేసింది. దీంతో 1956 నవంబర్ ఒకటిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.



అరుణ ప్రస్థానం సాగించిన కెఎల్

1926 జూన్ 26న ఇల్లందు తాలూకాలోని బేతంపూడి గ్రామంలో కొండపల్లి రాంకిషన్‌రావు-అన్నపూర్ణమ్మలకు కెఎల్ నర్సింహారావు జన్మించారు. జమిందారీ కుటుంబం అయినప్పటికీ అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, మంచికంటి రాంకిషన్‌రావు, సర్వదేవభట్ల రామనాథంతో పరిచయం.. తద్వారా 1944లో కెఎల్ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆంధ్రమహాసభలో చేరి రామనాథంతో కలిసి 1944లో వరంగల్‌లో ఆజాంజాహి మిల్ వర్కర్స్ యూనియన్ స్థాపించారు. 1945లో రెండో ప్రపంచ యుద్ధ కాలంలో రైతు పోరాటం నిర్వహించి 13 నెలలపాటు జైలు జీవితం గడిపారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో..

కెఎల్ 15వ ఏటనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. చిన్నపిల్లవాడని పోలీసులు పొమ్మంటే "నేను పొట్టిగా ఉండి అలా కనపడుతున్నాను.. నాకు 20ఏండ్లు" అనడంతో జైల్లో వేశారు. 13 నెలలపాటు జైలు జీవితం గడిపారు. దొడ్డి కొమరయ్య బలిదానం వార్త విని చలించిపోయి జైలు గోడల మధ్యనే పాట రాశారు. కెఎల్ భార్య దుర్గాదేవి, కుమారులు, కూతురు, కోడళ్ళను మార్క్సిస్టు ఉద్యమపథంలో నిలిపారు. 2011 మార్చి 17న ఖమ్మంలో కన్నుమూశారు. ఆయన జీవితం నేటి తరం ప్రజలకు ఆదర్శప్రాయం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.